సూర్య 19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

గురువారం | 23 అక్టోబర్ 2025 | హైదరాబాద్

సంపుటి 19 | సంచిక 2

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...



☞ APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్

☞ నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్

☞ కరెంట్ అఫైర్స్

☞ నమూనా ప్రశ్నాపత్రాలు

☞ విద్యా ఉద్యోగ సమాచారం

'సూర్య' ఆన్‌లైన్ఎడిషన్ www.suryaepaper.com చూడండి.


అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : దక్షిణాయణం - వర్ష ఋతువు, బహుళ పక్షం, కార్తీక మాసం శుద్ధ విదియ రా.7.55 వరకు, విశాఖ తె.3.16 వరకు, వర్జ్యం ఉ.6.53 నుంచి 8.39 వరకు
రాహుకాలం మ.1.30 నుంచి 3.00 వరకు దుర్ముహూర్తం ఉ.9.52 నుంచి 10.39 వరకు తిరిగి మ.2.37 నుంచి 3.25 వరకు

## భారత్-అమెరికా
# వాణిజ్య ఒప్పందం

● రష్యా చమురుకు బ్రేక్? ● భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారుకు రంగం సిద్ధం ● భారత ఉత్పత్తులపై 50 శాతం నుంచి 15 శాతానికి సుంకాలు తగ్గించే అవకాశం ● ఇంధనం, వ్యవసాయ రంగాలే ఈ ఒప్పందంలో కీలకం ● రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ దిగుమతులు తగ్గించుకోనున్న భారత్ ● ప్రధాని మోడీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఫోన్‌లో కీలక చర్చలు



6 లో

## రెండేళ్లలో ఉస్మానియా నూతన
# ఆసుపత్రి నిర్మాణం

● పనుల వేగవంతానికి వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ ● రానున్న వందేళ్ల అవసరాలకు తగినట్లు వసతుల కల్పన ● పనుల తీరుపై తరచూ క్షేత్ర స్థాయిలో తనిఖీ ● ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణంపై తన నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.





2 లో

## రూపాయికి ఆర్బీఐ
# రక్షణ కవచం



● ఆగస్టులో 7.69 బిలియన్ డాలర్లను విక్రయించిన కేంద్ర బ్యాంక్ ● భారత కరెన్సీలో దీని విలువ సుమారు రూ. 67 వేల కోట్లు

## నేడు తెలంగాణ కేబినెట్ సమావేశం

ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకోనుంది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం న్యాయ నిపుణుల కమిటీ వేసింది. న్యాయ నిపుణుల రిపోర్ట్ ప్రభుత్వానికి చేరింది.



2 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## తెలంగాణలో అన్ని
# చెక్ పోస్టులు బంద్

● ప్రజల్లో అవగాహన కలిగించడానికి ట్రాన్స్‌పరెంట్‌గా ఆన్‌లైన్‌లో జరగడానికి ● చెక్కు పోస్టులను రద్దు చేస్తూ రెండు నెలల క్రితం నిర్ణయం ● తెలంగాణలో ఈవీ పాలసీ తీసుకొచ్చిన తర్వాత 577 కోట్ల టాక్స్ ప్రభుత్వం మినహాయించింది ● ఇవీ వెహికిల్ అమ్మకాల షేర్ నుండి 0.03 నుండి 1.13 షేర్ పెరిగింది ● రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

తెలంగాణ లో చెక్కు పోస్టులు రద్ద అమలు చేస్తూ జీవో జారీ చేశామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారుచెక్కు పోస్టుల రద్దు చేస్తూ ప్రజల్లో అవగాహన కలిగించడానికి , ట్రాన్సురెంట్ గా ఆన్లైన్ లో జరగడానికి చెక్కు పోస్టులను రద్దు చేస్తూ రెండు నెలల క్రితం నిర్ణయం తీసుకొని ఈరోజు చెక్కు పోస్టులు పూర్తిగా మూసివేస్తూ అమలు చేస్తున్నాం..తెలంగాణ లో ఈవి పాలసీ తీసుకొచ్చిన తర్వాత 577 కోట్ల టాక్స్ ప్రభుత్వం మినహించిందిఇవీ వెహికిల్ అమ్మకాల షేర్ నుండి 0.03 నుండి 1.13 షేర్ పెరిగిందిఢిల్లీలో పొల్యూషన్ లో ఉండే పరిస్థితి లేదు.. ఇక్కడ అలాంటి పరిస్థితి లేకుండా ఉండడానికి ఇవి పాలసీ తీసుకొచ్చాంనగరంలో 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలకు అనుమతి ఇచ్చాం.



2 లో

## అభివృద్ధికి కాంగ్రెస్‌కు
# పట్టం కట్టండి



● ఇప్పటికే రూ.150 కోట్ల పనులు మంజూరు ● పేదల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, ఉచిత బస్సు రవాణ, లక్షల సంఖ్యలో రేషన్ కార్డులు పంపిణీ చేశాము ● పేదల కడుపు నింపేందుకు సన్న బియ్యం ఇస్తున్నాం ● మంత్రి సీతక్క

వివరాలు-2లో

## సైన్స్ ఆవిష్కరణలకు
# కేంద్రంగా హైదరాబాద్

● యువ ఆవిష్కర్తలు దూసుకు వెళ్తున్నారు ● ప్రపంచస్థాయి వ్యవస్థల రూపకల్పనకు కేంద్రంగా తెలంగాణ ● పరిశోధనా సంస్థలు, పెట్టుబడిదారులకు స్వాగతం ● ప్రపంచ స్థాయి మౌలిక వస్తువుల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది ● జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



2 లో

పండిట్ జవహర్లాల్ నెహ్రూ కాలం నుంచి సైన్స్ ఆవిష్కరణలకు హైదరాబాద్ కేంద్రంగా విరాజిల్లుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం జేఆర్‌సీ కన్వెన్షన్ లో నిర్వహించిన బయో ఇన్‌స్పయిర్ ఫ్రాంటియర్స్ 2025 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ స్పేస్ ఎకానమీ, బయోమిమిక్రి ఎక్స్‌ట్రాటెరెస్ట్రియల్ రిసోర్స్ సదస్సులో ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం ప్రసంగించారు. ప్రపంచ స్థాయి వ్యవస్థల రూపకల్పనకు కేంద్రంగా తెలంగాణ నిలిచింది అన్నారు. హైదరాబాద్ కు ప్రపంచ స్థాయి పరిశోధన సంస్థలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పక్షాన ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు.

## అంతా ఇంతే!




ధర తగ్గినప్పుడే అడ్వాన్స్‌గా ఓటర్లకు బంగారం పంచేద్దాం!

# నేడు నిరుద్యోగుల సదస్సు

● జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి ● 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి ● నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి ● బీసీ నేత, ఎంపీ ఆర్. కృష్ణయ్య

2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ అర్ కృష్ణయ్య డిమాండ్ చేసారు. గత 2 సంవత్సరాల కాలంలో ఏలు నోటిఫికేషన్లు కలిపి 50వేల ఉద్యోగాలు కుడా భర్తీ చేయలేదని ధ్వజమెత్తారు. మిగతా ఉద్యోగాలు ఎన్ని భర్తీ చేస్తారని ప్రశ్నించారు. ఇంకా అనేక ప్రభుత్వశాఖలలలో పెద్ద యెతున యున్న ఖాళీలను భర్తీ చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.



3 లో

## బీహార్ ఎన్నికల్లో
# మోదం-ఖేదం



6 లో

● గుట్టుగా చక్కబెట్టుకున్న ఎన్డీఏ ● మహాకూటమిలో సీట్ల కుంపటి! ● 8 అసెంబ్లీ సీట్లలో మహా కూటమిలోని మిత్రపక్షాల ఢీ ● 243 స్థానాలకుగానూ 254 చోట్ల విపక్ష కూటమి పోటీ ● అంతర్గత ఘర్షణలతో గుల్లబారుతున్న విపక్ష కూటమి

## సామాన్యుడికి భారం కాకుండా
# కార్పొరేట్ వైద్యం

● పోలీసులను వారి కుటుంబాలను కాపాడుకోవడం మన బాధ్యత ● ప్రభుత్వం సమాజ భాద్యతతో ప్రజల ఆరోగ్యం, విద్య, వైద్యంకు ఎంతో ప్రాధాన్యత ● రాష్ట్రంలో 160 డయాలసిస్ కేంద్రాలు ● ప్రతి 30 కిలోమీటర్‌ల పరిధిలో డయాలసిస్ సెంటర్‌ల ఏర్పాటుకు మరో 80 కేంద్రాలను ఏర్పాటు ● సంగారెడ్డి జిల్లాలో మెడికల్ కాలేజీ, 500 బెడ్స్ ప్రభుత్వ ఆసుపత్రి ● మంత్రి దామోదర్ రాజనరసింహా



2 లో



నేను సముద్రం వంటి మానవులను చూశాను - బయట నిశ్శబ్దంగా, కానీ లోపల ఉధృతంగా ఉంటుంది.
-జావేద్ అక్తర్



కత్తి కంటే కలం ఎక్కువ ప్రభావం చూపుతుంది.
-మున్షీ ప్రేమ్‌చంద్



మనస్సు భయం లేకుండా, తల ఎత్తుగా ఉన్న చోట... స్వేచ్ఛా స్వర్గంలోకి, నా తండ్రీ, నా దేశాన్ని మేల్కొల్పు.
-ఠాగూర్

# రెండేళ్లలో ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి

● పనుల వేగవంతానికి వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ ● రానున్న వందేళ్ల అవసరాలకు తగినట్లు వసతుల కల్పన ● పనుల తీరుపై తరచూ క్షేత్ర స్థాయిలో తనిఖీ ● ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణంపై తన నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనుల వేగవంతానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రతి పది రోజులకోకసారి సమావేశమై ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యాక అక్కడి బందోబస్తు.. ట్రాఫిక్ విధుల నిర్వహణకు సంబంధించి ముందుస్తుగానే తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసు శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఆసుపత్రికి వివిధ రహదారులను అనుసంధానించే ప్రణాళికలు ఇప్పటి నుంచే రూపొందించాలని ఆర్ అండ్ బీ అధికారులకు సీఎం సూచించారు...హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల నిర్మాణానికి సంబంధించి ప్రతి నిర్మాణానికి ఒక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిర్మాణాలపై 24%7 ఆ అధికారి పర్యవేక్షించేలా పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించాలని సీఎం సూచించారు. వచ్చే జూన్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు వికాస్‌రాజ్, క్రిస్టియానా జోంగ్తూ, ఇలంబర్తి, ముషారప్ అలీ ఫరూఖీ, హరిచందన తదితరులు పాల్గొన్నారు.

## రహదారులపై చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయండి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : రాష్ట్రంలోని అన్ని రహదారులపై రవాణా చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలను అనుసరించి చెక్ పోస్టుల ఎత్తివేతపై రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నిన్న బుధవారం సాయంత్రం 5 గంటల నుండి మూసివేతపై పూర్తి నివేదికను ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సీఎం ఆదేశాలతో తక్షణమే చెక్‌పోస్టుల కార్యకలాపాలు నిలిపివేయాలని ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఆకస్మిక ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బందిని వెంటనే వేరే బాధ్యతల్లో వినియోగించుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, చెక్ పోస్టుల వద్ద బోర్డులు, బ్యారికేడ్లు, తొలగించాలని డీటీవోలకు సూచించారు. చెక్కపోస్టుల వద్ద ఉన్న రికార్డులు, పరికరాలు, ఫర్నిచర్‌ను డీటీవో కార్యాలయాలకు తరలించాలని ఆదేశించారు. అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని ఆదేశించారు.

# సైన్స్, ఆవిష్కరణలకు కేంద్రం హైదరాబాద్

● యువ ఆవిష్కర్తలు దూసుకు వెళ్తున్నారు ● ప్రపంచస్థాయి వ్యవస్థల రూపకల్పనకు కేంద్రంగా తెలంగాణ ● పరిశోధనా సంస్థలు, పెట్టుబడిదారులకు స్వాగతం ● ప్రపంచ స్థాయి మౌలిక వస్తువుల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది ● జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : పండిట్ జవహర్లాల్ నెహ్రూ కాలం నుంచి సైన్స్ ఆవిష్కరణలకు హైదరాబాద్ కేంద్రం గా విరాజిల్లుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం జేఆర్‌సీ కన్వెన్షన్ లో నిర్వహించిన బయో ఇన్‌స్పయిర్ ఫ్రాంటియర్స్ 2025 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ స్పేస్ ఎకానమీ, బయోమిమిక్రి %ు% ఎక్స్‌ట్రాటెరెస్ట్రియల్ రిసోర్స్ సదస్సులో ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం ప్రసంగించారు. ప్రపంచ స్థాయి వ్యవస్థల రూపకల్పనకు కేంద్రంగా తెలంగాణ నిలిచింది అన్నారు. హైదరాబాద్ కు ప్రపంచ స్థాయి పరిశోధన సంస్థలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పక్షాన ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతుల కల్పనకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది అన్నారు.

హైదరాబాదు నగరానికి ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన శాస్త్రవేత్తలు, పరిశ్రమ నాయకులు, ఆవిష్కర్తలకు ఆయన స్వాగతం తెలిపారు. శాస్త్ర సున్నితత్వం మరియు కల్పనాత్మకత కవిత్వం కలిసిన ఈ నగరం ఎప్పుడూ సృజనాత్మకతకు నిలయంగా నిలిచింది అన్నారు. బయోఇన్స్పైర్డ్ ఫ్రాంటియర్స్ 2025జీవశాస్త్రం, సాంకేతికత, అంతరిక్ష అన్వేషణల మధ్య జరుగుతున్న ఈ ప్రపంచ స్థాయి సంభాషన భారత శాస్త్రీయ గమ్యాన్ని అర్థ శతాబ్దానికి పైగా నిశ్శబ్దంగా మలిచిన ఈ నగరంలో జరుగుతుండటం గర్వకారణం అన్నారు. హైదరాబాద్‌కు సైన్స్ తో ఉన్న అనుబంధం లోతైనది మరియు చిరకాల మైనది అన్నారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో ఈ నగరంలో అనేక శాస్త్రీయ సంస్థలు పునాది వేసుకున్నాయి అని వివరించారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ మునుపటి హైదరాబాద్‌ను భారతదేశపు "ఆకాశనేత్రం"గా మార్చింది. ఉపగ్రహ చిత్రాలను వ్యవసాయం, నీటి వనరులు, విపత్తు నిర్వహణలో వినియోగిస్తూ మార్గదర్శిగా నిలిచిందని తెలిపారు. రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ ఇక్కడ డిఆర్‌డీఎల్ డీఎంఆర్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రయోగశాలలను స్థాపించి, దేశానికి క్షిపణి, పదార్థ సైన్స్ లో నైపుణ్యాన్ని అందించిన తరతరాల శాస్త్రవేత్తలను తీర్చిదిద్ది ఘనత హైదరాబాద్ కు సొంతం అన్నారు. ఇవే కాకుండా భారత్ డైనమిక్స్ లిమిటెడ్, మిశ్ర ధాతు నిగమ్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఈసీఐఎల్ వంటి పబ్లిక్ రంగ సంస్థలు కూడా క్కడే ఎదిగి, దేశానికి విమానయాన, లోహశాస్త్రం, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో బలమైన పునాది వేశాయి అని తెలిపారు. ఈ దశాబ్దాల ప్రజా పెట్టుబడి, శాస్త్రీయ స్ఫూర్తి కలయికతో రూపుదిద్దుకున్న ఈ పరిసర వ్యవస్థే హైదరాబాద్‌కు ప్రత్యేకమైన "సైన్స్ డీఎన్ఏని ఇచ్చింది,అది క్రమశిక్షణతో కూడినది, సృజనాత్మకమైనది, నిశ్శబ్దంగా కానీ స్పష్టమైన ఆశయాలతో కూడింది అన్నారు. ఈ వారసత్వాన్ని నేటి యువ ఆవిష్కర్తలు కొత్త ఉత్సాహంతో ముందుకు తీసుకెళ్తున్నారని డిప్యూటీ సీఎం ఆనందం వ్యక్తం చేశారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇక్కడే హైదరాబాద్‌లో జన్మించి, భారతదేశంలోనే ప్రైవేట్ రంగం ద్వారా రాకెట్ ప్రయోగాలు సాధ్యమని నిరూపించింది. వారి విజయం కేవలం ఉత్పత్తి కాదు, ఒక కొత్త ఎకోసిస్టమ్‌ను సృష్టించింది: ప్రొపల్షన్ ఇంజనీర్లు, కాంపోజిట్ నిపుణులు, స్పేస్ సరఫరాదారులు అనే కొత్త తరాన్ని పెంచింది అని వివరించారు. ధ్రువ స్పేస్, మరో హైదరాబాద్ ఆధారిత సంస్థ, ఉపగ్రహ రూపకల్పన నుండి తయారీ, ప్రయోగం, గ్రౌండ్ స్టేషన్ల వరకు సంపూర్ణ పరిష్కారాలను చూపుతుంది, మనం ప్రపంచ స్థాయి వ్యవస్థలను మన రాష్ట్రంలోనే రూపకల్పన చేయగలమని చూపిస్తోంది అని తెలిపారు. ఇవన్నీ చుట్టూ రోబోటిక్స్, పదార్థ శాస్త్రం, 3 డీ ప్రింటింగ్ రంగాల్లో కొత్తగా ఎదుగుతున్న సంస్థలు కలిసి భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థకు కొత్త రూపాన్ని ఇస్తున్నాయి అన్నారు. ఇవి ఒంటరిగా పని చేయడం లేదు. ఇవి హైదరాబాద్‌లోని ఐఐటీ హైదరాబాద్, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, వంటి సంస్థలతో బలమైన అనుసంధానం కలిగి ఉన్నాయి అని తెలిపారు. ఇదే తెలంగాణా మోడల్ ఆఫ్ ఇన్నోవేషన్, ప్రభుత్వ సంస్థలు పునాది వేస్తాయి, స్టార్టప్‌లు దానిపై నిర్మిస్తాయి, విశ్వవిద్యాలయాలు ప్రతిభను పెంపొంది స్తాయి అని వివరించారు. ఈరోజు హైదరాబాద్ భారతదేశంలోని అత్యంత విభిన్న సాంకేతిక ఎకోసిస్టమ్‌లలో ఒకటిగా నిలిచింది, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, రక్షణ, ఇప్పుడు అంతరిక్ష సాంకేతికతలో ప్రపంచ నాయకులకు ఆతిథ్యం ఇస్తోంది అన్నారు. అదిబట్లలో ఏరోస్పేస్ మాన్యుఫాక్చరింగ్

ప్రతి క్లస్టర్‌లో మూడు విలువలు ప్రధానంగా ఉంటాయి. ఆవిష్కరణ, తయారీ, సుస్థిరత అని వివరించారు. ఇస్రో అనుబంధ సౌకర్యాలు, టెలీమెట్రీ కేంద్రాలు, ఇన్క్యూబేషన్ స్థలాలు హైదరాబాద్‌ను భవిష్యత్తు అంతరిక్ష మిషన్లకు ప్రధాన కేంద్రంగా నిలిపాయి అని డిప్యూటీ సీఎం తెలిపారు. అవి చంద్రయానం కావొచ్చు, భూమి పరిశీలన కావొచ్చు, లేదా అంతరిక్ష వనరుల వినియోగం కావొచ్చు అన్నారు. ఈ కాన్ఫరెన్స్ థీమ్"బయోఇన్స్పైర్డ్ ఫ్రాంటియర్స్"మనకు ఒక లోతైన విషయం గుర్తు చేస్తుంది ప్రకృతే అసలు ఇంజనీర్ అని డిప్యూటీ సీఎం విశ్లేషించారు. అత్యంత అందమైన రెక్కలు, కవచాలు, న్యూరల్ నెట్వర్క్స్ వంటివి ప్రకృతిలో ఇమిడి ఉన్నాయి అన్నారు. మన కర్తవ్యం ప్రకృతిని మించి పోవడం కాదు, దానినుంచి నేర్చుకోవడం అని వివరించారు. తెలంగాణా ప్రభుత్వం ఈ తత్వాన్ని తన అభివృద్ధి దృక్పథంలో భాగం చేస్తోంది, బయోమిమెటిక్ డిజైన్, గ్రీన్ బిల్డింగ్ కోడ్స్, నీటి నిర్వహణ, శుద్ధ ఇంధనం రంగాల్లో దీన్ని ప్రోత్సహిస్తోంది అని వివరించారు. అంతరిక్షంలోకి విస్తరించేప్పుడు కూడా మనం ఈ వినయాన్ని తీసుకెళ్లాలి, ఆవిష్కరణ, సంరక్షణ రెండూ కలిసి రెండు కాళ్ళ మాదిరిగా నడవాలి అన్నారు. భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ రాబోయే దశాబ్దంలో విపరీతంగా పెరగబోతోంది. ఆ వృద్ధికి తెలంగాణా లాంచ్‌ప్యాడ్‌గా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది అన్నారు. ప్రపంచంలోని పరిశోధనా సంస్థలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలను హైదరాబాద్‌కి ఆహ్వానిస్తున్నాము అన్నారు. సహాయక విధాన వాతావరణం, ఇన్క్యూబేషన్ సపోర్ట్, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది అన్నారు. హైదరాబాద్ ఈరోజు కేవలం ఒక గమ్యం కాదు, ఒక మనస్తత్వం: విచారణాత్మకమైనది, ఆత్మవిశ్వాసంతో కూడినది అన్నారు. ఈ రోజు ఇక్కడ మొదలైన చర్చలు భవిష్యత్తులో భూమి మీదా, అంతరిక్షంలోనూ మంచిని నిర్మించే భాగస్వామ్యాలుగా మారాలని కోరుకుంటున్నాను అన్నారు. తెలంగాణా ఎల్లప్పుడూ ప్రభుత్వ సంస్థలను ప్రేరేపించే, స్టార్టప్‌లు ఆవిష్కరించే, ప్రపంచ శాస్త్రం కలిసే ప్రదేశంగా ఉంటుందని స్పష్టం చేశారు. జ్ఞానం మరియు అన్వేషణ మధ్య వంతెనగా, భూమి మరియు ఆకాశం మధ్య సేతువుగా హైదరాబాద్ మహానగరం ఎప్పటికీ నిలవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. సమావేశంలో ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, సీఈవో ఎం అబ్బాస్, లీడ్ స్పాన్సర్ సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడికి భారం కాకుండా ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ వైద్యం

● పోలీసులను వారి కుటుంబాలను కాపాడుకోవడం మన బాధ్యత ● ప్రభుత్వం సమాజ భాధ్యతతో ప్రజల ఆరోగ్యం, విద్య, వైద్యంకు ఎంతో ప్రాధాన్యత ● రాష్ట్రంలో 160 డయాలసిస్ కేంద్రాలు ● ప్రతి 30 కిలోమీటర్‌ల పరిధిలో డయాలసిస్ సెంటర్‌ల ఏర్పాటుకు మరో 80 కేంద్రాలను ఏర్పాటు ● సంగారెడ్డి జిల్లాలో మెడికల్ కాలేజీ ,500 బెడ్స్ ప్రభుత్వ ఆసుపత్రి ● మంత్రి దామోదర్ రాజనరసింహ

సంగారెడ్డి మేజర్ న్యూస్ ప్రతినిధి....సంగారెడ్డి జిల్లా పోలీస్, ఐఎంఏ , ఎన్ఎంజే క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం లోని పీఎస్ఆర్ గార్డెన్ లో జిల్లా పోలీసు కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన సమగ్ర ఆరోగ్య శిబిరం ను రాష్ట్ర వైద్య, అరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో మంత్రి మాట్లాడారు . పోలీసులను వారి కుటుంబాలను కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు.ప్రభుత్వం సమాజ భాధ్యత తో ప్రజల ఆరోగ్యం , విద్య , వైద్యం కు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు . పోలీసు కుటుంబాల కోసం సమగ్ర ఆరోగ్య శిబిరం ను నిర్వహించటం చక్కని ఆలోచన అన్నారు 13 రకాల వైద్య నిపుణులైన డాక్టర్ లు ఈ హెల్త్ క్యాంప్ లో పాల్గొంటున్నారన్నారు. గ్రామీణ ప్రాంతం నుండి పట్టణ ప్రాంతాల వరకు ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నామన్నారు. సామాన్యుడికి భారం కాకుండా అందరికీ అందుబాటులో ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ వైద్యం అందించడమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహా. ప్రతి రోజు డయాలసిస్ రోగుల సంఖ్య పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో 160 డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయన్నారు . ప్రతి 30 కిలోమీటర్ ల పరిధి లో డయాలసిస్ సెంటర్ ల ఏర్పాటు కు మరో 80 కేంద్రాలను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి వెల్లడించారు. త్వరలో 80 ట్రామా సెంటర్స్ కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. హై వే లపై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ లను గుర్తించి గోల్డెన్ అవర్ ను దృష్టిలో పెట్టుకొని అక్కడ ట్రామా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి జిల్లాలో డే కేర్ క్యాన్సర్ సెంటర్ ను ఏర్పాటు చేసి కీమో థెరపీ అందిస్తున్నామన్నారు. సంగారెడ్డి జిల్లాలో మెడికల్ కాలేజీ ,500 బెడ్స్ ప్రభుత్వ ఆసుపత్రి , అందోల్ లో నర్సింగ్ కాలేజీ , సంగారెడ్డి లో పారామెడికల్ కాలేజీ , క్రిటికల్ కేర్ బ్లాక్ , 5 న్యూ పీహెచ్సీ లను , 3 న్యూ పిహెచ్సి బిల్డింగ్ లను ప్రారంభించామన్నారు . జిల్లాలో వాట్పల్లి లో సిహెచ్సి , తెల్లాపూర్ లో యుపిహెచ్సి లను ఏర్పాటు చేశామన్నారు . పటాన్ చెరువు , నారాయణ ఖేడ్ ఏరియా ఆసుపత్రులలో , సిహెచ్సి సదాశివపేట లో డయాలిసిస్ సెంటర్స్ లను ఏర్పాటు చేశామన్నారు . వీటితో పాటు మరో 3 సబ్ హెల్త్ సెంటర్స్



లను మంజూరు చేశామన్నారు. ఈ సందర్భంగా హెల్త్ క్యాంపు లో ఏర్పాటు చేసిన అన్ని విభాగాలను పరిశీలించారు . కియోస్క్ ద్వారా మంత్రి బిపి చెక్ చేసుకున్నారు. ఈ కార్యక్రమం లో టీజీఐఐసి చేర్మన్ నిర్మల జగ్గారెడ్డి,కలెక్టర్,పి ప్రావీణ్య,ఎస్పీ పరితోష్ పంకజ్., ప్రముఖ వైద్యులు డా కిరణ్ కుమార్ , ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డా రాజు గౌడ్ , సెక్రటరీ డా ఆనంద్ , డా శ్రీధర్ , డా శ్రీహరి లు , జిల్లా పోలీస్ అధికారులు , వారి కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణలో చెక్ పోస్టులు బంద్

● ప్రజల్లో అవగాహన కలిగించడానికి ,ట్రాన్స్పరెంట్‌గా ఆన్‌లైన్‌లో జరగడానికి చెక్కు పోస్టులను రద్దు చేస్తూ రెండు నెలల క్రితం నిర్ణయం ● తెలంగాణ లో ఈవి పాలసీ తీసుకొచ్చిన తర్వాత 577 కోట్ల టాక్స్ ప్రభుత్వం మినహాయించింది ● ఇవీ వెహికిల్ అమ్మకాల షేర్ నుండి 0.03 నుండి 1.13 షేర్ పెరిగింది ● రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణ లో చెక్కు పోస్టులు రద్ద అమలు చేస్తూ జీవో జారీ చేశామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారుచెక్కు పోస్టుల రద్దు చేస్తూ ప్రజల్లో అవగాహన కలిగించడానికి , ట్రాన్సురెంట్ గా ఆన్లైన్ లో జరగడానికి చెక్కు పోస్టులను రద్దు చేస్తూ రెండు నెలల క్రితం నిర్ణయం తీసుకొని ఈరోజు చెక్కు పోస్టులు పూర్తిగా మూసివేస్తూ అమలు చేస్తున్నాం..తెలంగాణ లో ఈవి పాలసీ తీసుకొచ్చిన తర్వాత 577 కోట్ల టాక్స్ ప్రభుత్వం మినహించిందిఇవీ వెహికిల్ అమ్మకాల షేర్ నుండి 0.03 నుండి 1.13 షేర్ పెరిగిందిఢిల్లీలో పొల్యూషన్ లో ఉండే పరిస్థితి లేదు.. ఇక్కడ అలాంటి పరిస్థితి లేకుండా ఉండడానికి ఇవి పాలసీ తీసుకొచ్చాంనగరంలో 20 వేల ఎలక్ట్రిక్ ఆటో లకు అనుమతి ఇచ్చాం.. ఎల్పిజి, సి ఎన్ జి ఆటో లకు 10 వేలు చొప్పున అనుమతి ఇచ్చాం.. 25 వేల రేటిరోఫిటింగ్ ఆటో లకు అనుమతి ఇచ్చాంరాష్ట్రంలో వాహన్ అమలవుతుంది..సారథి త్వరలోనే తీసుకొస్తాంస్క్రాపింగ్ పాలసీ తీసుకొచ్చాం..వాహనాలకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేడియం స్టిక్కర్స్ అమలయ్యేలా తెచ్చాం. ఏ ఐ టెక్నాలజీ ను ఉపయోగించి రవాణా శాఖ కార్యాలయాల్లో రికార్డ్ చేస్తూ రెగ్యులర్ గా వచ్చే వాళ్ళని నోట్ చేసి హెడ్ ఆఫీస్ కి అలెర్ట్ చేస్తుంది..అలాంటి వాటిని నిరోధించడానికి ఉపయోగిస్తున్నాం. వెహికిల్ ట్రాకింగ్ ప్రాసెస్ కొనసాగిస్తున్నాం.డ్రైవింగ్ మీద మంచి నైపుణ్యాలు పెంచడానికి అవగాహన కలిగించడానికి కార్యక్రమాలు రోడ్ సేఫ్టీ పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాం.రోడ్ సేఫ్టీ చిల్డ్రన్ అవేర్నెస్ పార్క్ లు ఏర్పాటు చేస్తున్నాం.. నాచారం లో గవర్నర్ ప్రారంభించారు.. కరీంనగర్ లో ప్రారంభించుకున్నాం.ఆటోమేటిక్ డ్రైవింగ్ లైసెన్స్ సిస్టమ్ తీసుకొస్తున్నాం,టూరిజం వెహికల్స్ కి డబుల్ నెంబర్ ప్లేట్ తో పోతున్నాయని ఆరోపణల నేపథ్యంలో హై సెక్యూరిటీ ప్లేట్స్ తీసుకొస్తున్నాం.రోడ్ సేఫ్టీ క్లబ్స్ కాలేజీలలో జూనియర్, డిగ్రీ ఇతర వాటిలో అవగాహన కల్పించేలా ఏర్పాటు చేస్తున్నాం.కేంద్ర ప్రభుత్వం క్యాష్ లెస్ ట్రీట్మెంట్ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది.. దాని అమలు పై మెడికల్ , పోలీస్, నేషనల్ హైవేస్ తో సమీక్షా సమావేశం జరిగింది.రవాణా శాఖ రెవెన్యూ కలెక్షన్ చేసే డిపార్ట్మెంట్.. 112 మందిలను నియమించి వారికి శిక్షణ ఇచ్చి తీసుకున్నాం.నలుగురు ఆర్టీవో లను గ్రూప్ 1 ద్వారా వచ్చారు. రవాణా శాఖ కు ఒక లోగో తీసుకొచ్చాం తెలంగాణ పోలీస్ ,ఫారెస్ట్ మాదిరి లోగో తీసుకున్నాం..ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలి.ఇల్లీగల్ , ఓవర్ లోడింగ్ ఎన్ఫోర్స్ మెంట్ పై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నాం.చెక్కు పోస్టులు రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ ప్రజలకు చేస్తున్నాం. రాష్ట్రంలో1.7 కోట్ల వాహనాలు ఉన్నాయి.. వాటన్నిటిని రోడ్ ప్రమాదాలు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నాం.డిపార్ట్మెంట్ లో పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.పాత వాహనాలు డబుల్ నంబరింగ్ అరికట్టడానికి మైనింగ్,ఇతర వాహనాలకు మొదటగా చూస్తున్నాం.రవాణా శాఖ లోని 63 కేంద్రాల్లో కెమెరా ల ద్వారా పర్యవేక్షణ జరుగుతుంది..బ్రోకర్ వ్యవస్థను అరికట్టడానికి కఠినచర్యలు తీసుకుంటున్నాం.పోలీస్ శాఖ ,ఆర్టీసీ ఇతర విభాగాలలో పాత వాహనాలకు స్క్రాప్ కి పంపించాలని లేఖ రాసం..చెక్కు పోస్టులను రద్దు చేయాలని నేనే ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకుపోయి కేబినెట్ లో పెట్టడం జరిగింది..వచ్చే ఆదాయాన్ని ఆన్లైన్ ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం.గత 10 సంవత్సరాల్లో పాపాల పుట్ట లాగ అవినీతి జరిగింది..వాహన్ సారథి లో 28 రాష్ట్రాలు ఉన్నాయి గత 10 సంవత్సరాలుగా తెలంగాణ ఎందుకు చేరలేదు..ఇప్పుడు మేము వాహన్ సారథి లో చేరాం.. డేటా ట్రాన్ఫర్మింగ్ జరుగుతుంది.. వాహన్ అమలు చేస్తున్నాం.. సారథి అమలు చేస్తాం..చెక్కు పోస్టులు రద్దు చేసిన వాహనాల్లో అక్రమ రవాణా జరగకుండా ఎన్ఫోర్స్మెంట్ ఎక్కువగా చేస్తాం..

## నేడు తెలంగాణ కేబినెట్ సమావేశం..

కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం..



హైదరాబాద్: గురువారం నాడు తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ అవ్వనుంది. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకోనుంది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం న్యాయ నిపుణుల కమిటీ వేసింది. న్యాయ నిపుణుల రిపోర్ట్ ప్రభుత్వానికి చేరింది. కేబినెట్ ఈ నివేదికపై చర్చించి బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై సమాలోచనలు జరపనుంది. అంతేకాదు.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న ఇద్దరు పిల్లల నిబంధనను రద్దు చేసే ఆర్డినెన్స్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. ఎస్-ఎల్‌బీసీ పునరుద్ధరణ, కాళేశ్వరం పునరుద్ధరణ, తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల నిర్మాణం సహా పలు నీటి పారుదల ప్రాజెక్టులపై కేబినెట్ చర్చించనుంది. అలాగే ఎస్ఆర్ఎస్‌పీ రెండో దశకు రామిరెడ్డి దామోదర్ రెడ్డి పేరుకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. వీటితోపాటు మరికొన్ని ప్రభుత్వ పాలసీ విధానాలపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

## తెలంగాణ ఆవిర్భావంలో కోదండ రామ్ పాత్ర చరిత్రలో నిలిచిపోయేది

● నిస్వార్థంగా నిజాయితీగా రాష్ట్ర సాధన కోసం కోదండ రామ్ కృషి చేశారు ● పదేళ్ల బీఆర్ఎస్ పాలన ఎలా గాడి తప్పిందో ప్రజలకు తెలుసు ● టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక నేపథ్యంలో రాజకీయ చర్చలు వేడెక్కాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బుధవారం తెలంగాణ జన సమితి (టీజేఎస్) కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండ రామ్‌ను కలిశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలన్న అంశంపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. కోదండరామ్‌తో జరిగిన సమావేశం అనంతరం టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావంలో కోదండరామ్ పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఆయన నిస్వార్థంగా, నిజాయితీతో రాష్ట్ర సాధన కోసం కృషి చేశారని గుర్తుచేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఎలా నిరంకుశంగా మారిందో అందరికీ తెలుసని మహేష్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ పాలన నుంచి విముక్తి కోసం కాంగ్రెస్, టీజేఎస్ సహా ప్రజాసంఘాలన్నీ కలిసి 2023 ఎన్నికల్లో పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. "కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంలో టీజేఎస్ సహకారం ఎంతో విలువైనది. దాన్ని మేము ఎప్పటికీ మరవం," అని తెలిపారు. ఉద్యోగ నియామక రూపకల్పనలో కోదండరామ్ సలహాలు, సూచనలు ఎంతో విలువైనవని మహేష్ గౌడ్ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా పాలన కొనసాగుతుందని హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో యువ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని టీజేఎస్‌ను కోరారు. సీపీఐ, సీపీఎం, ఏఐఎంఐఎం మాదిరిగా టీజేఎస్ మద్దతు కూడా కోరినట్లు తెలిపారు.

ఇక బీజేపీ నేతలపై తీవ్రంగా విరుచుకుపడ్డ ఆయన "కేంద్రమంత్రి స్థాయిలో ఉన్న బండి సంజయ్ ఏమి మాట్లాడుతున్నారో తనకే అర్థమవుతున్నదా? మత విద్వేషాలు రెచ్చగొట్టి, సెంటిమెంట్లు రాజేసి లబ్ధి పొందాలన్నదే బీజేపీ పన్నాగం," అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మతవాద శక్తులకు బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. మిత్రపక్షాలతో ఇచ్చిన మాటను కాంగ్రెస్ నిలబెట్టుకుంటుందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన కొనసాగుతుందని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.

## అభివృద్ధి కోసం అధికార కాంగ్రెస్‌కు పట్టం కట్టండి

● ఇప్పటికే రూ.150 కోట్ల పనులు మంజూరు ● పేదల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, ఉచిత బస్సు రవాణ, లక్షల సంఖ్యలో రేషన్ కార్డులు పంపిణి చేశాము ● పేదల కడుపు నింపేందుకు సన్న బియ్యం ఇస్తున్నాం ● మంత్రి సీతక్క



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : అభివృద్ధి కోసం అధికార కాంగ్రెస్ కు పట్టం కట్టండి అని మంత్రి సీతక్క ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో జోరుగా కొనసాగుతున్న మంత్రి సీతక్క ప్రచారం. బోరబండ లో కార్పోరేషన్ చైర్మన్లు మువ్వా విజయ్ కుమార్, బండ్రు శోభారాణి, స్థానిక కార్పోరేటర్ బాబా ఫసియుద్దీన్ తో కలసి ప్రచారం నిర్వహించిన సీతక్కకాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించిన మంత్రి సీతక్కఉదయం కాంగ్రెస్ కార్యకర్తలకు అల్పహారం వడ్డించి వారితో కలిసి బోరబండలో ప్రచారం ప్రారంభించిన మంత్రి సీతక్క. స్వయంగా కరపత్రాలు పంచుతూ కాంగ్రెస్ అభ్యర్ధిని గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేసిన సీతక్క. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ కు మూడు సార్లు అవకాశం ఇచ్చిన అభివృద్ధి జరగ లేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్నా కనీసం రేషన్ కార్డులు ఇవ్వలేదుజూబ్లీహిల్స్ లో కనీస సదుపాయాలు కరువయ్యాయిఅందుకే జూబ్లీహిల్స్ నియోజవర్గం అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ గెలవాలి. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఎక్కడ కష్టం వచ్చినా వాలిపోతాడుజూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం అధికార కాంగ్రెస్ కు పట్టం కట్టండిఇప్పటికే రూ.150 కోట్ల పనులు మంజూరయ్యాయి. పేదల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, ఉచిత బస్సు రవాణ, లక్షల సంఖ్యలో రేషన్ కార్డులు పంపిణి చేశాముపేదల కడుపు నింపేందుకు సన్నబియ్యం ఇస్తున్నాము4.5 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నాము. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం నవీన్ యాదవ్ ను గెలిపించుకోవడం చాలా అవసరం అని మంత్రి సీతక్క తెలిపారు.



నేను ఉన్నత వర్గాల కోసం కాదు, అణచివేతకు గురైన వారి కోసం, బహిష్కృతుల కోసం రాయాలనుకుంటున్నాను.
-నామ్‌దేవ్ ధసల్



ఆ గొలుసులను కరిగించండి, వారు పట్టుకున్న పట్టును విచ్ఛిన్నం చేయండిజీ మీకు ఏమి అనిపిస్తుందో చెప్పండి, భయాన్ని విడిచిపెట్టండి.
-గుల్జార్



సాహిత్యం జీవితాన్ని ప్రతిబింబిస్తుంది, కానీ అది దానిని కూడా రూపొందిస్తుంది.
-భీషం సాహ్ని

# భూ సమస్యల దరఖాస్తులను లోతుగా పరిశీలించాలి

● రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి ● క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు పర్యవేక్షణ చేయాలి ● నవంబర్ 1 నుండి 30 వరకు గ్రామాల వారీగా భూ సమస్యలను పరిశీలించాలి ● రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అన్ని దరఖాస్తులు నవంబర్ 30లోపు పరిష్కరించాలి ● రెవిన్యూ అంశాలపై నిర్లిప్తత ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవు ● నాగర్ కర్నూల్ జిల్లా సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను లోతుగా, క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని జిల్లా రెవెన్యూ శాఖ అధికారులను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడితో కలిసి సమీక్ష నిర్వహించారు. భూ భారతి రైతు సదస్సుల్లో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు ఇనాం భూముల పరిష్కారం, రెవిన్యూ అంశాలపై ఆర్డీవోలు, తాహసిల్దార్లకు మంత్రి జూపల్లి దిశానిర్దేశం చేశారు. భూ భారతి సమస్యల పరిష్కారం కోసం మండలాల వారీగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలపై మండలాల వారీగా మంత్రి సమీక్షించారు. నాగర్ కర్నూల్ జిల్లాలో నిర్వహించిన సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల్లో ఏవైనా తిరస్కరించాల్సి వస్తే నిశిత పరిశీలన చేసి నిర్ణయం తీసుకోవాలి. ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేయాలి. వచ్చిన దరఖాస్తుల్లో ప్రధాన సమస్యలపై చర్చించి నవంబర్ 30 లోగా దరఖాస్తులను పరిశీలించాలి. భూ సమస్యల పరిష్కారానికి రైతులు కోర్టుల చుట్టూ తిరగకుండా రెవెన్యూ కార్యాలయాల్లోనే పరిష్కారానికి అవకాశం కల్పిస్తున్నాం. ప్రజల వద్దకే అధికారులు వచ్చి భూ సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు తాహాసీల్దార్లు ఉదయం 8 గంటలకే గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలి. నవంబర్ 1 నుండి నవంబర్ 30 నాటికి ఈ ప్రక్రియ పూర్తిచేయాలని, ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ..... రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇచ్చేందుకే భూ భారతి చట్టాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. అందుకు అనుగుణంగా అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయకుంటే ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయే అవకాశం ఉంది. ప్రజలకు నమ్మకం పెంచేలా రెవెన్యూ అధికారులు సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. వాస్తవాలకు భిన్నంగా ఏ అధికారి ప్రవర్తించిన కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులకు సమస్యల పరిష్కారానికి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి. భూ భారతి చట్టం అమల్లోకి వచ్చి 6 మాసాలు పూర్తి కావస్తున్నా ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా ఆశించిన స్థాయిలో రెవెన్యూ అధికారులు పని చేయడం లేదు. సమస్యల పరిష్కారానికి నాగర్ కర్నూలు జిల్లాలో ప్రత్యేకంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నవంబర్ 1వ నుంచి నవంబర్ 30 వరకు తహసిల్దార్లు ప్రతిరోజు ఉదయం 8 గంటలకే గ్రామాల్లో సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. వివిధ రకాల మాధ్యమాల ద్వారా గ్రామాల్లో చాటింపు వేసి ఏ గ్రామానికి ఎప్పుడు వస్తున్నామనే విషయాన్ని రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. గ్రామస్థాయిలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. వాస్తవాలకు భిన్నంగా రెవెన్యూ అధికారులు పనిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సందర్భంగా హెచ్చరించారు. నవంబర్ 1 నుంచి తాహసిల్దార్లు ఏ గ్రామంలో సందర్శిస్తారు అనే వివరాలను ఎమ్మెల్యేలకు ముందస్తు సమాచారాన్ని అందించాలని సూచించారు. గ్రామస్థాయిలో రైతులతో నిర్వహించే సమావేశానికి స్థానిక పోలీసులు హాజరయ్యేలా చూడాలని, అక్కడ ఎలాంటి గొడవలు జరగకుండా చూడాలని జిల్లా ఎస్పీని మంత్రి ఆదేశించారు. కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని అటవీ భూములు, దేవాదాయ భూముల పరిష్కారం కోసం రెవెన్యూ, నీటిపారుదల ,అటవీ శాఖల అధికారులతో మంత్రి కులంకషంగా చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్ దేవ సహాయం ఆర్డీవో లు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.




## విద్యాసంస్థలకు బకాయిలు చెల్లించాలి

### లేదంటే తీవ్ర పరిణామాలు : బండి సంజయ్



హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. హైదరాబాద్ నల్లకుంటలోని శంకర మఠాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. పెండింగ్ ఫీజులన్నీ చెల్లించేవరకు విద్యాసంస్థలకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి విద్యాసంస్థల యాజమాన్యాలు లొంగవద్దని సూచించారు. వాయిదా పద్ధతుల్లో చెల్లింపులకు అంగీకరించవద్దన్నారు. ప్రభుత్వాన్ని బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులతో బ్లాక్‌మెయిల్ చేస్తారా అని ప్రశ్నించారు. "బిహార్ ఎన్నికలకు డబ్బులు ఇక్కడి నుండే పంపుతున్నారు కదా.. విద్యార్థుల భవిష్యత్తు కోసం బకాయిలు చెల్లించలేరా? తక్షణమే వాటిని చెల్లించాలి. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు. విద్యార్థులు, యాజమాన్యాలతో కలిసి మంత్రులను రోడ్లపై తిరగనీయం. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలకు సంబంధించి భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. గత పదేళ్ల భారత రాష్ట్ర సమితి పాలన, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఈ నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదు. జూబ్లీహిల్స్‌లో భాజపా గెలవడం ఖాయం" అని బండి సంజయ్ తెలిపారు.

అమిత్ షాకు బండి సంజయ్ శుభాకాంక్షలు

కేంద్ర మంత్రి అమిత్ షాకు బండి సంజయ్ 'ఎక్స్' వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "నాకు రాజకీయ మార్గదర్శి, గురువు అమిత్ షా. దేశం ఫస్ట్ అనే ఆలోచనతో జీవించే, శ్వాసించే నేత ఆయన. రాజకీయాలను వ్యూహంతో, సేవతో చూడగల తత్వాన్ని అమిత్ షా నుంచే నేర్చుకుంటున్నా. ఎంతటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా అయోమయానికి గురికాకుండా ప్రశాంత మనసుతో ఆలోచించే నాయకుడు ఆయన. దీర్ఘాయుష్షు, ఆరోగ్యంతో నిండు నూరేళ్లు జీవించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నా" అని బండి సంజయ్ తెలిపారు.

## మేడారం జాతర ఏర్పాట్లపై ఎస్‌టీ సంక్షేమ శాఖ అధికారుల సమీక్ష

### మొత్తం 8 జోన్లు, 31 సెక్టార్లుగా విభజించినట్లు వెల్లడి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : మేడారం మహాజాతర ఏర్పాట్లపై బుధవారం నాడు సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మేడారం జాతరకి గిరిజన సంక్షేమ శాఖ రూ. 150.00 కోట్లు మంజూరు చేయగా అందులో రూ. 90.00 కోట్లు సివిల్ వర్క్స్ కు, రూ. 60.00 నాన్ సివిల్ వర్క్స్ కు ఉద్దేశించారు. ఈ సమావేశంలో సివిల్ వర్క్స్ స్టేటస్, నాన్ సివిల్ వర్క్స్ యాక్షన్ ప్లాన్ మీద సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్యసాచి ఘోష్ ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ గారితో కలిసి మాట్లాడుతూ మేడారం జాతర ఏర్పాట్లను మొత్తం 8 జోన్లు, 31 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. జోన్%-%3 జంపన్న వాగు ప్రాంతంగా నిర్ణయించబడింది. జాతర సమయంలో 10 నుండి 12 వేలమంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. ప్రతి జోన్‌కు ఒక జోనల్ ఆఫీసర్ను నియమించనున్నారు. 24 శాశ్వత టవర్స్, 20 సెల్-ఆన్-వీల్స్, 350 వై-ఫై పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కోర్ రూట్లు మరియు పార్కింగ్ ప్రదేశాలను గుర్తించారు. మొత్తం 49 పార్కింగ్ ప్రదేశాలు (1050 ఎకరాలు) గుర్తించబడి, దాదాపు 4.5 నుండి 6 లక్షల వాహనాలు నిలిపే సదుపాయం కల్పించబడుతుంది. ఈ ఏర్పాట్లు నవంబర్ 30 నాటికి పూర్తవుతాయని తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో 24౦9 ఫారెస్ట్ రోడ్లు (కచ్చా నుండి డబుల్ లేన్) రూపంలో అభివృద్ధి చేస్తున్నారు. వీటిలో భాగంగా వైల్డ్‌లైఫ్ శాంక్చువరీలోని రహదారులు కూడా చేర్చబడ్డాయి. ఆర్ బీ శాఖ ద్వారా 42 కోట్లతో ఆలయం చుట్టూ రహదారులు, మరియు 92 కోట్లతో ప్రధాన రహదారులు నిర్మించబడుతున్నాయి. జాతర సమయానికి ముందు, మధ్య మరియు తరువాత ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక జాతర సందర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు. జంపన్న వాగు వద్ద తాత్కాలిక రహదారి కూలిపోయిన కారణంగా మరమ్మత్తు పనులు వేగంగా జరుగుతున్నాయి. 517 బోరుపాయింట్లు/నీటి వనరులు, 250 కిలోమీటర్ల రహదారులపై లైటింగ్ పనులు జరుగుతున్నాయి. స్థానికుల సహకారంతో 6 స్లాటర్ సెంటర్లు ఏర్పాటు చేయబడ్డాయి. జంపన్న వాగు పునరుద్ధరణ పనులు సాగిస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. 9,111 విద్యుత్ స్తంభాలు, 259 ట్రాన్స్ఫార్మర్లు అమర్చే పనులు విద్యుత్ శాఖ చేపట్టింది. జాతర ప్రాంతమంతా ఎండోమెంట్స్ శాఖ ఆధ్వర్యంలో ప్రకాశ ఏర్పాట్లు (ఇల్యూమినేషన్) చేయనున్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్క%-%సారలమ్మ జాతర విజయవంతంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని సబ్యసాచి ఘోష్ ఆదేశించారు. ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ భగత్, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ములుగు ఎస్పీ, ఎలక్ట్రిసిటీ సీఎండీ వరుణ్ రెడ్డి, ఇతర సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి ప్రకటనలు ఘనం..

# ఆచరణ శూన్యం!

● గాలి మాటలతో ప్రజలను ఇంకెంత కాలం మోసం చేస్తవు రేవంత్ రెడ్డి? ● మాజీ మంత్రి హరీష్ రావు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనలు ఘనం.. ఆచరణ శూన్యం! అని బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ కోసం నియమించిన స్కావెంజర్లకు 9 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం సిగ్గుమాలిన చర్య! చిరు ఉద్యోగుల శ్రమను, కష్టాన్ని గౌరవించడం మీకు చేతకాదా? కాంగ్రెస్ పాలనలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు బెనిఫిట్స్ కోసం, స్కావెంజర్ల వంటి చిరు ఉద్యోగులు వేతనాల కోసం ఎదురుచూస్తూ నరకయాతన అనుభవిస్తున్నారు. మరోవైపు పేద విద్యార్థుల కడుపు నింపే మధ్యాహ్న భోజన పథకం నిధులు సైతం ఏడాదిగా పెండింగ్‌లో పెట్టారు. కెసిఆర్ గారు ప్రారం భించిన సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని నిలిపివేశారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించకుండా అమలు గాలికి వదిలేశారు. విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న మీకు.. మీ సొంత శాఖలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల వేతన సమస్యలు కనిపించడం లేదా? ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని గొప్పలు చెప్పి, ఆచరణలో మాత్రం గాలికి వదిలేశారు. మీ మాటల మాయాజాలంతో ఎంతకాలం ఉద్యోగులను మోసం చేస్తారు? సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు సేవలందించిన విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగుల హక్కులైన బెనిఫిట్స్ ఇవ్వకుండా వారిని మానసికంగా వేధించడం అమానవీయం, అనైతికం! రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం నెలలు తరబడి ఎదురు చూస్తున్నామని చెబుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆవేదన వింటే మనస్సు చెలించిపోతున్నది. మధ్యాహ్న భోజన పథకం సహా విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, స్కావెంజర్ల 9 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. అని హరీష్ రావు పేర్కొన్నారు.

## ప్రతిష్ఠాత్మక గ్లోబల్ సదస్సుకు కేటీఆర్‌కు ఆహ్వానం

### శ్రీలంకలో జరిగే గ్లోబల్ ఎకనామిక్ అండ్ టెక్నాలజీ సమ్మిట్‌లో కీలకోపన్యాసం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణ మాజీ ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి , బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మరో అరుదైన గౌరవం దక్కింది. శ్రీలంకలోని కొలంబోలో జరగబోయే ప్రతిష్ఠాత్మక 'గ్లోబల్ ఎకనామిక్ అండ్ టెక్నాలజీ సమ్మిట్ 2025' సదస్సులో ఆయనకు కీలకోపన్యాసం చేసేందుకు ఆహ్వానం అందింది. ఈ సదస్సు నవంబర్ 10 నుంచి 12, 2025 వరకు కొలంబోలోని 'ది కింగ్స్‌బరీ హోటల్'లో జరగనుంది.

శ్రీలంక సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తరపున జీఈటీఎస్ శ్రీలంక డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎ.యు.ఎల్.ఎ. హిల్మీ ఈ ఆహ్వానాన్ని కేటీఆర్‌కు పంపారు. ఇన్నోవేషన్, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ మరియు ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై చర్చించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న విధాన రూపకర్తలు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నాయకులను ఈ సదస్సు ఒకే వేదికపైకి తీసుకురానుంది.

డాక్టర్ హిల్మీ తన లేఖలో... ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి రంగాలలో తెలంగాణను భారతదేశంలోనే అత్యంత శక్తివంతమైన కేంద్రంగా తీర్చిదిద్దడంలో కేటీఆర్ పోషించిన 'విశిష్ట కేటీఆర్ నాయకత్వాన్ని, పాత్రనును కొనియాడారు. పెద్ద ఎత్తున పారిశ్రామిక, సాంకేతిక కార్యక్రమాలను ఆయన నడిపించిన విధానం... అనేక వర్ధమాన ఆర్థిక వ్యవస్థలకు ఒక ఆదర్శంగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. కేటీఆర్ పాల్గొనడం వల్ల "దక్షిణ ఆసియాలోని విధాన రూపకర్తలు, పారిశ్రామికవేత్తలు స్ఫూర్తి పొందుతారని" సదస్సు కార్యదర్శి తెలిపారు. అలాగే, సాంకేతిక మరియు ఆర్థిక వృద్ధిలో భారతదేశం శ్రీలంక సహకారాన్ని బలోపేతం చేయడానికి ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు వివిధ దేశాల నుండి మంత్రులు, పెట్టుబడిదారులు, స్టార్టప్ నాయకులు మరియు ఆవిష్కర్తలు హాజరవుతారని, సుస్థిరమైనసాంకేతికత ఆధారిత ఆర్థిక వ్యవస్థలను నిర్మించడంపై దృష్టి సారిస్తారని తెలిపారు.

# కొత్త రైళ్లు ఇప్పట్లో లేనట్లే...

● 'మెట్రో' బాధ్యతలు తీసుకునేందుకు వేగంగా చర్యలు ● తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చే బ్యాంకుల వైపు ప్రభుత్వం చూపు ● కొత్త బోగీలు మరింత ఆలస్యం

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : నగరంలోని మెట్రో రైళ్లకు అదనపు కోచ్‌లు, కొత్త రైళ్లను ఇప్పట్లో తీసుకొచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ఎల్అండ్‌టీ నుంచి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం పూర్తిగా తీసుకుంటున్న తరుణంలో అదనపు కోచ్‌ల ఏర్పాటు మరికొన్ని రోజుల పాటు ఆలస్యమయ్యేట్లు కనిపిస్తోంది. ముందుగా బ్యాంకులకు చెల్లించాల్సిన ఎల్అండ్‌టీ అప్పులు రూ.13 వేల కోట్లు, వన్‌టైం సెటిల్‌మెంట్ కింద సంస్థకు ఇవ్వాల్సిన రూ.2వేల కోట్లను ఇచ్చేందుకు ముందుకు సాగుతోంది. తక్కువ వడ్డీతో రుణాలు ఇచ్చే బ్యాంకులను వెతుకుతూ సదరు మొత్తాన్ని చెల్లించేందుకు ప్రయత్నిస్తోంది. దీంతో మొదటిదశ మెట్రోకు అదనంగా తీసుకురావాలని భావించిన కొత్త రైళ్లు, కోచ్‌లు ఇప్పట్లో సాధ్యపడని పరిస్థితి నెలకొంది.

రెండేళ్ల క్రితం ప్రకటన : మెట్రోలో ఇటీవల కాలంలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. దీనిని దృష్టిలో ఉంచుకుని అదనపు బోగీలను తీసుకొస్తామని రెండేళ్ల క్రితం ఎల్అండ్‌టీ అధికారులు ప్రకటించారు. గతేడాది నవంబరు 28న జరిగిన మెట్రో ఏడో వార్షికోత్సవ సమావేశంలో ఎల్అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి కొత్త కోచ్‌లపై స్పష్టమైన హామీ కూడా ఇచ్చారు. నాగ్‌పూర్, పుణే నుంచి అదనపు బోగీలను తీసుకొచ్చేందుకు రెండేళ్లుగా ప్రయత్నించామని, కుదరకపోవడంతో బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈ ఎంఎల్)తో సంప్రదింపులు చేస్తున్నామని, ఏడాదిలోపు 4 నుంచి 7 కొత్త రైళ్లను (మూడు కోచ్‌లతో) కచ్చితంగా తీసుకొస్తామని చెప్పారు. కొత్త రైళ్ల కొనుగోలు సాధ్యపడకపోతే కనీసం 40-70 వరకు కోచ్‌లనైనా తీసుకొచ్చి ప్రయాణికులకు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. అధికారులు చేసిన ప్రకటన నేటికీ కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం.



ఎల్అండ్‌టీ నుంచి తీసుకున్న తర్వాతే!..

మొదటిదశ ప్రాజెక్టును ఎల్అండ్‌టీ నుంచి పూర్తిగా తీసుకున్న తర్వాతనే కొత్తరైళ్లు, అదనపు బోగీల విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోనున్నట్లు తెలుస్తోంది. రెండోదశ విస్తరణ పనులు మొదలు కావాలంటే ముందుగా ఎల్అండ్‌టీకి ఇస్తానన్న మొత్తాన్ని చెల్లించాల్సి ఉంది. కొత్త మెట్రో కోచ్‌ను కొనుగోలు చేయాలంటే సుమారు రూ.8 కోట్ల నుంచి 10 కోట్ల వరకు ఖర్చవుతోందని, కనీసం 40 కోచ్‌లు తీసుకుంటే రూ.320 కోట్లకు పైగా ఖర్చవుతోందని, అంత ఖర్చును ఇప్పట్లో పెట్టే పరిస్థితి కనిపించడం లేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

## కేసీఆర్‌తో కేటీఆర్, హరీష్ రావు కీలక భేటీ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో పార్టీ నేతలతో భేటీ అయ్యారు. ఇవాళ ఉదయం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో సమావేశం అయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార వ్యూహాలు, రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చిస్తున్నట్లు సమాచారం. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ పార్టీ ఇన్ చార్జిలతో నేడు కేటీఆర్ సమావేశం కాబోతున్నారు.

## కాటేదాన్‌లో స్కూల్ బస్సులో మంటలు

హైదరాబాద్: నాదర్‌గుల్‌లోని దిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన బస్సులో మంటలు వ్యాపించాయి. పొగలు రావడంతో వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును ఆపి దిగిపోయారు. ఆ తర్వాత బస్సు పూర్తిగా దగ్ధమైంది. విద్యార్థులను ఇళ్ల వద్ద దింపి వెళ్తుండగా కాటేదాన్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటన జరిగిన సమయంలో బస్సులో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.



## యాదగిరిగుట్టలో విశేష పూజలు.. గిరి ప్రదక్షిణ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. కార్తిక మాసం మొదటి రోజు, స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం రోజు కావడంతో ఆలయంలో 108 కలశాలతో పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం శత ఘటాభిషేక పూజలు చేశారు. కలశాలలో వివిధ ఫల రసాలు, పంచామృతాలు, శుద్ధజలంతో స్వామి, అమ్మవార్లను అభిషేకించారు. అంతకుముందు పెద్దఎత్తున భక్తులు, స్థానికులు గిరి ప్రదక్షిణ చేపట్టారు. ఈ వేడుకల్లో ఆలయ అర్చకులు, వేదపండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# రేపు నిరుద్యోగుల సదస్సు

● జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయాలి ● 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి ● నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి ● బీసీ నేత, ఎంపీ ఆర్. కృష్ణయ్య



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ అర్ కృష్ణయ్య డిమాండ్ చేసారు. గత 2 సంవత్సరాల కాలంలో ఏలు నోటిఫికేషన్లు కలిపి 50వేల ఉద్యోగాలు కుడా భర్తీ చేయలేదని ధ్వజమెత్తారు. మిగతా ఉద్యోగాలు ఎన్ని భర్తీ చేస్తారని ప్రశ్నించారు. ఇంకా అనేక ప్రభుత్వశాఖలలో పెద్ద యెతున యున్న ఖాళీలను భర్తీ చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 24న వేలదిమందితో నిరుద్యోగుల సదస్సు జలవిహార్ లో జరుపాలని నిర్ణయించారు.

ప్రభుత్వం జాబ్ క్యాలెండరు ప్రకటిస్తారని నిరుద్యోగులంత ఎదురు చూశారు. కానీ ప్రకటించ లేదు ఇప్పటి కైనా వెంటనే ప్రకటించాలని కోరాడు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రేవంత్ ముఖమంత్రి కావడానికి నిరుద్యోగులు కారణమని వీరిని విస్మరించడం తగదని హెచ్చరించారు.

ముఖ్యమంత్రి నిరుద్యోగ సమస్య పరిష్కరించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరాడు. ప్రైవేటు రంగం 1. తదిదర ఉద్యోగాలతో పాటు ప్రభుత్వ శాఖలలో అన్ని శాఖలలో ముఖ్యంగా విద్య, వైద్యం, రెవిన్యూ, పంచాయత్ రాజ్య శాఖ ఉద్యోగాలను పూర్తి స్థాయిలో భర్తీ చేయాలనీ కోరారు.

ప్రభుత్వాని కొందరు అధికారాలు ఖాళీలు లెక్కించే విషయంలో తప్పుతోవ పట్టిస్తున్నారు ఖాళీ పోస్టులు లెకించేటప్పుడ ప్రభుత్వ అధికారులు తప్పుడు విధానా అధికారులు తప్పుడు విధానా అవలంబిస్తున్నరన్నా విమర్శించారు. ఎంత మంది రిటైర్ అయ్యారు. ఎంతమందికి ప్రమోషన్లు ఇచ్చారు. కొత్త జిల్లాలు ఆఫీసులు రావడం వలన ఎన్ని ఉద్యోగాలు సృష్టి౦చారని ఇలాంటి అంశాలను దృష్టిలో పెట్టుకోకుండా ఖాళీలు భర్తీ చేస్తున్నారని విమర్శించారు.

7 సంవత్సరాల క్రితం కొత్తగా 23 జిల్లాలు ఇతర ఆఫీసులో పెద్ద ఎత్తున సృష్టించి మంజూరు చేశారు. కానీ వీటికి ఇంత వరకు పోస్టులు సృష్టించే మంజూరు చేయలేదు. కేవలం పాత పోస్టులతోనే సర్దుబాటు చేశారు. దీని మూలంగా ఏ ప్రభుత్వ ఆఫీసులలో సరిపోను సిబ్బంది లేదు. ఆఫీసర్ స్థాయి పోస్టులలో ఒక్కొక్క ఆఫీసరు 3,4 ఆఫీసులను ఇంచార్జిలను పెట్టి సర్దుతున్నారు. కావున ప్రభుత్వ యంత్రాంగం సమర్ధవంతంగా సాగాలంటే ఇన్చార్జిలతో పూర్తిస్థాయి అధికారులను నియమించాలని విజ్ఞప్తి చేస్తున్నాం..రాష్ట్రంలో 7 సంవత్సరాల క్రితం ఏర్పడ్డ 23 జిల్లాలోని వాటిలో 40 శాఖల జిల్లా ఆఫీసులు, అలాగే పెద్ద యెత్తున తాలూకా ఆఫీసులు ఏర్పడ్డాయి. అలాగే 131 మండలాలు, 30 రెవెన్యూ డివిజినల్ ఆఫీసులు, 76 మున్సిపాలిటీలు, 7. మున్సిపల్ కార్పోరేషన్లు, 25 %ఞ్ఞా% ఆఫీసులు, 31 పోలీస్ సర్కిల్స్, 7 పోలీస్ కమిషనరేట్లు, 4,383 గ్రామపంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయి. ఇందులో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-4 సర్వీస్ పోస్టులు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయి. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు, మండలాలకు మున్సిపాలిటీలకు పోస్టులు మంజూరు చేయలేదు. వీటికి పోస్టులు వెంటనే మంజూరు చేయాలి. వీటికి అన్ని స్థాయిలలో పోస్టులు మంజూరు చేస్తే దాదాపు లక్ష పోస్టు అధనంగ వస్తాయి. ఇందులో డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోటా లెక్కించాలి. వాటిలో గ్రూప్-1 50 శాతం. గ్రూప్-2 లో 30 నుంచి 40 శాతం గ్రూప్ %×ం% తదితర పోస్టులు 100 శాతం డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోటా కింద ఎన్ని పోస్టులు వస్తాయో పూర్తి స్థాయిలో లెక్కించి భర్తీ చేయాలి. ముఖ్యమంత్రి 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడానికి ప్రభుత్వం చర్య తీసుకుందని కాని ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చునది ఏమనగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కొందరు డైరెక్ట్ రిక్రూట్ మెంట్ కోటా క్రింది భర్తీ చేయవలిసిన గ్రూప్-1,2,3,4 సర్వీస్ ఉద్యోగాలను సరిగ్గా పూర్తి స్థాయిలో లెక్కించి గణన చేసి భర్తీ చేయడానికి ప్రతిపాదనలు పంప లేదు. ఎదే నామమాత్రంగా లెక్కించి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికే అన్ని శాఖలలో అడ్ హక్ ప్రమోషన్ల పేరుమీద భర్తీ చేశారు. కొందరు ఉన్నతాదికారులు డైరెక్టు రక్రూట్ మెంట్ లెక్కించడంలో అన్యాయం చేస్తున్నారు. డైరెక్టు రిక్రూట్ మెంట్ కోటా పోస్టులను ప్రమోషన్ల క్రింద భర్తీ చేశారు. కొత్త తరాన్ని యువతరాన్ని డైరెక్టు రిక్రూట్ మెంట్ ద్వారా ప్రభుత్వ యంత్రాంగంలోకి తీసుకువస్తే సమర్ధవంతమైన, అవినీతికి తావులేని పాలన లభిస్తుంది. యువత శక్తి-యుక్తులు సమాజాభివృద్ధికి ఉపయోగించ వచ్చును. యువతను పాలనరంగం లోకి తీసుకువస్తే ఉత్సాహంతో, అంకిత భావంతో నిజాయితీగా పని చేస్తారని కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమం లో సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ. జిల్లపల్లి అంజి. వేముల రామకృష్ణ, అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ ప్రభుత్వం
సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్, ఆపరేషన్, సెంట్రల్ సర్కిల్, గ్రేటర్ హైదరాబాద్
టెండరు ప్రకటన
టెండర్ స్పెసిఫికేషన్ నం. 01 & 03 /2025-46.అజామాబాద్ డివిజన్‌లోని గోల్నాకా సెక్షన్‌లో క్యాపిటల్ వర్క్ కింద ప్రత్యేక 63KVA DTRని మరియు TS.No.03/25-26 CBD-I/సైఫాబాద్ డివిజన్‌లోని 33/11KV లేక్ వ్యూ SS నుండి 11 KV లేక్ వ్యూ ఫీడర్‌లోని సోమాజిగూడలోని రాజ్ భవన్ రోడ్‌లోని లేక్ వ్యూ గెస్ట్ హౌస్ గేట్ వద్ద 11KV 3x185Sqmm UG కేబుల్ వేయడం ద్వారా మెస్సర్స్ ఇండస్ టవర్స్ లిమిటెడ్‌కు LT సరఫరా పొడిగింపు. టెండర్ స్పెసిఫికేషన అమ్మకం: 23-10-25 (గురువారం) నుండి 30-10-25 (గురువారం) వరకు 17:00 గంటల వరకు. సీల్డ్ టెండర్ల స్వీకరణకు చివరి తేదీ: 31-10-25 (శుక్రవారం) నుండి 15:00 గంటల వరకు. టెండర్ ప్రారంభ తేదీ: 31-10-25 (శుక్రవారం) 15:30 గంటల వరకు. టెండర్ షెడ్యూల్‌ను TS.No.01/25-26 కార్యాలయం నుండి డివిజనల్ ఇంజనీర్/Op/Azamabad & TS.No.03/25-26 డివిజనల్ ఇంజనీర్/Op/Saifabad/Central Circle/Mint Compound/Hyd నుండి సేకరించవచ్చు. అన్ని సమాచారాన్ని www.tgsouthernpower.com / కింద సంతకం చేసిన వారి నుండి పొందవచ్చు. ఫోన్: 8712469928 & 8712469884.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, సెంట్రల్ సర్కిల్, హైదరాబాద్
DIPR.RO.No.9565-PP/CL/Advt/1/2025-26 , Dt: 22-10-2025

Estt : 2007
GEETHANJALI COLLEGE OF PHARMACY
ACCREDITED BY NBA & NAAC with A+
Cheeryal (V), Keesara (M), Medchal Dist. - 501 301
Phone : 9959390412
ADMISSION NOTIFICATION FOR M.PHARM & PHARM-D(PB) UNDER 'B' CATEGORY SEATS FOR THE A.Y.2025-26

| Pharmaceutics | Pharmaceutical Analysis | Pharmaceutical Regulatory Affairs | Pharm-D (PB) |
|---|---|---|---|
| 04 | 04 | 04 | 03 |

Application forms and other details can be downloaded from college web site. The candidates can be submitted their applications through online/offline with Registration fee Rs.1000/- along with all certificates (Xerox). Last date for submitting the applications on or before 05-11-2025.Admissions will be made strictly as per guidelines of TSCHE.
Sd/- Secretary

## మహిళా ... నీ అడ్రస్ ఎక్కడా ?

ప్రపంచ రాజకీయ వేదికపై జపాను కొత్త మహిళా ప్రధానమంత్రి ఎన్నికవడం అనేది మహిళా నాయకత్వానికి, లింగ సమానత్వానికి సంబంధించిన చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా రాజకీయాలలో, ముఖ్యంగా దేశాధినేతలుగా లేదా ప్రభుత్వాధినేతలుగా (ప్రధానమంత్రి లేదా అధ్యక్షుడు) ఉన్న మహిళా నేతల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఈ సంఖ్య పది శాతం లోపే ఉంది. ఉదాహరణకు, జియోర్జియా మెలోని (ఇటలీ), షేక్ హసీనా (బంగ్లాదేశ్) వంటి కొద్ది మంది మహిళలు మాత్రమే నాయకులుగా వ్యవహరించారు దీనికి భిన్నంగా, వ్యాపా రం, విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరుగుతున్నా, అగ్ర నాయకత్వ స్థానాలలో వారి సంఖ్య ఇంకా వెనుకబడే ఉంది. ఐ.ఎం.ఎఫ్ (ఐఎంఎఫ్ ) అధిపతిగా క్రిస్టలీనా జార్జియేవా మరియు ఈ.సి.బి అధ్యక్షురాలిగా క్రిస్టీన్ లగార్డ్ వంటి వారు ఆర్థిక రంగంలో అత్యున్నత స్థానాల్లో ఉన్నారు. అయినప్పటికీ, రాజకీయ మరియు కార్పొరేట్ రంగాల్లోని అత్యున్నత స్థానాల్లో మహిళల సంఖ్య ఇప్పటికీ పదిహేను నుంచి ఇరవై శాతం లోపే ఉంది.ప్రపంచ చరిత్రలో, రాజకీయ అధికారా న్ని అత్యున్నత స్థాయిలో నిర్వహించిన తొలి మహిళా నేతలు ప్రపంచవ్యాప్తంగా స్త్రీలకు ఒక కొత్త మార్గాన్ని చూపించారు. ఈ మార్గదర్శకులలో ముందుగా చెప్పుకోవలసినది శ్రీలంకకు చెందిన సిరిమావో బండారునాయకే. ఈమె 1960లో ప్రపంచంలోనే తొలి మహిళా ప్రధానమంత్రిగా ఎన్నికై, చరిత్ర సృష్టించారు. ఆ తరువాత, ఇజ్రాయెల్కు గోల్డా మీర్ 1969లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి, తన ఉక్కు సంకల్పాన్ని ప్రదర్శించారు. అర్జెంటీనాకు చెందిన ఇసాబెల్ పెరోన్ 1974లో అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించి, ప్రపంచంలోనే తొలి మహిళా అధ్యక్షురాలిగా నిలిచారు. బ్రిటన్లో మార్గరెట్ థాచర్ 1979లో తొలి మహిళా ప్రధాన మంత్రిగా ఎన్నికై, దీర్ఘకాల పదవిలో కొనసాగి, 'ఐరన్ లేడీ'గా ప్రసిద్ధి చెందారు. వీరి ధైర్యసాహసాలు మరియు నాయకత్వ లక్షణాలు అంతర్జాతీయ రాజకీయాలలో మహిళలకు ఒక బలమైన స్థానాన్ని కల్పించాయి. భారతదేశంలో మహిళా నాయ కత్వం అనేది స్వాతంత్య్ర పూర్వం నుంచే బలంగా ఉంది. దేశానికి తొలి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ 1966లో బాధ్యతలు చేపట్టి, భారత రాజకీయాలలో మరియు ప్రపంచ వేదికపై తనదైన ముద్ర వేశారు. ఆమె కేవలం రాజకీయనాయకు రాలు మాత్రమే కాక, అత్యంత కీలకమైన యుద్ధాలు, నిర్ణయాలు తీసుకుని 'ఉక్కు మహిళ'గా గుర్తింపు పొందారు. ఆమె కంటే ముందే, స్వాతంత్య్రం వచ్చిన తర్వాత, సరోజినీ నాయుడు తొలి భారతీయ మహిళా గవర్నర్ (ఉత్తరప్రదేశ్) నియమితులయ్యారు. ఈమె అంతకుముందే 1925లో కాంగ్రెస్కు తొలి భారతీయ మహిళా అధ్యక్షురాలిగా పనిచేసి, 'భారత కోకిల' బిరుదు పొందారు. దేశంలోనే తొలి మహిళా ముఖ్యమంత్రిగా సుచేతా కృపలానీ (ఉత్తరప్రదేశ్) పనిచేసి, పరిపాలనా రంగంలో మహి ళలకు మార్గదర్శకురాలిగా నిలిచారు.రాజకీయాలలోనే కాకుండా, భారతదేశంలోని ఇతర రంగాలలో కూడా మహిళా నాయకులు తమ శక్తిని నిరూపించుకున్నారు. సావిత్రిబాయి పూలే భారతదేశంలోని మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా, సంఘ సంస్కర్తగా నిలిచి, మహిళా విద్య కోసం 19వ శతాబ్దంలోనే పాఠశాలను స్థాపించారు. రాణీ లక్ష్మీబాయి 1857 భారత స్వాతంత్య్ర సంగ్రామంలో తన అసమాన ధైర్య సాహసాలు, వీరోచిత పోరాటంతో దేశభక్తికి చిహ్నంగా నిలిచారు. స్వాతంత్య్రం తరువాత, కిరణ్ బేడీ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్)లో చేరిన తొలి మహిళా అధికారిగా చరిత్ర సృష్టించారు. అలాగే, ప్రతిభా పాటిల్ దేశానికి మొదటి మహిళా అధ్యక్షురాలిగా (2007) ఎన్నికై, రాజ్యాంగపరమైన అత్యున్నత స్థానాన్ని అలంకరించారు. వీరంతా తమరంగాలలో అసాధ్యాలను సుసాధ్యం చేసి, కోట్లాది మంది మహి ళలకు స్ఫూర్తినిచ్చారు.ప్రపంచ జనాభాలో సగం మంది మహిళలే కాబట్టి, నాయకత్వ స్థానాలలో వారి ప్రాతినిధ్యం కనీసం 50 శాతం ఉండాలనే లక్ష్యం చాలా ముఖ్యం. మహిళలు నాయకత్వంలోకి రావడం వల్ల నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ మరింత సమతుల్యంగా, విభిన్న కోణాల్లో ఉంటుంది. లింగ సమానత్వం, ఆరోగ్యం, విద్య మరియు సామాజిక సంక్షేమం వంటి అంశాలపై విధానాలు రూపొందించేటప్పుడు, మహిళా నేతలు వారి అనుభవాల ద్వారా మరింత సమర్థవంతంగా పనిచేయగలుగుతారు. సమాన ప్రాతినిధ్యం అనేది కేవలం న్యాయం మాత్రమే కాదు, ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధికి కూడా చాలా అవసరం. మహిళల నైపుణ్యం మరియు ప్రతిభను పూర్తిస్థాయిలో ఉ పయోగించుకోకపోతే, దేశాలు తమ మానవ వనరుల సామర్థ్యాన్ని కోల్పోతాయి. కనుక, స్థానిక సంస్థల నుంచి జాతీయ స్థాయి వరకు మహిళల కోసం రిజర్వేషన్లు కల్పించడం, రాజకీయ పార్టీలు వారికి ఎక్కువ అవకా శాలు ఇవ్వడం ద్వారా ఈ సంఖ్యను పెంచవచ్చు. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు మొదటగా చేయవలసిన ముఖ్యమైన పని చట్టసభ లలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం. స్థానిక సంస్థలలో అమలులో ఉన్న రిజర్వే షన్ విధానాన్ని రాష్ట్ర, జాతీయ స్థాయిలలో కూడా అమలు చేయడం ద్వారా మహి ళలకు కనీస ప్రాతినిధ్యం లభిస్తుంది. అయితే, రిజర్వేషన్లు మాత్రమే సరిపోవుబీ రాజకీయ పార్టీలు తమ అంతర్గత వ్యవస్థలలో మహిళలకు సమాన అవకాశాలు ఇవ్వాలి. అంటే, ఎన్నికలలో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న స్థానాలలో (సిట్టింగ్ స్థానాలు లేదా సురక్షిత స్థానాలు) వారికి టిక్కెట్లు కేటాయించడం, అలాగే పార్టీలోని ముఖ్య నిర్ణాయక కమిటీలలో వారికి ప్రాధాన్యత ఇవ్వడం వంటి చర్యలు తీసుకోవాలి. దీనివల్ల మహిళా నేతలు కేవలం నామమాత్రపు స్థానాలకే పరిమితం కాకుండా, కీలక పదవుల్లోకి వచ్చి, విధానాలను ప్రభావితం చేయగలుగుతారు.

రాజకీయాల్లోకి రావాలనుకునే మహిళలకు ఆర్థిక, రక్షణపరమైన మద్దతు అత్యవస రం. ఎన్నికలలో పోటీ చేయడానికి అవసరమైన నిధులను సమీకరించడంలో మహిళ లకు అండగా నిలవాలి. అలాగే, రాజకీయాల్లో మహిళలు ఎదుర్కొనే లైంగిక వేధింపులు, బెదిరింపులు మరియు ఇతర రకాల వివక్షలను ఎదుర్కోవడానికి కఠినమైన చట్టాలు, పర్యవేక్షణా యంత్రాంగాలు ఏర్పాటు చేయాలి. మహిళలు ధైర్యంగా, సురక్షితంగా రాజకీయాల్లోకి రావడానికి ఇది దోహదపడుతుంది. దీనితో పాటు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో మహిళా ఓటర్లు మరియు నాయకులకు రాజకీ య విద్య అందించాలి. రాజ్యాంగ హక్కులు, ఎన్నికల ప్రక్రియ, ప్రభుత్వ పాలన మరియు విధానాల గురించి అవగాహన కల్పిస్తే, వారు మరింత సమర్థవంతంగా రాజకీయాల్లో పాల్గొనగలుగుతారు, సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు.

సమాజంలో లింగ వివక్షకు సంబంధించిన ధోరణులను మార్చడం చాలా ముఖ్యం. మహిళలు నాయకత్వం వహించగలరనే విశ్వాసాన్ని ప్రజల్లో, ముఖ్యంగా మహిళల్లోనే పెంపొందించాలి. పాఠశాల స్థాయి నుంచే బాలికలలో నాయకత్వ లక్షణాలను ప్రోత్స హించాలి. మీడియా, సినిమా రంగాలలో మహిళా నాయకులను సానుకూల దృక్ప థంతో ప్రదర్శించడం, వారి విజయాలను ప్రచారం చేయడం ద్వారా యువతులకు స్ఫూర్తినివ్వవచ్చు. అలాగే, రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తూనే కుటుంబ బాధ్యతలను నిర్వహించగలిగేలా పని ప్రదేశాలలో సౌలభ్యాలను (ఉదాహరణకు, శిశు సంరక్షణ సౌకర్యాలు) కల్పించడం ద్వారా మహిళలు నిస్సంకోచంగా రాజకీయాలలో చురుకుగా పాల్గొనడానికి వీలవుతుంది. ఈ సమగ్రమైన చర్యలన్నీ కలిస్తేనే, రాజకీయాలలో మహిళల ప్రాతినిధ్యాన్ని 50 శాతం లక్ష్యం వైపు తీసుకెళ్లడం సాధ్యమవుతుంది.

ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి, కేవలం రిజర్వేషన్లు మాత్రమే కాకుండా, మహిళలను చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా ప్రోత్సహించాలి. విద్యారంగంలో, పని ప్రదేశాలలో లింగ వివక్షను పూర్తిగా తొలగించాలి. రాజకీయాలలోకి రావాలనుకునే మహిళలకు మెరుగైన శిక్షణ, ఆర్థిక సహకారం మరియు భద్రత కల్పించాలి. అప్పుడే, జపాన్లో జరిగిన విధంగా, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు మహిళా నేతలను ఎన్నుకోవడానికి మార్గం సుగమం అవుతుంది. అన్ని రంగాలలో మహిళల సంఖ్యను 50 శాతానికి పెంచడం అనేది కేవలం ఒక లక్ష్యం మాత్రమే కాదు, అది ప్రపంచ సమాజం సమగ్ర అభివృద్ధి చెందడానికి ఒక అవసరం. ఈ విధంగా, ప్రపంచ నాయకత్వంలో స్త్రీ, పురుషుల మధ్య సమతుల్యత సాధించబడి, దేశాలు మరింత బలంగా, న్యాయబద్ధంగా మారతాయి.

# 6 లక్షల కోట్ల అమ్మకాలతో భారత సత్తా!



**తేజస్వి**
**హైదరాబాద్**

- దీపావళి కి దేశవ్యాప్తంగా ₹6.05 లక్షల కోట్ల అపూర్వమైన వ్యాపారం
- జీఎస్టీ రేట్ల తగ్గింపు తో దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యత పెరిగాయి
- అమ్మకాలు పెరగడానికి దైనందిన వస్తువులపై జీఎస్టీ తగ్గింపు దోహదం
- బలమైన పునరుద్ధరణ దిశగా పయనిస్తున్న భారత ఆర్థిక వ్యవస్థ
- సవాళ్లు ఇంకా పూర్తిగా పరిష్కారం కాని మౌలిక సదుపాయాల కొరత

భారతదేశంలో ఈ ఏడాది నవరాత్రి నుండి దీపావళి వరకు జరిగిన పండుగ సీజన్ వ్యాపారం సరికొత్త చారిత్రక రికార్డులను సృష్టించింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ సిఏఐటి విడుదల చేసిన సమగ్ర నివేదిక ప్రకారం, 2025 దీపావళి సందర్భంగా దేశవ్యాప్తంగా ₹6.05 లక్షల కోట్ల అపూర్వమైన వ్యాపారం జరిగింది. ఇందులో ₹5.40 లక్షల కోట్లు వస్తువుల అమ్మకాలు కాగా, ₹65,000 కోట్లు సేవల రంగం ద్వారా సమకూరాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది సుమారు 25 శాతం వృద్ధిని సూచిస్తుంది. ఈ రికార్డు అమ్మకాలకు ప్రధానంగా జీఎస్టీ రేట్ల తగ్గింపు, మరియు దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యత పెరగడం కారణమని సిఏఐటి పేర్కొంది. సర్వేలో పాల్గొన్న 72 శాతం మంది వ్యాపారులు తమ అమ్మకాలు పెరగడానికి దైనందిన వస్తువులపై జీఎస్టీ తగ్గింపు దోహదపడిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'వోకల్ ఫర్ లోకల్' మరియు 'స్వదేశీ దీపావళి' నినాదం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. వినియోగదారులలో 87 శాతంమంది దిగుమతి చేసుకున్న ఉత్పత్తుల కంటే భారతీయ వస్తువులకే ప్రాధాన్యత ఇవ్వడం వలన చైనా వస్తువుల డిమాండ్ తీవ్రంగా తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే దేశంలో తయారైన ఉత్పత్తుల అమ్మకాలు 25 శాతం పెరిగాయి. మొత్తం వ్యాపారంలో నాన్–కార్పొరేట్ మరియు సాంప్రదాయ మార్కెట్ల వంటి భౌతిక మార్కెట్లే 85 శాతం వాటాను అందించడం, చిన్న వ్యాపారుల బలమైన పునరాగమనాన్ని సూచిస్తోంది. అలాగే, ఈ భారీ అమ్మకాలలో గ్రామీణ మరియు సెమీ–అర్బన్ (పాక్షిక పట్టణ) భారతదేశం కూడా గణనీయంగా సహకరించి, మొత్తం వ్యాపారంలో 28 శాతం వాటాను అందించింది.

రంగాల వారీగా చూస్తే, ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ 12 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, బంగారం ఆభరణాలు 10 శాతం, ఎలక్ట్రానిక్స్ %ఽ% ఎలక్ట్రికల్స్ 8 శాతం వాటా కలిగి ఉన్నాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్, రెడీమేడ్ గార్మెంట్స్ మరియు గిఫ్ట్ ఐటమ్స్ ఒక్కొక్కటి 7 శాతం వాటాను పొందాయి. రిటైల్ వాణిజ్యంతో పాటు, ప్యాకేజింగ్, ఆతిథ్యం, క్యాబ్ సేవలు మరియు ఈవెంట్ మేనేజ్మెంట్ వంటి సేవారంగం కూడా ₹65,000 కోట్లతో ఉత్సవ ఆర్థిక వ్యవస్థ విస్తరణను ప్రతిబింబించింది. ఈ పండుగ సీజన్లో లాజిస్టిక్స్, ప్యాకేజింగ్ వంటి వివిధ రంగాలలో సుమారు 50 లక్షల తాత్కాలిక ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. వ్యాపారుల మరియు వినియోగదారుల విశ్వాసం (ట్రేడర్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్ 8.6/10, కన్స్యూమర్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్ 8.4/10) కూడా దశాబ్దంలోనే అత్యధికంగా నమోదైంది. భవిష్యత్తులో కూడా ఈ సానుకూల ధోరణి కొనసాగడానికి, సిఏఐటి ప్రభుత్వం మరియు ఆర్థిక సంస్థల కు కొన్ని ముఖ్యమైన సిఫార్సులను చేసింది. జీఎస్టీ నిబంధనలను సరళీకృతం చేయడం, చిన్న వ్యాపారులకు మరియు తయారీదారులకు రుణ సదుపాయాన్ని మెరుగుపరచడం దీనిలో ప్రధానమైనవి. అలాగే, టైర్ 2 మరియు టైర్ 3 నగరాల్లో లాజిస్టిక్స్, వేర్హౌసింగ్ హబ్లను అభివృద్ధి చేయాలని, తక్కువ ఎం.డి.ఆర్తో కూడిన డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాలని సిఏఐటి కోరింది. మొత్తం మీద, ఈ పావళి అమ్మకాలు భారతీయ రిటైల్ రంగానికి ఒక చారిత్రక మైలురాయిగా నిలవడమే కాక, 'ఆత్మనిర్భర్ భారత్' నిర్మాణంలో సాంప్రదాయం, సాంకేతికత మరియు విశ్వాసం కలగలిసిన శక్తిని చాటిచెప్పింది.

ఈ రికార్డు స్థాయి దీపావళి అమ్మకాలు భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పునరుద్ధరణ దిశగా పయనిస్తున్నట్లు స్పష్టంగా సూచిస్తున్నాయి. దేశంలో వినియోగదారుల ఖర్చు చేసే సామర్థ్యం గణనీయంగా పెరిగిందని, ప్రజలు భవిష్యత్తుపై ఆర్థిక విశ్వాసాన్ని కలిగి ఉన్నారని ఈ అమ్మకాల గణాంకాలు తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా అసంఘటిత రంగం, చిన్న వ్యాపారులు మరియు భౌతిక మార్కెట్లు తిరిగి తమ పూర్వ వైభవాన్ని పొందడం, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ఈ వర్గాలు బలంగా ఉన్నాయని ధృవీకరిస్తున్నాయి. ప్రభుత్వ విధానాలైన జీఎస్టీ సరళీకరణ మరియు 'వోకల్ ఫర్ లోకల్' వంటి నినాదాలు క్షేత్ర స్థాయిలో విజయవంతంగా పనిచేస్తున్నాయని, దేశీయ తయారీ మరియు ఉత్పత్తికి ఊతమిస్తున్నాయని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. ఈ అధిక అమ్మకాల వల్ల దేశా నికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. తాత్కాలికం గానైనా 50 లక్షల ఉద్యోగాల కల్పన జరగడం వల్ల అనేక కుటుంబాలకు పం డుగ సమయంలో ఆదాయం చేకూరింది. పెరిగిన అమ్మకాల ద్వారా ప్రభుత్వం జీఎస్టీ రూపంలో అధిక ఆదాయాన్ని సమకూర్చుకోవడం, తద్వారా ఆ నిధులను మౌలిక సదు–పాయాల అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలకు ఉపయోగించే అవకాశం ఏర్పడింది. అంతేకాక, టైర్ 2 మరియు టైర్ 3 నగరాల నుంచి 28 శాతం వాటా రావడం అనేది పట్టణ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థల మధ్య అంతరం క్రమంగా తగ్గుతున్నట్లు, మరియు ఆర్థిక వృద్ధి కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా దేశం నలుమూలలకు విస్తరిస్తున్నట్లు సూచిస్తుంది. ఇది దేశంలో వినియోగ ఆధారిత వృద్ధికి బలాన్ని చేకూర్చి, దీర్ఘకాలిక ఆర్థిక స్థిర త్వానికి మార్గం సుగమం చేస్తుంది.అయితే, ఈ రికార్డు అమ్మకాలకు మరో కోణం కూడా ఉంది. పండుగ సీజన్లలో కనిపించే ఈ భారీ డిమాండ్ స్థిరమైన వృద్ధి కాకపోవచ్చు. అంటే, కేవలం పండుగ సమయంలో మాత్రమే కాకుండా, సంవత్సరమంతా ఇదే స్థాయిలో కొనుగోళ్లు కొనసాగడం ముఖ్యం. అంతేకాక, చిన్న వ్యాపారులకు రుణ సదుపాయం మెరుగుపరచడం మరియు జీఎస్టీ నిబం ధనలను మరింత సరళీకృతం చేయాలన్న సిఏఐటి సిఫార్సులు, ఈ రం గంలో ఇంకా పరిష్కరించాల్సిన లోపాలు ఉన్నాయని సూచిస్తున్నాయి. భారీ డిమాండ్ను తట్టుకోవడానికి, సరఫరా గొలుసు నిర్వహణ, లాజిస్టిక్స్ మరియు వేర్హౌసింగ్ వంటి మౌలిక సదుపాయాల కొరత వంటి సవాళ్లు ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదు. కాబట్టి, దీర్ఘకాలిక ఆర్థిక ఆరోగ్యానికి ఈ సీజనల్ ఊపును స్థిరమైన వృద్ధిగా మార్చడానికి ప్రభుత్వం మరియు పరిశ్రమలు విధానపరమైన చర్యలను వేగవంతం చేయాల్సి ఉంటుంది.ఒకవైపు అంతర్జాతీయంగా అమె రికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ తరహా వాణిజ్య సుంకాల పెరుగుదల భయం, మరోవైపు ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న అని శ్చితి వంటి సవాళ్లు ఉన్న నేపథ్యంలో, ఈ రికార్డు స్థాయి స్థానిక అమ్మకాలు మన దేశానికి వ్యూహాత్మక ప్రాము ఖ్యతను కలిగి ఉన్నాయి. విదేశీ వాణిజ్య విధా నాలు కఠినతరం అయిన ప్పుడు లేదా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగిం చినప్పుడు, దేశీయ వినియోగం ద్వారా వచ్చే వృద్ధి అనేది మన ఆర్థిక వ్యవస్థకు రక్షణ కవచం లాగా పనిచేస్తుం ది. దిగుమతులపై ఆధారపడకుండా, దేశంలోనే వస్తువులు అమ్ముడై, డబ్బు దేశంలోనే చెలామణి కావడం అనేది ఆర్థిక స్వావలంబన (ఆత్మనిర్భరత) దిశగా మన ప్రయాణంలో కీలకమైన అడుగు. ముఖ్యంగా, 'వోకల్ ఫర్ లోకల్' నినా దం నిజమైన ఫలితాలను ఇవ్వడం ద్వారా, అంతర్జాతీయ సవాళ్లకు సమాధానం మన స్థానిక తయారీదారులను బలోపేతం చేయడంలోనే ఉందని స్పష్టమ వుతోంది.ప్రపంచంలోని అనేక మార్కెట్లలో అనిశ్చితి నెలకొన్నప్పటికీ, భారతీయ వినియోగదారుల ధోరణి మరియు వ్యాపారుల ఆత్మవిశ్వాసం బలంగా ఉండ టం మన దేశీయ మార్కెట్ యొక్క స్థితిస్థాపకతను చూపుతోంది. ఈ స్థానిక అమ్మకాలు దేశీయ వ్యాపార సంస్థలు మరియు తయారీ యూనిట్లలో సానుకూ లతను పెంచుతాయి, తద్వారా వారు మరింత పెట్టుబడి పెట్టడానికి, ఉత్పత్తిని పెంచడానికి ప్రోత్సాహం లభిస్తుంది. అంతర్జాతీయ డిమాండ్ హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా, దేశీయ డిమాండ్ను స్థిరంగా ఉంచుకోగలిగితే, అది భారత దేశ వృద్ధిని నిలకడగా కొనసాగించడానికి సహాయపడుతుంది. చిన్న వ్యాపారులు, అసంఘటిత రంగం ఆర్థిక కార్యకలాపాలలో చురుకుగా పాల్గొ నడం వల్ల, ఆర్థిక వృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు కూడా విస్తరిం చే అవకాశం ఏర్పడుతుంది.

పండుగ సీజన్లో వచ్చిన ఈ వృద్ధిని నిలకడగా మార్చుకోవడానికి ప్రభుత్వం మరియు వ్యాపార సంస్థలు మరింత వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. మొదటిది, స్థానిక ఉత్పత్తుల నాణ్యత మరియు ప్రమాణాలను మెరుగుపరచడానికి భారీగా పెట్టుబడి పెట్టాలి. దీనివల్ల దేశీయ ఉత్పత్తులు అంతర్జాతీయ ఉత్పత్తులతో ధీటుగా పోటీపడగలుగుతాయి. రెండవది, చిన్న వ్యాపారులకు సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో సహాయం చేసి, వారి వ్యాపారాలను డిజిటలైజ్ చేయాలి. మెరుగైన ఈ–కామర్స్ వేదికలను, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలను వారికి అందుబాటులోకి తీసుకురావాలి. మూడవది, ఇప్పటికే ఉన్న సరుకు రవాణా మరియు నిల్వ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ముఖ్యంగా టైర్ 2, 3 నగరాల్లో లాజిస్టిక్స్ హబ్లను అభివృద్ధి చేయడం అత్యవసరం. ఈ చర్యల ద్వారా, అంతర్జాతీయంగా ఎలాంటి సవాళ్లు ఎదురైనా, భార త దేశం తన దేశీయ శక్తి ఆధారంగా వృద్ధి పథంలో ముందుకు సాగగలుగుతుంది.భారతదేశంలో దీపావళి సందర్భంగా నమోదైన ఈ రికార్డు స్థాయి స్థానిక అమ్మకాలు, అంతర్జాతీయ వేదికపై మన దేశం యొక్క ఆర్థిక స్థిరత్వం మరియు పెరుగుతున్న వినియోగ మార్కెట్ను ప్రపంచానికి చాటిచెప్పే శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడతాయి. అనేక అభివృద్ధి చెందిన దేశాలు ఆర్థిక మందగమనం లేదా అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో, భారత మార్కెట్ యొక్క స్థితిస్థాపకత మరియు వినియోగదారుల విశ్వాసం విదేశీ పెట్టుబడిదారులకు, ప్రభుత్వాలకు ఒక ఆకర్షణీయమైన అంశంగా మారుతుంది. స్థానికంగా ఇంత భారీగా డిమాండ్ సృష్టించగలిగే దేశం, ఇతర దేశాల నుంచి తయారీ, సాంకేతికత మరియు పెట్టుబడులను ఆహ్వానించడానికి బలమైన పునాదిని అందిస్తుంది. ఈ బలాన్ని ప్రదర్శించడం ద్వారా, భారతదేశం వివిధ దేశాలతో వాణిజ్యం మరియు పెట్టుబడి ఒప్పందాలను మరింత మెరుగ్గా చర్చించవచ్చు, తద్వారా కొత్త ఆర్థిక మిత్రదేశాలను సంపాదించుకోవచ్చు.ఈ దేశీయ అమ్మకాల విజయం మన దేశం యొక్క ఉత్పాదక సామర్థ్యం మరియు వ్యాపార అనుకూలతను ప్రపంచానికి వివరిస్తుంది. భారతదేశం కేవలం వస్తువుల వినియోగదారుగా కాకుండా, వాటిని భారీ స్థాయిలో తయారు చేసి, పంపిణీ చేయగల ఒక ఉత్పత్తి కేంద్రంగా కూడా మారుతోందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ అంశాన్ని ఉపయోగించుకుని, భారతదేశం అనేక దేశాలకు తమ తయారీ కార్యకలాపాలను ఇక్కడికి తరలించమని లేదా స్థానిక తయారీదారులతో భాగస్వామ్యం కుదుర్చుకోమని ఆహ్వానించవచ్చు. ముఖ్యంగా, చైనా వంటి దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని చూస్తున్న పశ్చిమ దేశాలు మరియు జపాన్, దక్షిణ కొరియా వంటి సాంకేతికతలో ముందంజలో ఉన్న ఆసియా దేశాలకు భారతదేశం ప్రాధాన్యతా పెట్టుబడి గమ్యస్థానం గా మారవచ్చు. దీనివల్ల ఆయా దేశాలతో మన దౌత్య మరియు ఆర్థిక సం బంధాలు బలోపేతమై, అవి మనకు దీర్ఘకాలిక వ్యూహాత్మక మిత్రు లుగా మారే అవకాశం ఉంది. ఈ దేశీయ బలాన్ని మిత్రదేశాల సంపాదనకు ఉపయోగించుకోవాలంటే, మనం కొన్ని నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి. మొదటిది, మన రిటైల్ మరియు వినియోగదారుల డేటాను పారదర్శకంగా, సమగ్రంగా అంతర్జాతీయ సంస్థలకు అందించాలి. దీని ద్వారా వారు భారత మార్కెట్ పరిమాణాన్ని మరియు వృద్ధి సామర్థ్యాన్ని పూర్తిగా అర్థం చేసుకోగలుగుతారు. రెండవది, అంతర్జాతీయ పెట్టుబడిదారుల కోసం వ్యాపార నిబంధనలు, పన్నుల విధానాన్ని మరింత సరళీకృతం చేసి, ఏక గవాక్ష (సింగిల్ విండో) అనుమతి వ్యవస్థలను వేగవంతం చేయాలి.మూడవది, మన మిత్ర దేశాలతో ముక్త వాణిజ్య ఒప్పందాలను (స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను) కుదుర్చుకోవడం ద్వారా, వారి ఉత్పత్తులకు మన మార్కెట్లో, మన ఉత్పత్తులకు వారి మార్కెట్లో సులభంగా ప్రాప్యత లభిస్తుంది. తద్వారా, దేశీయ వినియోగం ద్వారా వచ్చిన ఈ శక్తిని అంతర్జాతీయ ఆర్థిక మరియు దౌత్య సంబంధాలను బలోపేతం చేయడానికి శక్తివంతమైన ఉత్ప్రేరకంగా భారతదేశం ఉపయోగించుకోగలుగుతుంది. దేశీయంగా వినియోగం పెరగడం అనేది కేవలం పండుగ సీజన్కు మాత్రమే పరిమితం కాకుండా, సంవత్సరమంతా స్థిరంగా కొనసాగేలా చేయడమే ఆత్మనిర్భర భారత్కు మొదటి మెట్టు. దీని కోసం, దేశవ్యాప్తంగా ఉన్న చిన్న తరహా పరిశ్రమలకు మరియు గ్రామీణ చేతివృత్తులవారికి మరింత ఆర్థిక సహాయం అందించాలి. వారికి తక్కువ వడ్డీకే రుణాలు, అవసరమైన యంత్రాలు మరియు సాంకేతికతను అందించడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలి. ముఖ్యంగా, ప్రతి గ్రామం లేదాప్రాంతం ప్రత్యేకంగా తయారుచేసే వస్తువుల ఉత్పత్తికి (ఒక జిల్లా – ఒక ఉత్పత్తి తరహాలో) ప్రోత్సాహం అందించి, వాటికి దేశీయం గా, అంతర్జాతీయంగా మంచి మార్కెటింగ్ కల్పించాలి. దీనివల్ల గ్రామీణ ఉపాధి పెరుగుతుంది, స్థానిక సంస్కృతికి విలువ లభిస్తుంది.ఉత్పత్తుల నాణ్యత మరియు విశ్వసనీయతను పెంచడం అత్యంత కీలకం. స్థానిక వస్తువులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడటానికి, దేశవ్యాప్తంగా నాణ్యతా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలి. చిన్న వ్యాపారులకు మరియు తయారీదారులకు నిరంతరంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, వస్తువుల నాణ్యతను మెరుగుపరిచే పద్ధతులు, ప్యాకేజింగ్ మరియు ఉత్పత్తి నిర్వహణపై అవగాహన కల్పించాలి. ఈ నాణ్యత హామీ అనేది వినియోగదారులలో దేశీయ ఉత్పత్తులపై నమ్మకాన్ని పెంచుతుంది, తద్వారా వారు దిగుమతి చేసుకున్న వస్తువుల కంటే స్థానిక వస్తువులనే కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతారు. ఈ విధంగా, స్థానిక ఉత్పత్తికి బలమైన, నమ్మదగిన పునాది ఏర్పడుతుంది.

కొనుగోలు వేదికలను మరియు సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం మరో ముఖ్యమైన చర్య. అసంఘటిత రంగంలోని చిన్న వ్యాపారులు మరియు విక్రేతలు కూడా సులభంగా తమ ఉత్పత్తులను ఆన్లైన్లో విక్రయించడానికి వీలుగా, ప్రభుత్వం లేదా ఇతర సంస్థల ద్వారా సరళమైన, తక్కువ ఖర్చుతో కూడిన ఈ–కామర్స్ వేదికలను అందించాలి. అలాగే, దేశీయంగా ఉత్పత్తి చేయబడిన సాంకేతిక పరిష్కారాలను చిన్న వ్యాపారాలకు పరిచయం చేయడం ద్వారా, వారు తమ వ్యాపార నిర్వహణను, సరుకు రవాణాను మరియు వినియోగదారులతో సంబంధాలను మెరుగుపరుచుకోగలుగుతారు. ఈ సమగ్రమైన స్థానిక చర్యల ద్వారా, భారతదేశం దీపావళి అమ్మకాల ద్వారా వచ్చిన ఉత్సాహాన్ని దీర్ఘకాలిక ఆత్మనిర్భర ఆర్థిక శక్తిగా మార్చుకోగలుగుతుంది. దీపావళి సందర్భంగా భారతదేశంలో నమోదైన రికార్డు స్థాయి అమ్మకాలు భారత ఆర్థిక వ్యవస్థకు ఒక చారిత్రక మైలురాయిగా నిలిచాయి. ఈ విజయం దేశీయంగా పెరుగుతున్న వినియోగదారుల విశ్వాసాన్ని, జీఎస్టీ సరళీకరణ వంటి ప్రభుత్వ విధానాల సానుకూల ప్రభావాన్ని, మరియు ముఖ్యంగా 'వోకల్ ఫర్ లోకల్' నినాదానికి ప్రజల నుంచి లభించిన బలమైన మద్దతును స్పష్టంగా చాటిచెప్పింది.

ఇది దేశీయంగా 50 లక్షల తాత్కాలిక ఉపాధిని కల్పించి, స్థానిక వ్యాపారులు మరియు అసంఘటిత రంగానికి కొత్త ఉత్సాహాన్ని అందించింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి, వాణిజ్య సుంకాల భయాల వంటి సవాళ్లు ఉన్నప్పటికీ, దేశీయంగా ఇంతటి స్థిరమైన డిమాండ్ సృష్టించగలగడం అనేది మన ఆర్థిక వ్యవస్థకు ఒక రక్షణ కవచంగా నిలుస్తుందని నిరూపితమైంది. అయితే, ఈ తాత్కాలిక విజయాన్ని సుస్థిరమైన మరియు ఆత్మనిర్భర వృద్ధిగా మార్చడానికి నిరంతర కృషి అవసరం. దీని కోసం చిన్న వ్యాపారులకు మెరుగైన రుణ సదుపాయం, తయారీ యూనిట్ల సాంకేతిక మెరుగుదల, నాణ్యతా ప్రమాణాల పెంపు, మరియు టైర్ 2, 3 నగరాల్లో లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి చర్యలు తక్షణమే చేపట్టాలి. ఈ దేశీయ బలాన్ని ఉపయోగించుకుని, వ్యూహాత్మకంగా కొత్త అంతర్జాతీయ మిత్రదేశాలను సంపాదించుకోవడానికి, వ్యాపార సంబంధాలను విస్తరించడానికి భారతదేశం కృషి చేయాలి. ఈ విధంగా, దీపావళి అమ్మకాలు అందించిన సానుకూలతను ఒక ప్రారంభ బిందువుగా తీసుకుని, దేశీయ శక్తిని, సాంకేతికతను జోడించడం ద్వారా, భారతదేశం ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదుగుతూ ఆత్మనిర్భర భారత్ లక్ష్యాన్ని పూర్తి చేయగలుగుతుంది.

# 'కాలుష్యం ఎవరు ఎక్కువ చేశారో, వారే ఎక్కువ తగ్గించాలి'

**జనక మోహన రావు దుంగ**
**8247045230**

- ప్రపంచ సగటు కార్బన్ డయాక్సైడ్ స్థాయి రికార్డు స్థాయిలో పెరిగింది
- దీనికి తోడు, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి ఇతర వేడిని పెంచే వాయువులు
- శిలాజ ఇంధనాలను వాడకాన్ని తగ్గిస్తామన్నా పడని అడుగులు
- ఎల్ నినో ప్రభావం వల్ల అమెజాన్, ఆఫ్రికా వంటి ప్రాంతాల్లో భయంకరమైన కరువులు
- ఊహించని వరదలు, భరించలేని ఎండలు, రుతుపవనాలలో మార్పులు

ప్రపంచ వాతావరణ సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం గాలిలో ఉండే కార్బన్ డయాక్సైడ్ పరిమాణం రికార్డు స్థాయిలో పెరిగింది. ఈ పెరుగుదల గ్లోబల్ వార్మింగ్ ప్రధాన కారణాలలో ఒకటిగా మారింది. 2023 నుండి 2024 మధ్య ప్రపంచ సగటు కార్బన్ డయాక్సైడ్ స్థాయి రికార్డు స్థాయిలో 3.5 పీపీఎం పెరిగింది. 1957లో కొలవడం మొదలుపెట్టిన తర్వాత ఇంత భారీ పెరుగుదల ఇదే తొలిసారి. దీనితో 2024లో గాలిలోని కార్బన్ డయాక్సైడ్ వాయువు స్థాయి గత 8 లక్షల సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా 423.9 పీపీఎంకు చేరుకుంది. 1960ల నుంచి కాలుష్యం పెరిగే వేగం దాదాపు మూడు రెట్లు ఎక్కువైంది. గతంలో నెమ్మదిగా పెరిగేది కానీ ఇప్పుడు ఒక్కసారిగా 3.5 పీపీఎంకు పెరగడం మరింత భయాన్ని కలిగిస్తోంది. దీనికి తోడు, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి ఇతర వేడిని పెంచే వాయువులు కూడా రికార్డు స్థాయికి చేరాయి. ఈ వాయువులన్నీ కలిసి 1990 నుంచి భూమిపై వేడిని నిల్వ చేసే శక్తిని 54 శాతం పెంచాయి.

**మానవ తప్పిదాలు – ప్రకృతి బలహీనత:**

ఈ అతిపెద్ద పెరుగుదలకు ముఖ్యంగా రెండు ప్రమాదకరమైన కారణాలు ఒకటి మనం చేసే పనుల వల్ల విడుదలయ్యే కాలుష్యం, రెండు ప్రకృతిలో కాలుష్యాన్ని పీల్చుకునే శక్తి తగ్గడం. ఇది భూమిపై ఉన్న కార్బన్ చక్రంలో ఒక పెద్ద సమస్య ఏర్పడిందని సూచిస్తుంది. బొగ్గు, పెట్రోల్, గ్యాస్ వంటి శిలాజ ఇంధనాలను వాడకాన్ని తగ్గిస్తామని ప్రపంచ దేశాలు ప్రమాణాలు చేసినప్పటికీ వాటిని మండించడం ఆగలేదు. కార్బన్ డయాక్సైడ్ వాయువు పెరుగుదలలో ఎక్కువ భాగం ఇంకా ఈ శిలాజ ఇంధనాల నుంచే వస్తుంది. సాధారణంగా సముద్రాలు, అడవుల వంటి ప్రకృతి వ్యవస్థలను 'కార్బన్ సింక్లు' అంటారు. ప్రతి సంవత్సరం మనం విడుదల చేసే కాలుష్యంలో దాదాపు 50 శాతం వరకు ఇవి పీల్చుకుంటాయి. అయితే 2024లో వీటి కాలుష్యాన్ని పీల్చుకునే సామర్థ్యం తగ్గిందని ప్రపంచ వాతావరణ సంస్థ చెబుతోంది. వీటికి తోడుగా తీవ్రమైన వాతావరణ మార్పులు ప్రకృతి వైపరీత్యాలు కూడా ఈ పెరుగుదలకు కారణమవుతున్నాయి. 2024లో రికార్డు స్థాయి వేడి, ఎల్ నినో ప్రభావం వల్ల అమెజాన్, ఆఫ్రికా వంటి ప్రాంతాల్లో భయంకరమైన కరువులు, పెద్ద అటవీ మంటలు వచ్చాయి. ఈ మంటల ద్వారా అడవుల్లో నిల్వ ఉన్న భారీ మొత్తంలో కార్బన్ డయాక్సైడ్ వాయువు తిరిగి గాలిలోకి విడుదలవ్వడం ఈ పెరుగుదలను మరింత వేగవంతం చేసింది.

**ప్రకృతి సహకారం ఇవ్వట్లేదు – ప్రమాదకరమైన 'వలయం'**

ఈ రికార్డు పెరుగుదల చూస్తుంటే, వాతావరణ సంక్షోభం నెమ్మదిగా జరగడం లేదు, ఇది తనకై తాను వేగాన్ని పెంచే ప్రమాదకరమైన వలయం లోకి మారుతోందనే హెచ్చరిక ఇస్తుంది. ముఖ్యంగా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే కాలుష్యాన్ని పీల్చుకునే కార్బన్ సింక్లు బలహీనపడటం. ఉష్ణోగ్రత పెరిగిన సముద్రాలు తక్కువ కార్బన్ డయాక్సైడ్ వాయువును పీల్చుకుంటాయి. అదే సమయంలో అవి ఆమ్లంగా మారి సముద్రంలోని జీవులకు ప్రమాదంగా మారుతాయి. భూమిపై కూడా, విపరీతమైన వేడి, కరువుల వల్ల మొక్కలు ఒత్తిడికి గురై కాలుష్యాన్ని తక్కువగా పీల్చుకుంటాయి. ఈ ఒత్తిడి తీవ్రమైతే



భారీగా చెట్లు చనిపోతాయి, అరణ్యాలు కాలిపోతాయి. దీనివల్ల నిల్వ ఉన్న కార్బన్ తిరిగి గాలిలో కలిసి, ఆ అటవీ ప్రాంతం కాలుష్యాన్ని పీల్చుకోవడం మానేసి, కాలుష్యాన్ని విడుదల చేసే ప్రాంతంగా మారుతుంది. ఈ వలయం మనకు ఏం చెబుతోందంటే మనం కాలుష్యాన్ని తగ్గించినా లేదా ఆపినా, ప్రకృతి కూడా తన శక్తిని కోల్పోయి నిల్వ ఉన్న కార్బన్ను విడుదల చేయడం మొదలుపెడితే మొత్తం వాతావరణ వ్యవస్థ మరింత వేగంగా వేడెక్కుతుంది.

**దీర్ఘకాలిక ప్రభావం – ప్రపంచ దేశాలకు హెచ్చరిక**

కార్బన్ డయాక్సైడ్ వాయువు చాలాకాలం వాతావరణంలో ఉండే కాలుష్య వాయువు, ఇది గాలిలో శతాబ్దాల పాటు ఉంటుంది. అందుకే 423.9 పీపీఎం స్థాయి అనేది తాత్కాలికం కాదు. ఇది రాబోయే తరాలకు కూడా అధిక ప్రపంచ ఉష్ణోగ్రతలకు దీర్ఘకాలిక కట్టుబాటును సూచిస్తుంది. ఈ వాయువులు పట్టి ఉంచే వేడి, మనం ఉద్గారాలను వెంటనే తగ్గించినా కూడా, భవిష్యత్తులో కరువులు, వరదలు లాంటి వాతావరణ మార్పులను, తీవ్రమైన విపత్తులను పెంచుతూనే ఉంటుంది. ఈ డేటా ప్రకారం పారిస్ ఒప్పందంలో నిర్ణయించిన 1.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పరిమితిని చేరుకోవడం మరింత కష్టమని తెలుస్తోంది. ప్రపంచ వాతావరణ సంస్థ నివేదిక అంతర్జాతీయ విధానాలకు 'రెడ్ అలర్ట్'గా పనిచేస్తుంది. కాలుష్యాన్ని కేవలం 'తగ్గిస్తాం' అనే మాటలు చాలవు. శిలాజ ఇంధనాలను తక్షణమే పూర్తిగా విడిచిపెట్టాల్సిన అవసరాన్ని ఈ నివేదిక స్పష్టం చేస్తుంది. ప్రపంచ లక్ష్యాలను పెంచడంతో పాటు, కాలుష్యాన్ని పీల్చుకునే అడవులు, సముద్రాలను కాపాడడానికి కూడా ప్రయత్నాలు చేయాలి.

**భారతదేశానికి సవాల్:**

ఈ రికార్డు స్థాయి బొగ్గుపులుసు వాయువు పెరుగుదల మన దేశానికి చాలా పెద్ద ప్రమాద ఘంటిక. ప్రపంచ దేశాలు కలిసి కాలుష్యాన్ని తగ్గించడంలో విఫలం కావడం వల్ల, వాతావరణం మరింత వేడెక్కి, తీవ్రమైన వాతావరణ మార్పులు మొదలయ్యాయి. ఈ మార్పుల వల్ల మన దేశంలోనే ఎక్కువ నష్టం జరుగుతుంది. ఊహించని వరదలు, భరించలేని ఎండలు, రుతుపవనాలలో మార్పులు వంటివి పెరిగి మన వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటాయి. ఇది పేద ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. వాతావరణ న్యాయం కోణంలో చూస్తే ఈ పెరుగుదల మనకు అన్యాయం. మన దేశంలో ఒక్కొక్క మనిషి చేసే కాలుష్యం అంటే తలసరి కాలుష్యం ధనిక దేశాల కంటే చాలా తక్కువ. కానీ పాత కాలం నుండి ఎక్కువ కాలుష్యం చేసిన ధనిక దేశాల తప్పుల వల్ల, ఇప్పుడు ఈ మార్పుల కష్టాన్ని మాత్రం మనమే ఎక్కువ భరించాల్సి వస్తోంది. ఈ పరిస్థితి మన ముందు ఒక పెద్ద సవాలును ఉంచుతోంది. అభివృద్ధి చెందుతున్న దేశంగా మనకు విద్యుత్, పరిశ్రమల కోసం శక్తి చాలా అవసరం. అందుకే మన మొత్తం కాలుష్యం పెరుగుతోంది. దీనిని తగ్గించడానికి మనం 2030 నాటికి 50 శాతం విద్యుత్తును సోలార్, పవన శక్తి వంటి కాలుష్యం లేని వనరుల నుండి పొందాలని అలాగే 2070 నాటికి పూర్తిగా కాలుష్యం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ఈ ప్రయత్నాలు గొప్పవే. కానీ ప్రపంచ స్థాయిలో కాలుష్యం చాలా వేగంగా పెరుగుతోంది. కాబట్టి ధనిక దేశాలు తమ చారిత్రక తప్పులకు పరిహారంగా, మనకు వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి నిధులు, కొత్త టెక్నాలజీ వెంటనే ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేయాల్సిన సమయం ఇది. ఇకపై భారతదేశం వీటిని ఎదుర్కోడానికి చాలా గట్టిగా చేయాలి. కాలుష్యం లేకుండా వేగంగా కొత్త ఇంధన వనరులకు మారాలి. ప్రజలను కాపాడడానికి కరవును తట్టుకునే విత్తనాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు వంటివి నిర్మించాలి. వాతావరణ మార్పులకు ప్రపంచ వేదికపై పోరాడాలి. ధనిక దేశాలను బాధ్యులను చేయాలి. 'కాలుష్యం ఎవరు ఎక్కువ చేశారో, వారే ఎక్కువ తగ్గించాలి' అనే సిద్ధాంతాన్ని గట్టిగా నిలబెట్టాలి. ఈ రికార్డు కాలుష్యం పెరుగుదల అనేది మనమందరం మారాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society
Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# బిజినెస్

సూర్య
హైదరాబాద్
గురువారం
23 అక్టోబర్ 2025



# భారీగా పెరిగిన సత్య నాదెళ్ల వేతనం



ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల జీతం భారీగా పెరిగింది. 2025 ఆర్థిక సంవత్సరంలో ఆయన 96.5 మిలియన్ డాలర్ల వేతనం అందుకోనున్నారు. అంటే మన భారతీయ కరెన్సీ ప్రకారం సుమారు రూ.846 కోట్లు అన్నమాట. ఈ విషయాన్ని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. 2024 ఆర్థిక సంవత్సరంలో ఆయన అందుకున్న 79.1 మిలియన్ డాలర్ల (రూ.664 కోట్లు)తో పోలిస్తే ఇది 22 శాతం ఎక్కువ. జూన్‌తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మైక్రోసాఫ్ట్ వృద్ధిలో దూసుకెళ్లింది. దీంతో కంపెనీ షేర్లు దాదాపు 23 శాతం లాభపడ్డాయి. మైక్రోసాఫ్ట్‌లో అందించిన సేవలకు గానూ సత్యనాదెళ్లకు 9.5 మిలియన్ డాలర్లు (రూ.80 కోట్లు) నగదు ప్రోత్సాహకం అందనున్నట్లు కంపెనీ ఫైలింగ్ తెలిపింది. కృత్రిమ మేధ రేసులో మైక్రోసాఫ్ట్ సాధించిన పురోగతి నేపథ్యంలో కంపెనీ బోర్డు ఈ నిర్ణయాన్ని వెలువరించింది. సత్యనాదెళ్ల, ఆయన నాయకత్వ బృందం కృషి వల్ల కృత్రిమ మేధ రంగంలో మైక్రోసాఫ్ట్ మరింత ముందుకువెళ్లిందని సంస్థ బోర్డు పేర్కొంది.సత్య నాదెళ్లకు లభించిన ఈ భారీ పారితోషికంలో పెద్దభాగం స్టాక్ ఆప్షన్ల రూపంలో ఉండటంతో, ఆయనకు నేరుగా లభించే మొత్తం కంటే భవిష్యత్‌లో మైక్రోసాఫ్ట్ షేర్ విలువ పెరిగితే కలిగే లాభమే ప్రధానంగా ఉంటుంది. ఇది మైక్రోసాఫ్ట్ బోర్డు ఆయనకు ఉన్న నమ్మకాన్ని సూచించే విధంగా పరిగణించవచ్చు. అంతేకాదు, సంస్థను ఏఐ విప్లవానికి అనుగుణంగా మలచడంలో ఆయన పాత్ర కీలకంగా మారినట్టు బోర్డు అభిప్రాయపడింది. ఈ వేతన పెంపుతో సత్య నాదెళ్ల తాజా సంవత్సరానికిగాను ప్రపంచంలో అత్యధిక పారితోషికం పొందిన టెక్ సీఈఓల జాబితాలో ఉన్నత స్థానాన్ని ఆక్రమించారు.

## స్పైస్ లౌంజ్ బోర్డు అక్టోబర్ 23న సమావేశం

స్పైస్ లౌంజ్ ఫుడ్ వర్క్స్ లిమిటెడ్ అక్టోబర్ 23, 2025న బోర్డు సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ సమావేశంలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ వ్యాపార సముపార్జనల ప్రతిపాదనలను పరిశీలించనున్నారు. అవసరమైన నియంత్రణ అధికారుల అనుమతుల ఆధీనంగా ఈ నిర్ణయాలు తీసుకోబడతాయి.స్పైస్ లౌంజ్ 2019లో స్థాపితమై, భారతదేశం, అమెరికా మరియు కెనడాలో తన కార్యకలాపాలను విస్తరించింది. కంపెనీ బఫెలో వైల్డ్ వింగ్స్, వింగ్‌జోన్, ఈటచ్, టెక్‌సాఫ్ట్ వంటి గ్లోబల్ బ్రాండ్లకు ప్రత్యేక లైసెన్సింగ్ హక్కులు కలిగి ఉంది. అదే సమయంలో బ్లేజ్ కబాబ్స్, జోరా, సల్యూడ్, సన్‌బర్న్ యూనియన్ అనే స్వంత బ్రాండ్లను కూడా నిర్వహిస్తోంది.ఈ సంస్థ వ్యూహాత్మకమైన యోచనలతో మరియు టెక్నాలజీ ఆధారిత విస్తరణ నమూనాలతో, గ్లోబల్ స్థాయిలో తన ప్రభావాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. స్పైస్ లౌంజ్, నూతనత, నాణ్యత, మరియు ఆపరేషన్ మేధస్సుతో, భారత్‌లో తదుపరి వంట కళల విప్లవానికి నాయకత్వం వహించాలని చూస్తోంది.విభిన్న డైనింగ్ మోడల్స్ ద్వారా స్థిరమైన, అధిక నాణ్యతతో కూడిన ఆహార అనుభవాన్ని అందించడమే స్పైస్ లౌంజ్ లక్ష్యం. స్కేలబుల్, టెక్నాలజీ ఆధారిత, ఆస్తులపై తక్కువ భారం కలిగిన, తక్కువ సమయంలో విస్తరించగల మోడల్స్ నిర్మించేందుకు సంస్థ కట్టుబడి ఉంది.

### ఎంజీ మోటార్స్ దీపావళి సందేశం - మానవ సంబంధాలకి మద్దతు



జెఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా ఈ దీపావళిని ఒక ప్రత్యేకమైన అభియానంతో జరుపుకుంటోంది. "డైరెక్టరీ ఆఫ్ కైండ్‌నెస్" అనే తొలిసారి ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం ద్వారా స్థానిక మట్టి కళాకారులు, మిఠాయివాళ్లు, చిన్న వ్యాపారుల పాత్రను గుర్తించి, వారిని మన సంబరాల్లో భాగస్వాములుగా చేసేందుకు ప్రోత్సహిస్తోంది.ఈ ఉత్సవం భాగంగా ప్రజలు తమ పరిసరాలలో ఉన్న కళాకారులు, వృత్తిపరులు, సేవలందించే బూడిద బూడిద వ్యక్తుల వివరాలను ఈ డైరెక్టరీలో భాగస్వామ్యం చేయవచ్చు. దీని ద్వారా పండుగల సమయంలో మన సమాజాన్ని బలపరిచే చిన్న, కాని విలువైన సంబంధాలపై దృష్టి పెట్టనున్నారు.మార్కెటింగ్ ప్రధానుడు ఉదిత్ మల్హోత్రా మాట్లాడుతూ, "ఈ కామర్షియల్ యుగంలో, పండుగలు మానవ సంబంధాల గురించి గుర్తు చేయాల్సిన సమయం వచ్చింది. దీపాలను చేయజేసే కుండలకారుడు నుండి మిఠాయి తయారీలో నైపుణ్యం కలిగిన స్థానిక వ్యాపారి వరకు ం ప్రతి ఒక్కరి శ్రమకు గౌరవం ఇవ్వడమే మా లక్ష్యం" అని చెప్పారు.ఈ సందేశాన్ని మరింత హృద్యంగా పంచేందుకు ఎంజీ మోటార్ ఒక షార్ట్ ఫిల్మ్ రూపొందించింది. ప్రముఖ ఓటీటీ నటుడు గగన్ అరోరా మరియు అనుభవజ్ఞుడు అనిల్ ఖోప్కర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో, డిజిటల్ ప్రపంచంలో జీవించే ఒక యువకుడు తన తాత సహాయంతో మానవ సంబంధాల విలువను తిరిగి గుర్తించడాన్ని చూపించారు. ఈ చిత్రం కంపెనీ సోషల్ మీడియా ఛానళ్లలో ప్రసారమవుతోంది.

### తస్వా-శుభ్మన్ గిల్: సమానత్వానికి కొత్త నిర్వచనం



ఆధునిక భారతీయ పురుషుల దుస్తుల బ్రాండ్ తస్వా, ప్రముఖ క్రికెటర్ శుభ్మన్ గిల్‌ను తన బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. ఆదిత్య బిర్లా ఫ్యాషన్ %ఽ% రిటైల్ లిమిటెడ్ మరియు ప్రముఖ డిజైనర్ తరుణ్ తహిలియానీ భాగస్వామ్యంతో నడుస్తున్న తస్వా, ఈ సందర్భంగా వివాహాలకి సంబంధించిన దృక్కోణాన్ని కొత్తగా నిర్వచిస్తోంది. ఇది గిల్‌కు మొదటి వివాహ దుస్తుల బ్రాండ్ అనుసంధానంగా కూడా చరిత్ర సృష్టించింది.తస్వా ప్రచారం ద్వారా పెళ్లిళ్లు ఇప్పుడు పరంపరలను అనుసరించడం కాకుండా, ప్రేమ, సమానత్వం, వ్యక్తిత్వాన్ని గౌరవించే వేడుకలుగా చూపబడుతున్నాయి. ఈ దృక్కోణాన్ని ప్రతిబింబించే విధంగా తస్వా డిజైన్లు ఆధునికతతో పాటు భారతీయ సంప్రదాయాల సారాన్ని కలగలిపి తయారవుతున్నాయి.శుభ్మన్ గిల్ ఈ భాగస్వామ్యంపై స్పందిస్తూ, "తస్వా అనుసంధానం నా కోసం ప్రత్యేకమైనది. మైదానంలో ఇన్నింగ్స్‌లా, పెళ్లి వేడుకలు కూడా స్వీయ వ్యక్తిత్వం, బలానికి, మెలకువకి ప్రతిరూపం. తస్వా చూపించిన ప్రేమకు, సౌలభ్యానికి, సంప్రదాయాలకు గౌరవం ఇచ్చే ఆలోచన నన్ను ఆకట్టుకుంది." అన్నారు.తస్వా బ్రాండ్ హెడ్ ఆశిష్ ముకుల్ మాట్లాడుతూ, "మేము కేవలం దుస్తులే కాదు, ఒక భావనకి ప్రతినిధులం. పెళ్లిళ్లు ఇప్పుడు కేవలం విధానాల గురించి కాకుండా, ఆ జంట గురించి. శుభ్మన్ గిల్‌తో ఈ దృక్కోణాన్ని కొత్త తరం వరులకి చేరవేయడమే మా లక్ష్యం" అని తెలిపారు.

### ఐటీసీ హొటల్స్ ప్రారంభించిన వెల్కమ్ హొటల్ బోధ్ గయా



ఐటీసీ హొటల్స్ లిమిటెడ్ బోధ్ గయాలో వెల్కమ్ హొటల్‌ను అధికారికంగా ప్రారంభించింది. 18 ఎకరాల ప్రశాంత వాతావరణంలో విస్తరించిన ఈ హొటల్‌లో 98 వసతి గదులు, సూట్లు మరియు ఆధునిక మనదంగాలు కలిగిన కాన్ఫరెన్స్ సెంటర్ కలదు. ఇది బీహార్ మరియు తూర్పు భారతదేశంలో అతిపెద్ద సమావేశ వేదికలలో ఒకటిగా నిలిచింది. ఉత్సవాలు, వ్యాపార సమావేశాలు, ఆధ్యాత్మిక శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం రూపొందించిన ఉత్తరాఫల్గు హాల్, నలంద హాల్ మరియు స్వపా ఆడిటోరియంలో కలిపి 500 నుండి 2,000 మందికి వరకు పాలుపంచుకునే విధంగా ఏర్పాట్లు ఉన్నాయి. ఇది బోధ్ గయాను తూర్పు భారతదేశంలోని ప్రముఖ ఎంఐసీఇ (సమావేశాలు, ప్రోత్సాహకాలు, సమావేశాలు, ప్రదర్శనలు) గమ్యస్థానంగా మార్చనున్నాయి.హొటల్‌లోని వేదికలు మాత్రమే కాదు, తినిపించడంలో కూడా విశేషంగా ఆకట్టుకుంటాయి. వెల్కమ్ కేఫ్ బోధి అనే మల్టీక్యూజిన్ రెస్టారెంట్ అన్ని రోజులు అందుబాటులో ఉంటుంది. వెల్కమ్ స్పాలో ప్రాదేశిక తాజా అందించబడతాయి. కయా కల్ప్ రూపాన 'కె' స్పా, స్విమ్మింగ్ పూల్, ఆధునిక జిమ్ వంటి సౌకర్యాలు విలాసానికి తోడు విశ్రాంతిని కలిగిస్తాయి.ప్రముఖ మహాబోధి ఆలయం వ్యూకు బాల్కనీలు కలిగిన ప్రెసిడెన్షియల్ సూట్లు, ధ్యానానికి అనువైన డీలక్స్, ప్రీమియం, ఎగ్జిక్యూటివ్ గదులు కూడా అందుబాటులో ఉన్నాయి.

### ఐ ఫోన్ ఆర్డరిస్తే ఐక్యూ ఫోన్ డెలివరీ

**అమెజాన్‌కు కోర్టులు లాగిన కర్నూలు వాసి !**




ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్‌పై కర్నూల్ జిల్లా కన్స్యూమర్ ఫోరం సంచలన తీర్పు ఇచ్చింది. ఆన్‌లైన్‌లో ఐఫోన్ 15 ప్లస్ ఆర్డర్ చేసిన బాధితుడికి బదులుగా ఐక్యూ ఫోన్ డెలివరీ చేసేందుకు, అమెజాన్ సంస్థకు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. బాధితుడికి రూ.80 వేలు రిఫండ్ చేసి, అదనంగా రూ.25 వేలు చెల్లించాలని ఆదేశించిన ఫోరం, సంస్థ ఆదేశాలను పాటించకపోవడంతో ఈ చర్య తీసుకుంది. కర్నూల్ జిల్లాకు చెందిన వీరేశ్ అనే వ్యక్తి అమెజాన్ వెబ్‌సైట్‌లో రూ.80 వేలు చెల్లించి ఐఫోన్ 15 ప్లస్ మొబైల్ ఫోన్ ఆర్డర్ చేశాడు. అయితే, డెలివరీలో ఐఫోన్‌కు బదులుగా ఐక్యూ బ్రాండ్ ఫోన్ వచ్చింది. ఈ తప్పుడు డెలివరీపై బాధితుడు అమెజాన్ కస్టమర్ కేర్ సెంటర్‌ను సంప్రదించాడు. అక్కడ సరైన స్పందన లభించకపోవడంతో, వినియోగదారుల హక్కుల రక్షణ కోసం కర్నూల్ జిల్లా కన్స్యూమర్ ఫోరాన్ని ఆశ్రయించాడు. కన్స్యూమర్ ఫోరం బాధితుడి ఫిర్యాదుపై విచారణ చేపట్టింది. విచారణలో అమెజాన్ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలింది. దీంతో, ఫోరం బాధితుడికి ఐఫోన్ 15 ప్లస్ డెలివరీ చేయాలని లేదా రూ.80 వేలు రిఫండ్ చేయాలని ఆదేశించింది. అంతే కాకుండా, మానసిక వేదన , సమయం వృధా చేసినందుకు అదనంగా రూ.25 వేలు చెల్లించాలని తీర్పు ఇచ్చింది. అయితే, అమెజాన్ సంస్థ ఈ ఆదేశాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో, బాధితుడు మరోసారి ఫోరాన్ని సంప్రదించాడు.

## ఇండిగ్రేటర్స్‌కు కొత్త సీఈఓగా విశాల్ మణి



హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ప్రముఖ సాంకేతిక మరియు వ్యాపార మార్పుల సంస్థ ఇండిగ్రేటర్స్, విశాల్ మణిని తమ కొత్త ప్రధాన కార్యనిర్వాహక అధికారి (సీఈఓ)గా నియమించినట్లు ప్రకటించింది. విశాల్ మణి గారు రెండు దశాబ్దాలకి పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, సాఫ్ట్‌వేర్ పరిశోధన మరియు అభివృద్ధి, షేర్డ్ సర్వీసులు మరియు ఎంటర్ప్రైజ్ పరిష్కారాలలో అనుభవం కలిగిన నాయకుడు.
ఇండిగ్రేటర్స్‌కి చేరేముందు, విశాల్ మణి గారు నెమెట్షెక్ ఇండియాకు (మునుపటి పేరు స్పేస్‌వెల్ ఇండియా) మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలందించారు, అక్కడ ఆయన సంస్థను ప్రారంభించి 12 సంవత్సరాలు విజయవంతంగా నడిపారు. ఇన్ఫోసిస్, నాక్ సిస్టమ్స్ మరియు కార్గిల్ సంస్థలలో కీలక పాత్రలు నిర్వహించారు.
విశాల్ గారు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లపై నిపుణుడు మాత్రమే కాకుండా, సామాజిక అభివృద్ధికి కట్టుబడి ఉన్న వ్యక్తి. తన ఎన్జీఓ "సరితాంశ్" ద్వారా కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన ఢిల్లీ ఐఐఎఫ్టీ నుండి అంతర్జాతీయ వ్యాపారంలో ఎంబిఏ పూర్తి చేశారు.
ఇండిగ్రేటర్స్ సంస్థ గ్లోబల్ సంస్థలకు భారతదేశంలో ఉత్తమ నైపుణ్య కేంద్రాలు స్థాపించేందుకు సేవలు అందిస్తోంది. బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ మోడల్ ద్వారా సంస్థలు చిన్న స్థాయిలో ప్రారంభించి, దీర్ఘకాలికంగా తమ స్వంత సంస్థలను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తోంది.

## ఎలైట్‌కాన్ రెండు అగ్రో సంస్థలలో మెజారిటీ వాటా కొనుగోలు

హైదరాబాద్‌కు చెందిన ఎలైట్‌కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఇటీవల ల్యాండ్స్‌మిల్ అగ్రో ప్రైవేట్ లిమిటెడ్‌లో 55% మరియు సన్‌బ్రిడ్జ్ అగ్రో ప్రైవేట్ లిమిటెడ్‌లో 51.65% వాటాను నగదు రూపంలో కొనుగోలు చేసినట్టు ప్రకటించింది. ఈ లావాదేవీల ముఖ్య ఉద్దేశం సంస్థ యొక్క ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ విభాగాన్ని మరింత విస్తరించడమే. వ్యవసాయ ఉత్పత్తుల రంగంలో ఇప్పటికే చురుకుగా పనిచేస్తున్న ఎలైట్‌కాన్, ఈ కొనుగోళ్లతో తన కార్యకలాపాల పరిమాణాన్ని పెంచడం, ఉత్పత్తుల విస్తృతి మెరుగుపరచడం మరియు ఆదాయ వనరులను విభిన్నీకరించడం లక్ష్యంగా పెట్టుకుంది.
కంపెనీ వచ్చే 12 నెలల్లో ఈ రెండు సంస్థల్లో 100% ఈక్విటీ వాటా పొందాలని యోచిస్తోంది.
2025 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో, ఎలైట్‌కాన్ రూ. 549 కోట్ల ఆదాయాన్ని, రూ. 71.60 కోట్ల ఈబిటిడా, రూ. 69.65 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. చివరి త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 232% పెరిగి రూ. 313.16 కోట్లకు చేరగా, నికర లాభం 222% పెరిగి రూ. 42.97 కోట్లకు చేరింది.
ఎలైట్‌కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సిగరెట్లు, శీషా, ధూమపాన మిశ్రమాలు మరియు ఇతర సంబంధిత పొగాకు ఉత్పత్తుల తయారీ, సరఫరాలో నిమగ్నమై ఉంది. యూఏఈ, సింగపూర్, హాంగ్‌కాంగ్, యునైటెడ్ కింగ్‌డమ్ మరియు యూరప్ ప్రాంతాలకు ఎగుమతులు చేస్తోంది. సంస్థ త్వరలో చీంగుటాకు, నస, మాచులైట్స్, మ్యాచ్‌బాక్స్ వంటి కొత్త ఉత్పత్తుల విభాగాలలో ప్రవేశించాలనే దిశగా ముందడుగులు వేస్తోంది.తన ఆధునిక ఉత్పత్తి కేంద్రం, ప్రయోగాత్మకతపై దృష్టి, అనుభవజ్ఞులైన పరిశోధన మరియు అభివృద్ధి బృందంతో ఎలైట్‌కాన్ గ్లోబల్ పొగాకు పరిశ్రమలో విశ్వసనీయ బ్రాండ్‌గా ఎదుగుతోంది. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా కొత్త ఫ్లేవర్స్, మిశ్రమాల అభివృద్ధిలో నిమగ్నమై ఉంది. సంస్థ తన ఉత్పత్తుల కస్టమైజేషన్‌లో విశేష అనుభవాన్ని కలిగి ఉండటంతో, మార్కెట్ అవసరాలను చురుకుగా తీర్చగలగడం సంస్థను ప్రత్యేకంగా నిలబెడుతోంది.

## శుభ్ ఫ్యామిలీ ప్రొటెక్ట్' టర్మ్ ప్లాన్ ఆవిష్కరించిన టాటా ఏఐఏ




ముంబై: భారతదేశపు దిగ్గజ జీవిత బీమా సంస్థల్లో ఒకటైన టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (టాటా ఏఐఏ) కొత్తగా టాటా ఏఐఏ శుభ్ ఫ్యామిలీ ప్రొటెక్ట్ పేరిట గేమ్ చేంజింగ్ టర్మ్ ప్లాన్‌ను ప్రవేశపెడుతోంది. ఇది తక్షణం ఏకమొత్తాన్ని చెల్లించడంతో పాటు 30 ఏళ్ల వరకు సరళతరంగా నెలవారీ ఆదాయాన్ని కూడా అందించే విధంగా తీర్చిదిద్దబడింది. కుటుంబాలకు సమగ్ర ఆర్థిక భద్రత కల్పించే విధంగా ఈ తరహా ప్లాన్ రూపొందడం ఇదే ప్రథమం. అనిశ్చితిలోను నిశ్చింతను కోరుకునే వారికి ఇది అనువైన ప్లాన్.
నిధులు కరిగిపోతాయని ఆందోళన పడాల్సిన పరిస్థితి లేకుండా, కుటుంబసభ్యులు తక్షణ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు ఈ విధానం ఉపయోగకరంగా ఉంటుంది. అంత్యక్రియల ఖర్చులు, రుణాలను తీర్చివేయడం లేదా ఇతరత్రా అత్యవసర ఖర్చులను ఎదుర్కొనేందుకు లంప్‌సమ్‌గా చేతికొచ్చే మొత్తం ఉపయోగపడుతుంది. తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. శుభ్ ఫ్యామిలీ ప్రొటెక్ట్‌లోని మంత్లీ ఇన్‌కం ఫీచరనేది చాలా ప్రత్యేకమైనది. ఇది కుటుంబం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు దీర్ఘకాలికంగా అవసరమైన ఆర్థిక దన్నును అందిస్తుంది.
ఉదాహరణకు ఆర్థిక అవసరాల కోసం తమ సంతానం మీద ఆధారపడిన వృద్ధ తల్లిదండ్రుల విషయం తీసుకుందాం. ఒకేసారి లభించే పెద్ద మొత్తం వారి ఆరోగ్య, వైద్య వ్యయాలకు తోడ్పడే విధంగా, కష్టకాలంలోనూ వారికి ఆర్థిక సహాయం కొనసాగేలా ఉపయోగపడుతుంది.
ఇక మంత్లీ ఇన్‌కం అనేది, వారు కొత్త పరిస్థితులకు అలవాటుపడే క్రమంలో ఆర్థిక అనిశ్చితి గురించి ఆందోళన పడకుండా సహాయకరంగా ఉంటుంది. వారి రోజువారీ ఖర్చులకు అవసరమయ్యే డబ్బు కోసం ఆందోళన చెందాల్సిన పరిస్థితి తగ్గుతుంది. దీనితో బాధాకరమైన పరిస్థితిలో వారికి కాస్త ఊరట లభిస్తుంది.
జీవిత భాగస్వామి అయిన భార్య విషయం తీసుకుంటే భర్త కన్నుమూస్తే వాటిల్లే నష్టం అసాధారణ స్థాయిలో ఉంటుంది. అయితే ఆర్థికంగా చూస్తే, శుభ్ ఫ్యామిలీ ప్రొటెక్ట్‌తో నెలవారీ ఆదాయం లభించడం వల్ల ఆమె తను జీవితాన్ని సాధ్యమైనంత సాఫీగా గడిపేందుకు వీలవుతుంది. తన జీవన ప్రమాణాలను త్యాగం చేయాల్సిన అవసరం లేకుండా, ఇంటి బిల్లుల నుంచి రోజువారీ అవసరాల వరకు తీర్చే విధంగా రెగ్యులర్‌గా ఆదాయాన్ని అందుకుంటూ, భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకునేందుకు ఆమెకు ఇది ఉపయోగపడుతుంది. ఇల్లు, పిల్లల బాగోగులు చూసుకుంటూ, కీలకమైన విషయాలపై దృష్టి పెట్టేందుకు సాధ్యపడుతుంది.

## రూ.10వేలు తగ్గిన బంగారం ధర



దేశంలో బంగారం ధర భారీగా తగ్గింది. బుధవారం ఒక్కరోజే రూ.10వేలు మేర తగ్గింది. 24 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,24,800కి చేరుకుంది. 22 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,14,483కు చేరుకుంది. కిలో వెండి ధర రూ.1,58,000కు చేరుకుంది. ఇటీవల బంగారం ధర భారీగా పెరిగిన విషయం తెలిసిందే. మళ్లీ ఇన్నాళ్లకు క్రమంగా తగ్గుతూ వస్తోంది. వెండి లోహాల్లో మదుపర్లు లాభార్జనకు దిగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కాస్త ఉపశమించడం ప్రస్తుతం గోల్డ్ రేటు తగ్గడానికి కారణమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**నగరాల వారీగా బంగారం ధరలు**

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,24,800గా ఉండగా, 22 క్యారెట్స్ బంగారం ధర రూ.1,14,483కు చేరుకుంది.విజయవాడలో 24 క్యారెట్స్ 10 గ్రాముల నాణ్యమైన బంగారం ధర రూ.1,24,800కు చేరుకుంది. 22 క్యారెట్స్ బంగారం ధర రూ.1,14,483గా ఉంది.విశాఖపట్నంలో 24 క్యారెట్స్ 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,24,800గా ఉండగా, 22 క్యారెట్స్ గోల్డ్ రేటు రూ.1,14.483గా ఉంది.ముంబయిలో 24 క్యారెట్స్ 10 గ్రాముల నాణ్యమైన బంగారం ధర రూ.1,24,800గా ఉంది. 22 క్యారెట్స్ బంగారం ధర రూ.1,14,483గా ఉంది.

**అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ రేట్లు**

అయితే, అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు భారీగా తగ్గాయి. ఔన్స్ స్పాట్ గోల్డ్ (31.10 గ్రాములు) ధర ఏకంగా 2497 డాలర్లు క్షీణించింది. దీంతో ఔన్స్ గోల్డ్ ధర 4045 డాలర్లకు చేరింది. ఇక స్పాట్ వెండి ధర కూడా తగ్గింది. 3.9 డాలర్లు తగ్గి 47.84 డాలర్లకు దిగివచ్చింది. అయితే ఒక్కరోజులోనే ఈ స్థాయిలో ధరలు తగ్గడం అలా అరుదుగా జరుగుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. 2013 తర్వాతే ఇంతగా పతనం అవ్వడం ఇప్పుడేనని అంటున్నారు.ఈ ఏడాది ప్రారంభం నుంచే బంగారం ధరలు 60 శాతానికి పెరిగి గరిష్ఠ స్థాయికి చేరింది. త్వరలోనే ఔన్స్ బంగారం ధర ఏకంగా 5,000 డాలర్లకు పెరిగే అవకాశం ఉందని భావించారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులపై కొనసాగుతున్న అనిశ్చితి కారణంగా బంగారం ధరలు భారీగా పెరిగాయి. అయితే మంగళవారం లాభాల స్వీకరణతో ఒక్కసారిగా అమ్మకాలు పెరిగి, ధరలు 6 శాతం వరకు పడిపోయాయి. బుధవారం ఆసియా మార్కెట్లలో కూడా ఈ పతనం కొనసాగింది. ఒక దశలో బంగారం ఔన్సు ధర 4,000 డాలర్ల వరకు తగ్గింది. వెండి కూడా అదే దారిలో నష్టపోయింది. దీని ప్రభావం బంగారం ఉత్పత్తిదారుల షేర్లపై తీవ్రంగా కనిపించింది. ఇక ఆసియా మార్కెట్లు కూడా బలహీనంగా ప్రారంభమయ్యాయి. హాంకాంగ్, షాంఘై, సిడ్నీ, వెల్లింగ్టన్, తైపీ, మనిలా సూచీలు నష్టపోయాయి.ఇక బంగారం, వెండి వంటి విలువైన లోహాల ధరలు అంతర్జాతీయ మార్కెట్ల అనుగుణంగానే ఉంటాయి. అక్కడ పెరిగితే ఇక్కడ కూడా పెరుగుతుంది. తగ్గినా కూడా అంతే. మన దేశం బంగారం కోసం దాదాపు దిగుమతులపైనే ఆధారపడుతుంది. అందుకే డాలర్ మారకపు విలువ కూడా దేశీయంగా బంగారం ధరలపై ప్రభావం చూపుతుంది.

## డీప్‌ఫేక్, ఏఐ కంటెంట్ దుర్వినియోగానికి అడ్డుకట్ట

### కీలక సవరణలు చేసిన కేంద్రం !




జనరేటివ్ ఏఐ, డీప్‌ఫేక్ టెక్నాలజీల దుర్వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 22న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యంతర మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) రూల్స్, 2021కి పలు సవరణలు ప్రతిపాదిస్తూ, ఓ ముసాయిదాను విడుదల చేసింది.
దీని ప్రకారం, సోషల్ మీడియా వేదికల్లో కృత్రిమంగా రూపొందిన కంటెంట్‌ను స్పష్టంగా లేబులింగ్ చేయాల్సి ఉంటుంది. సింపుల్‌గా చెప్పాలంటే, కృత్రిమమేధ (ఏఐ) ద్వారా తయారు చేసిన కంటెంట్, డీప్‌ఫేక్ కంటెంట్ అని సదరు వీడియో లేదా ఆడియో గురించి స్పష్టంగా చెప్పాల్సి ఉంటుంది. ఇందుకోసం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ఇంటర్‌మీడియరీస్ (ఎస్ఎస్ఎంఐ) తప్పనిసరిగా లేబులింగ్, మెటాడేటా ట్యాగింగ్, విజిబిలిటీ ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. వీడియో అయితే కనిపించే విధంగా, ఆడియో అయితే వినిపించే విధంగా ఏఐ, డీప్‌ఫేక్ కంటెంట్ అని స్పష్టంగా లేబుల్ చేయవలసి ఉంటుంది.భారత్‌లో 5 మిలియన్లకు పైగా నమోదిత వినియోగదారులు కలిగిన ఎస్ఎస్ఎంఐలు ఉన్నాయి. వీటిలో ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్ మొదలైన ప్లాట్ ఫామ్స్‌లు 2021 ఐటీ నిబంధనల ప్రకారం అదనపు సమ్మతికి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

**లేబులింగ్ ఎలా ఉండాలంటే?**

ప్రతిపాదిత ఐటీ నియమం 3(3) ప్రకారం, కృత్రిమంగా (సింథటిక్) తయారు చేసిన కంటెంట్‌ను సృష్టించడానికి వీలు కల్పించే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు కొన్ని నిబంధనలను కచ్చితంగా పాటించాలి. అవి ఏమిటంటే, ఏఐ, డీప్‌ఫేక్ కంటెంట్‌కు కచ్చితంగా 'శాశ్వతమైన ప్రత్యేక మెటాడేటా లేదా ఐడెంటిఫైయర్'తో లేబులింగ్ పొందుపరిచేలా చూసుకోవాలి. పైగా ఆ ఐడెంటిఫైయర్ స్పష్టంగా కనిపించేలా లేదా వినగలిగేలా ఉండాలి.
ముఖ్యంగా "విజువల్ డిస్‌ప్లే (వీడియో లేదా ఇమేజ్) అయితే దాని ఉపరితల వైశాల్యంలో కనీసం 10 శాతం ఐడెంటిఫైయర్ కనిపించాలి. ఒకవేళ అది ఆడియో అయితే దాని మొత్తం వ్యవధిలో కనీసం 10 శాతాన్ని కవర్ చేసేలా ఉండాలి. అంతేకాదు మెటా డేటా లేదా ఐడెంటిఫైయర్‌ను మార్చకూడదు. సప్రెస్ చేయడం (అణచివేయడం), తీసివేయడం లాంటివి చేయకూడదు" అని ముసాయిదా నియమాలు స్పష్టం చేస్తున్నాయి.
మరోవైపు సింథటిక్ కంటెంట్ సృష్టించడానికి లేదా సవరించడానికి వీలు కల్పించే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు- అప్‌లోడ్ చేసిన కంటెంట్ ఏఐ ద్వారా సృష్టించబడిందని ధ్రువీకరించడానికి, ప్రకటించడానికి తగి సాంకేతిక మార్పులు, చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది అని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పేర్కొంది.

**తప్పుడు సమాచారం అరికట్టడమే లక్ష్యం!**

ఏఐ, డీప్‌ఫేక్ ద్వారా నిడిచే తప్పుడు సమాచారాన్ని అరికట్టడం, ప్రజలను వంచనకు గురికాకుండా తప్పించడం, ఎన్నికల ఫలితాలను తారుమారు చేసే పరిస్థితులను నివారించడమే లక్ష్యంగా ఈ తాజా ప్రతిపాదనలు చేసినట్లు ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ తెలిపింది. ఓపెన్‌గా, సురక్షితమైన, విశ్వసనీయమైన, జవాబుదారీ ఇంటర్నెట్‌ను నిర్వహించడానికి ఈ చర్యలు తప్పనిసరి అని పేర్కొంది. అంతేకాదు, ఈ ముసాయిదాపై స్టేక్‌హోల్డర్స్ తమ అభిప్రాయాన్ని 2025 నవంబర్ 6 లోపు తెలియజేయాలని సూచించింది. ఇందుకోసం trules.consultation@meity.gov.in ద్వారా ఈ-మెయిల్ చేయవచ్చని సూచించింది.

## డీప్‌ఫేక్‌ల అడ్డుకట్టకు యూట్యూబ్ కొత్త ఏఐ టూల్




కంటెంట్ క్రియేటర్లకు మరింత భద్రత అందించేందుకు యూట్యూబ్ సరికొత్త ఏఐ టూల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'లైక్‌నెస్ డిటెక్షన్ టూల్' పేరుతో ప్రారంభించిన ఈ టెక్నాలజీ ఆధారంగా ఏఐను ఉపయోగించి రూపొందించిన, ఎడిట్ చేసిన డీప్‌ఫేక్ వీడియోలను గుర్తించవచ్చు. ఏఐను వాడి కంటెంట్‌ను క్రియేట్ చేసే ధోరణి పెరిగిన నేపథ్యంలో యూజర్ల రక్షణ కోసం ఈ ఏఐ టూల్‌ను తీసుకొచ్చామని యూట్యూబ్ వెల్లడించింది. ఈ టూల్‌ను ఉపయోగించి కంటెంట్ క్రియేటర్లు వారి ఫేస్ లేదా వాయిస్‌ను అనుమతి లేకుండా వాడుకుని ఏఐ వీడియోలను ఎవరైనా రూపొందిస్తే, వాటిని తొలగించమని కోరే వీలు కల్పిస్తుంది. ఈ టూల్ యూట్యూబ్ స్టూడియోలోని కంటెంట్ డిటెక్షన్ విభాగంలో ఉంటుంది. దీన్ని ఉపయోగించడానికి కంటెంట్ క్రియేటర్లు తమ గుర్తింపును ధృవీకరించాలి. ఫోటో ఐడీతో పాటు సెల్ఫీ వీడియో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని యూట్యూబ్ తెలిపింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత లైక్‌నెస్ డిటెక్షన్ టూల్ కంటెంట్ క్రియేటర్ల ఫేస్, వాయిస్ వాడి చేసిన ఏఐ వీడియోలను గుర్తించి, అలర్ట్ చేస్తుంది. దానివల్ల వారు సదరు వీడియో, ఛానెల్ పేరు, వ్యూవ్స్ లాంటి వివరాలను చూసే ఆస్కారం లభిస్తుంది. ఆపై డీప్‌ఫేక్ వీడియోలను తొలగించడానికి రిక్వెస్ట్ చేసుకునే అవకాశం కల్పిస్తుంది. ప్రస్తుతం ఈ టూల్‌ను యూట్యూబ్ పార్ట్‌నర్ ప్రోగ్రామ్ మెంబర్స్‌కు మాత్రమే అందిస్తున్నామని, 2026 నాటికి కంటెంట్ క్రియేటర్లందరికీ అందుబాటులోకి తెస్తామని యూట్యూబ్ పేర్కొంది.

## నేడు బ్యాంకులు బంద్




దేశవ్యాప్తంగా పండుగ సీజన్ జోరుగా సాగుతోంది. అక్టోబర్ 22న గోవర్ధన పూజ పండుగ. ఈ పండుగల కారణంగా ఈ నెలలో వివిధ నగరాల్లో బ్యాంకులు చాలా రోజులు మూసి ఉన్నాయి. రాబోయే రోజుల్లో కూడా కొన్ని తేదీలలో బ్యాంకులు మూసి ఉంటాయి. రేపు భాయ్ దూజ్ రోజున బ్యాంకులు మూసి ఉంటాయో లేదో తెలుసుకుందాం. అక్టోబర్ 23న దేశవ్యాప్తంగా భాయ్ దూజ్ జరుపుకుంటారు. అందుకే మీరు రేపు బ్యాంకును సందర్శించాలని ప్లాన్ చేస్తుంటే మీ నగరంలో బ్యాంకు తెరిచి ఉంటుందో లేదో తనిఖీ చేయండి.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు సెలవుల జాబితాను ముందుగానే విడుదల చేస్తుంది. ఏయే రోజుల్లో.. ఏ రాష్ట్రాలు లేదా నగరాల్లో బ్యాంకులు మూసి ఉంటాయో సూచిస్తుంది. ఆర్‌బిఐ అక్టోబర్ 23న కొన్ని రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవు ప్రకటించింది. ఈ రాష్ట్రాల్లో గుజరాత్, సిక్కిం, మణిపూర్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ మరియు హిమాచల్ ప్రదేశ్ ఉన్నాయి. ఈ రాష్ట్రాలు మినహా, దేశవ్యాప్తంగా రేపు బ్యాంకులు తెరిచి ఉంటాయి.

## ఏఐ టాలెంట్‌కు గిరాకీ



ముంబయి: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్స్ అందిపుచ్చుకున్నవారికి దేశంలో అవకాశాలు పెరుగుతున్నాయి. ఏఐ నైపుణ్యాలు ఉన్నవారికి కంపెనీలు ప్రముఖంగా ద్వారాలు తెరుస్తున్నాయి. ఏఐ స్కిల్స్‌తో కూడిన ఉద్యోగ ప్రకటనలు ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 11.7 శాతానికి చేరాయని ప్రముఖ హైరింగ్ ప్లాట్‌ఫామ్ ఇండీడ్ తన నివేదికలో పేర్కొంది. గతేడాది సెప్టెంబర్‌లో 8.2 శాతంగా ఉండగా.. మూడు నెలల క్రితం 10.6 శాతంగా ఉందని తెలిపింది.సెప్టెంబర్‌లో వెలువడిన మొత్తం ఉద్యోగ ప్రకటనల్లో 11.7 శాతం ఉద్యోగాలకు జాబ్ డిస్క్రిప్షన్‌లో ఏఐని కంపెనీలు పేర్కొన్నాయని ఇండీడ్ పేర్కొంది. ఇతర మార్కెట్లతో పోలిస్తే ఇండియా ర్యాంక్ పై స్థాయిలో ఉందని తెలిపింది. అంటే భారత్‌లో కంపెనీలు ఏఐపై దృష్టి సారించాయని అర్థమవుతోందని ఇండీడ్ ఏపీఏసీ సీనియర్ ఎకనమిస్ట్ కల్లం పికరింగ్ వెల్లడించారు. భారత్‌తో పాటు సింగపూర్‌లోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంబంధిత జాబ్ పోస్టింగులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.టెక్ రంగంలో ఏఐ సంబంధిత పోస్టులు ఎక్కువగా ఉంటున్నాయని ఇండీడ్ పేర్కొంది. ఇతర రంగాలకూ ఇది విస్తరిస్తోందని తెలిపింది. డేటా అండ్ అనలిస్ట్‌కు సంబంధించి 39 శాతం ఉద్యోగ ప్రకటనల్లో ఏఐ స్కిల్స్‌ను ప్రస్తావిస్తున్నట్లు ఇండీడ్ వెల్లడించింది. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ (23 శాతం), ఇన్సూరెన్స్ (18శాతం), సైంటిఫిక్ రీసెర్చ్ (17 శాతం) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయని తెలిపిది. ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ (17 శాతం), మెకానికల్ ఇంజినీరింగ్ (11 శాతం), ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ (9.2శాతం) వంటి ఇతర ఇంజినీరింగ్ విభాగాల్లోనూ ఏఐ స్కిల్స్‌కు డిమాండ్ ఏర్పడిందని ఇండీడ్ వెల్లడించింది. అదే సమయంలో సెప్టెంబర్ నెలలో మొత్తం జాబ్ పోస్టింగ్‌లు 0.8 శాతం తగ్గుముఖం పట్టినట్లు తెలిపింది.

## మెటా ఏఐ విభాగంలో 600 ఉద్యోగాల కోత!




మెటా కంపెనీ ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. కంపెనీ తన సూపర్ ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ విభాగం నుంచి 600 మంది ఉద్యోగులను తొలగించబోతోందని అమెరికా మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఈ మేరకు ఉద్యోగులకు అంతర్గత మెమో జారీ చేసినట్లు తెలుస్తోంది. ఫేస్‌బుక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ యూనిట్, ప్రొడక్ట్ ఏఐ, ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యూనిట్లపై ఈ తొలగింపుల ప్రభావం పడనుంది.కొత్తగా ఏర్పాటు చేసి టీబీడీ ల్యాబ్‌కి మాత్రం ఈ ఉద్యోగ కోతల నుంచి మినహాయింపు ఇవ్వడంతో పాటు భవిష్యత్‌లో నియామకాలు కొనసాగుతాయి. ఈ ఉద్యోగాల కోత ద్వారా కంపెనీ కార్యకలాపాలు మరింత వేగవంతంగా మారతాయని కంపెనీ మెమోలో పేర్కొన్నట్లు అమెరికా మీడియా తెలిపింది. ఈ నిర్ణయం వల్ల సంస్థలోని అనవసర అధికారిక విధులు తగ్గి, ఉద్యోగులు తమకు కేటాయించిన పనిని మరింత శ్రద్ధతో, ప్రభావవంతంగా చేస్తారని మెటా చీఫ్ ఏఐ ఆఫీసర్ అలెగ్జాండర్ వాంగ్ తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగాల కోతకు గురైన వారికి కంపెనీలోని ఇతర విభాగాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు మెటా తెలిపింది.ఇటీవల మెటా సంస్థ నిర్వహించిన పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగా, ఏఐ విభాగంలో ఈ స్థాయి ఉద్యోగాల కోత పరిశ్రమ పరిశీలకులుకి ఆశ్చర్యం కలిగించింది. టెక్నాలజీ రంగంలో తీవ్రమైన పోటీ, ఆర్థిక ఒత్తిళ్లు మరియు నూతనమైన ఏఐ మోడల్స్ అభివృద్ధిలో తక్కువ సమయంలో ఎక్కువ ఫలితాలు సాధించాలని ఉద్దేశించిన వ్యూహాలే దీనికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. ఉద్యోగులను తొలగించడమే కాకుండా, సంస్థ పని విధానాలను మరింత స్వచ్ఛంగా చేసి, ప్రాజెక్టుల ప్రాధాన్యతను పునర్నిర్దేశించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వర్గాల సమాచారం.అయితే, కంపెనీ భవిష్యత్‌పై నమ్మకం కలిగిన పలువురు విశ్లేషకులు మెటా తాజా చర్యల్ని సుదీర్ఘ కాల వ్యూహంగా భావిస్తున్నారు. టీబీడీ ల్యాబ్‌కు మినహాయింపు ఇవ్వడం ద్వారా మెటా తనలో ఉన్న కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెడుతున్నట్లు స్పష్టమవుతోంది.

## భారత్-అమెరికా ట్రేడ్ డీల్..




గత కొద్ది రోజులుగా భారత్, అమెరికా మధ్య వాణిజ్యపరంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో భారత్‌పై అమెరికా టారిఫ్ వార్ ప్రారంభించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రతీకార సుంకాల పేరుతో 25 శాతం టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. ఇక, రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో ట్రంప్ మరో 25 శాతం సుంకాలు విధించారు (భారతదేశం సుంకాల తగ్గింపు).ప్రస్తుతం భారత్ ఎగుమతులపై అమెరికాలో 50 శాతం సుంకాలు అమల్లో ఉన్నాయి. అయితే భారత్-అమెరికా మధ్య ఎన్నో రోజులుగా జరుగుతున్న వాణిజ్య చర్యలు త్వరలోనే ఓ కొలిక్కి వచ్చే అవకాశముందని వార్తలు వస్తున్నాయి. ఈ ట్రేడ్ డీల్‌తో భారత్‌పై అమెరికా సుంకాలు భారీగా తగ్గబోతున్నాయట. ప్రస్తుతం ఉన్న 50 శాతం నుంచి 15-16 శాతానికి తగ్గే వీలుందట. నవంబర్ 30 తర్వాత ఈ కొత్త టారిఫ్‌లు అమల్లోకి రావచ్చొని కొందరు ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.ఈ ట్రేడ్ డీల్ కోసం రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించుకునే ప్రయత్నంలో భారత్ ఉన్నట్టు తెలుస్తోంది . ప్రస్తుతం భారత్ ముడిచమురు దిగుమతుల్లో రష్యా వాటా 34 శాతంగా ఉంది. రష్యా నుంచి చమురు దిగుమతులను క్రమంగా తగ్గించుకునేందుకు భారత్ అంగీకరించనుందని సమాచారం.అమెరికాలో భారీగా పండే మొక్కజొన్న దిగుమతులను చైనా ఇటీవల భారీగా తగ్గించుకుంది. దీంతో ప్రత్యామ్నాయ మార్కెట్ కోసం భారత్ వైపు అమెరికా చూస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా నుంచి మొక్కజొన్న, సోయామీల్‌ను భారత్‌లోకి అనుమతించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



పురాణం అనేది ఆత్మాశ్రయమైన, అంతర్ దృష్టి కలిగిన, సాంస్కృతికమైన మరియు విశ్వాసంలో పాతుకుపోయిన సత్యం.- దేవ్ దత్ పట్నాయక్



భయం తొలగిపోయినప్పుడు, స్వేచ్ఛ వికసిస్తుంది. -కల్కి కృష్ణమూర్తి



మనం గెలవకపోయినా, మనం కీర్తిని పొందుతాము.- బంకించంద్ర చటోపాధ్యాయ



# బిహార్ ఎన్నికల్లో మోదం- ఖేదం

● గుట్టుగా చక్కబెట్టుకున్న ఎన్డీఏ ● మహాకూటమిలో సీట్ల కుంపటి! ● 8 అసెంబ్లీ సీట్లలో మహా కూటమిలోని మిత్రపక్షాల ఢీ
● 243 స్థానాలకుగానూ 254 చోట్ల విపక్ష కూటమి పోటీ ● అంతర్గత ఘర్షణలతో గుల్లబారుతున్న విపక్ష కూటమి

పట్న : బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ సమీకరణాలపై ఫుల్ క్లారిటీ వచ్చేసింది. రాష్ట్రంలో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉండగా, 255 చోట్ల అభ్యర్థులను బరిలోకి దింపామని విపక్ష ఇండియా (మహా గఠ్బంధన్) కూటమి ప్రకటించింది. అంటే 12 సీట్లలో విపక్ష కూటమిలోని మిత్రపక్షాలు పరస్పరం ఢీకొంటున్నాయి. వీటిలో కేవలం 4 చోట్ల మిత్రపక్షాలు ఏకాభిప్రాయానికి వచ్చే అవకాశం ఉంది. ఈ నాలుగు సీట్లలో స్నేహపూర్వక పోటీకి సిద్ధమవుతున్నాయి. దీంతో 8 సీట్లలో మహాకూటమి పార్టీలు తలపడం ఖాయమైంది. ఈ క్రమంలో ఇండియా కూటమిలో ఏర్పడిన చీలికకు ఇదే దర్పనమని రాజకీయ పండితులు అంటున్నారు. పలుచోట్ల కాంగ్రెస్–సీపీఐ, కాంగ్రెస్–ఆర్జేడీ అభ్యర్థులు తలపడుతున్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్కు చెందిన జన్ సురాజ్ పార్టీ నుంచి బరిలోకి దిగిన నలుగురు అభ్యర్థులు చివరి నిమిషంలో నామినేషన్లు విత్డ్రా చేసుకున్నారు. దీంతో ఈ పరిణామం ఆయనకు పెద్ద తలనొప్పిగా మారింది. మరోవైపు అధికార ఎన్డీఏ కూటమి రెబల్స్తో నామినేషన్లు విత్డ్రా చేయించింది. తద్వారా కూటమిలోని పార్టీల నడుమ ఓట్ల చీలిక జరగకుండా జాగ్రత్తపడింది. ఈనేపథ్యంలో ఎన్నికల సంగ్రామంలో ఏ కూటమి ముందంజలో నిలిచింది? అసమ్మతిని ఎన్డీఏ కూటమి పెద్దలు ఎలా హ్యాండిల్ చేశారు? విపక్ష మహా గఠ్బంధన్లో పగుళ్లకు దారితీసిన కారణాలు ఏమిటి ? ఈ కథనంలో చూద్దాం.

**ఆర్జేడీఆధిపత్య ధోరణి :** మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్కు చెందిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) తన పంతాన్ని నెగ్గించుకుంది. విపక్ష ఇండియా కూటమిలో అత్యధిక అసెంబ్లీ సీట్లు ఈ పార్టీయే దక్కించుకుంది. 143 స్థానాల్లో ఆర్జేడీ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. రాష్ట్రంలోని మొత్తం 243 స్థానాల్లో ఇది దాదాపు 59 శాతానికి సమానం. ముస్లిం–యాదవ్ ఓటు బ్యాంకునే మరోసారి ఆర్జేడీ నమ్ముకుంది. తమకు ఆ రెండు వర్గాల మద్దతు లభించి తీరుతుందనే నమ్మకంతో మెజారిటీ సీట్లలో బరిలోకి దిగింది. అయితే ఆర్జేడీ ఆధిపత్య ధోరణి ఇండియా కూటమిలోని పలు మిత్రపక్షాలకు నచ్చడం లేదని సమాచారం. అందుకే పలుచోట్ల ఆర్జేడీ అభ్యర్థులకు వ్యతిరేకంగా కాంగ్రెస్, వామపక్షాలు, వికాస్శీల్ ఇన్సాన్ పార్టీ నేతలు నామినేషన్లు వేశారు. ఆయా చోట్ల ఆర్జేడీ ఓట్లను ఈ పార్టీలు చీలిస్తే, ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయ అవకాశాలు పెరిగిపోతాయి. ఆర్జేడీ మాత్రం ఈ అంశాన్ని తేలిగ్గా తీసుకుంటోంది. కొన్నిచోట్ల మిత్రపక్షాలతో తమకు స్నేహపూర్వక పోటీ ఉంటుందని చెప్పుకుంటోంది.

**ఇండియా కూటమికి ఇవీ సవాళ్లు :** విపక్ష ఇండియా కూటమిలో ఆర్జేడీకి 143 సీట్లు, కాంగ్రెస్కు 61, వామపక్షాలకు 33, వికాస్శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ)కి 15, ఇండియన్ ఇంక్లూజివ్ పార్టీ (ఐఐపీ)కి 3 సీట్లను కేటాయించారు. 143 ం 61 ం 33 ం 15 ం 3 = 255 సీట్లు అవుతాయి. కానీ రాష్ట్ర అసెంబ్లీలో మొత్తం 243 సీట్లే ఉన్నాయి. ఈ లెక్కన 12 సీట్లలో విపక్ష కూటమిలోని మిత్రపక్షాలు పరస్పరం ఢీకొంటున్నాయి. కొన్ని చోట్ల కాంగ్రెస్, సీపీఐ–ఎంఎల్ అభ్యర్థులు ఒకరిపై ఒకరు పోటీ పడుతున్నారు. మరికొన్ని చోట్ల కాంగ్రెస్, ఆర్జేడీ అభ్యర్థులు తలపడుతున్నారు. ఇంకొన్ని చోట్ల ఆర్జేడీ, వీఐపీ పార్టీ అభ్యర్థులు ఢీకొంటున్నారు. అయితే 4 స్థానాల్లో స్నేహపూర్వక పోటీకి ఇండియా కూటమి పార్టీల మధ్య సయోధ్య కుదిరిందని సమాచారం. నర్కటియాగంజ్, వైశాలి, రాజపకర్, రోసెరా, బచ్వారా, కహల్గావ్, బిహార్షరీఫ్, సికందరా అనే 8 స్థానాల్లో మాత్రం ఇండియా కూటమి పార్టీల అభ్యర్థులు పరస్పరం ఢీకొనబోతున్నారు.గయ, ముంగేర్, బంకా, సివాన్ వంటి జిల్లాల్లో ఆర్జేడీ అభ్యర్థులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు నామినేషన్లు వేశారు. ఈ స్థానాల్లో కాంగ్రెస్ క్యాడర్ బలంగా ఉంది. మిత్రపక్షం నుంచి పోటీ ఎదురుకావడం ఆర్జేడీకి నెగెటివ్గా మారొచ్చు.వామపక్ష పార్టీల్లో సీపీఐ–ఎంఎల్ 21, సీపీఐ 8, సీపీఎం 4 సీట్లు పొందాయి. గయ, సివాన్, అరా, జెహానాబాద్ వంటి స్థానాల్లో బలమైన వామపక్ష అభ్యర్థులు ఉన్నారు. వారికి కార్మికవర్గం మద్దతు ఉంది. అయితే ఈ జిల్లాల్లో ఆర్జేడీపై వ్యతిరేక భావన ఎక్కువగా ఉంది. ఈ అంశం వామపక్షాల ఓటుబ్యాంకుకు చిల్లుపెట్టే ముప్పు ఉంది.ఉత్తర బిహార్ ప్రాంతంలోని నిశాద్ సామాజిక వర్గంలో వికాస్శీల్ ఇన్సాన్ పార్టీ అధినేత ముఖేశ్ సాహ్నికి మంచి పేరుంది. అయితే ఆయన డిప్యూటీ సీఎం పదవిని డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశం ఆర్జేడీ, కాంగ్రెస్లకు ఏమాత్రం నచ్చడం లేదు. అయినప్పటికీ నిశాద్ సామాజిక వర్గం మద్దతు కోసం ఆయన్ను కూటమిలో నిలుపుకున్నాయి. పలు అసెంబ్లీ స్థానాల్లో ఆర్జేడీ అభ్యర్థులకు వ్యతిరేకంగా వికాస్శీల్ ఇన్సాన్ పార్టీ నేతలు నామినేషన్లు వేశారు. దీనివల్ల ఆయా చోట్ల ఆర్జేడీ విజయావకాశాలు తగ్గే ఛాన్స్ ఉంది.ఇండియా కూటమిలో ఉన్న ఝార?ండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కూడా ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించింది. ఝార?ండ్ సరిహద్దుల్లో ఉన్న కతిహార్, బంకా, జముయ్ వంటి అసెంబ్లీ స్థానాలను ఆ పార్టీ ఆశించిందని సీనియర్ జర్నలిస్ట్ రవి ఉపాధ్యాయ తెలిపారు.కానీ వాటిని ఇచ్చేందుకు ఆర్జేడీ తిరస్కరించిందన్నారు. దీంతో జేఎంఎం సైలెంట్ మోడ్లో ఉండిపోయిందని చెప్పారు. ఝార?ండ్ బార్డర్లోని అసెంబ్లీ స్థానాలపై జేఎంఎంకు బలమైన పట్టు ఉందని ఆయన పేర్కొన్నారు. ఆయా చోట్ల జేఎంఎం సహకారం లభించకుంటే, ఆర్జేడీ, ఇతర మిత్రపక్ష అభ్యర్థుల గెలుపు ఛాన్సు తగ్గిపోతాయన్నారు. జేఎంఎంకు సీట్లు ఏవీ ఇవ్వకపోడం అనేది, భవిష్యత్తులో ఝార?ండ్లో కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీల ఎదుట రాజకీయ సవాళ్లు నిలిచే ముప్పు ఉంటుందని రవి ఉపాధ్యాయ విశ్లేషించారు.

ప్రశాంత్ కిశోర్కు బిగ్ షాక్ : ప్రశాంత్ కిశోర్కు చెందిన జన్ సురాజ్ పార్టీ నుంచి నామినేషన్లు వేసిన నలుగురు అభ్యర్థులు చివరి నిమిషంలో అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. బ్రహ్మపూర్, దానాపూర్, తారాపూర్, మోతిహారిలకు చెందిన జన్ సురాజ్ అభ్యర్థులు తమ నామినేషన్లను విత్డ్రా చేసుకున్నారు. దీంతో రాజకీయ మాంత్రికుడు పీకేకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. దీనిపై ప్రశాంత్ కిశోర్ భగ్గుమన్నారు. బీజేపీ ఒత్తిడి వల్లే తమ అభ్యర్థులు నామినేషన్లను విత్డ్రా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. కేంద్రం హోంమంత్రి అమిత్ షా, బిహార్ బీజేపీ ఇంఛార్జి ధర్మేంద్ర ప్రధాన్లు తమ అభ్యర్థులను ఆకర్షిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి ఒత్తిడి వల్లే తమ అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారని ప్రశాంత్ కిషోర్ చెప్పారు.

**గుట్టుగా చక్కబెట్టుకున్న ఎన్డీఏ :** సీట్ల పంపకాల వ్యవహారాన్ని అధికార ఎన్డీఏ కూటమి గుట్టుగా చక్కబెట్టుకుంది. బీజేపీ 101 సీట్లు, జేడీయూ 101 సీట్లు, ఎల్జేపీ 29, హిందుస్తానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం) 6, ఉపేంద్ర కుశ్వాహకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చా 6 సీట్లను పొందాయి. సీట్ల పంపకాల అంశంపై ఎన్డీఏ కూటమి సంయుక్త విలేకరుల సమావేశాన్ని నిర్వహించలేదు. అయినప్పటికీ నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన వెంటనే ఈ కూటమిలోని ప్రతి పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించింది. అభివృద్ధి, స్థిరత్వం నినాదంతో సీఎం నీతీశ్ కుమార్ పట్నా నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.

**బీజేపీ రెబల్స్ను దారికి తెచ్చిన అమిత్ :** బీజేపీ తమ రెబల్స్ అభ్యర్థుల్లో చాలా మందిని తిరిగి పార్టీలోకి తీసుకురావడంలో సక్సెస్ అయింది. తద్వారా ఎన్నికల్లో ఓట్లు చీలకుండా జాగ్రత్తపడింది. నామినేషన్ల ఉపసంహరణ గడువుకు ముందే కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా చాలామంది రెబల్స్ అభ్యర్థులతో మాట్లాడారు. పట్నా సాహిబ్ నుంచి శిశిర్ కుమార్, భాగల్పూర్ నుంచి అశ్విని చౌబే కుమారుడు అర్జిత్ శశ్వత్, గోపాల్గంజ్ నుంచి కుసుమ్ దేవి కుమారుడు అనికేత్ కుమార్, బక్సర్ నుంచి అమరేంద్ర పాండే తమ నామినేషన్లను విత్డ్రా చేసుకున్నారు. దీనివల్ల ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓట్ల చీలిక ముప్పు తప్పింది. ఈవిధంగా సకాలంలో రెబల్స్ను దారికి తెచ్చుకోవడంలో విపక్ష ఇండియా కూటమి అగ్రనేతలు సక్సెస్ కాలేకపోయారు.

ఐక్యత కలిగిన ఎన్డీఏదే పైచేయి : 'ఇండియా కూటమిలోని అంతర్గత ఘర్షణలను బట్టి ఒక విషయం తేటతెల్లం అవుతోంది. ఎన్డీఏ కూటమిదే పైచేయిగా కనిపిస్తోంది. ఐక్యంగా ఉన్న ఎన్డీఏను, చీలిపోయిన ఇండియా కూటమి ఎదుర్కోవడం కష్టమే అనిపిస్తోంది. ఒక నెల క్రితం విపక్ష కూటమిలో ఉన్న దూకుడు ఇప్పుడు కనిపించడం లేదు. కనీసం విపక్ష పార్టీల అగ్రనేతల మధ్య కూడా ఏకాభిప్రాయం కనిపించడం లేదు. ఈ అంశం ఎన్నికల ఫలితాలపై తప్పక ప్రభావం చూపుతుంది. విపక్ష కూటమిలోని మిత్రపక్షాలు పరస్పరం ఢీకొంటూ, అంతర్గత ఘర్షణ ద్వారా తమ విజయ అవకాశాలను తగ్గించుకుంటున్నారు' అని సీనియర్ జర్నలిస్ట్ సునీల్ పాండే విశ్లేషించారు.

**ఆర్జేడీకి ఎక్కువ సీట్లున్నా, గెలుపు అవకాశాలు తక్కువే :** 'ఆర్జేడీ తన పంతాన్ని నెగ్గించుకుంది. ఎక్కువ సీట్లలో అది పోటీ చేస్తున్నప్పటికీ, దానికి మిత్రపక్షాల మద్దతు లేదు. ఈ ఒంటరితనం ఆర్జేడీకి మైనస్ పాయింటుగా మారొచ్చు. 143 సీట్లలో కాంగ్రెస్, వామపక్షాలు, వీఐపీ పార్టీల ఓట్లు ఆర్జేడీకి బదిలీ కావడం అంత ఈజీ విషయం కాదు. ప్రత్యేకించి సీమాంచల్ ప్రాంతంలో ఆర్జేడీ పట్టు సడలింది. అక్కడ దానికి రెబల్స్ బెడద ఎక్కువగా ఉంది. ఆర్జేడీ అభ్యర్థులకు ఎన్డీఏ అభ్యర్థుల కంటే మిత్రపక్ష అభ్యర్థుల నుంచే ఎక్కువ పోటీ ఎదురుకావచ్చు. ఫలితంగా ఆర్జేడీ పోటీచేసే స్థానాల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు అవకాశాలు పెరుగుతాయి' అని రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ రాజీవ్ రంజన్ సింగ్ పేర్కొన్నారు

**.మాలో ఐక్యత ఉంది– వాళ్లలో లేదు :** బీజేపీ'బీజేపీలో అస్సలు చీలిక అనేది ఉండదు. మా పార్టీ రెబల్స్ అందరినీ శాంతింపజేశాం. దీనివల్ల ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు అవకాశాలను పెంచాం. ఓట్ల చీలిక జరగకుండా జాగ్రత్తపడ్డాం. మా పార్టీ అగ్రనాయకత్వం ఈ దిశగా చేసిన ప్రయత్నాలు సక్సెస్ అయ్యాయి. మరోవైపు ఇండియా కూటమిలోని పార్టీల మధ్య ఐక్యత లేదు. గత 20 ఏళ్లు ఆర్జేడీని బిహార్ ప్రజలు విశ్వసించడం లేదు. వాళ్లకు విజన్ లేదు. అందుకే విపక్ష పార్టీలను ప్రజలు నమ్మరు' అని బీజేపీ అధికార ప్రతినిధి డానిశ్ ఇక్బాల్ పేర్కొన్నారు.

ఎన్డీఏ కూటమిలో కూడా ఐక్యత లేదు : ఆర్జేడీ'ఎన్డీఏ కూటమిలో కూడా ఐక్యత లేదు. ఉపేంద్ర కుశ్వాహకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చా పార్టీకి వ్యతిరేకంగా బీజేపీ, జేడీయూ నుంచి స్వతంత్ర అభ్యర్థులు ఆరు సీట్లలో పోటీ చేస్తున్నారు. వాళ్లలాగే మా కూటమిలో కూడా కొంత అసంతృప్తి ఉంది. ఇండియా కూటమిలోని మిత్రపక్షాల అభ్యర్థులు పరస్పరం పోటీపడుతున్న స్థానాలపై ప్రస్తుతం అంతర్గతంగా చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ వ్యవహారం కొలిక్కి వస్తుంది. ఓట్ల చీలిక జరగకుండా మేమూ జాగ్రత్తపడతాం. తేజస్వి యాదవ్ నాయకత్వంలో మార్పు తీసుకొస్తాం. ప్రతి ఇంటికీ ఉద్యోగాలు ఇస్తాం' అని ఆర్జేడీ అధికార ప్రతినిధి ఎజాజ్ అహ్మద్ తెలిపారు.

రెబల్స్కు ఏ పార్టీ కూడా లొంగదు : కాంగ్రెస్'ఎన్నికల వేళ రెబల్స్ బెడద అనేది సహజం. కొంతమంది నేతలు అసమ్మతితో రెబల్స్గా ఎన్నికల్లో పోటీ చేస్తారు. దీనివల్ల పార్టీ అభ్యర్థులకు కొంత నష్టం జరుగుతుంది. కానీ రెబల్స్ బ్లాక్మెయిలింగ్కు ఏ రాజకీయ పార్టీ కూడా లొంగదు. రెబల్స్కు ఏదైనా రాజకీయ పార్టీ లొంగిపోతే, వాళ్లు మొత్తం పార్టీనే అణచివేయడానికి ప్రయత్నిస్తారు' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అసితనాథ్ తివారీ చెప్పారు.

**ప్రజాతీర్పుపై తీవ్ర ఉత్కంఠ :** యువజన సంక్షేమం, ఉపాధి అవకాశాలు అంటూ ఆర్జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్ ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఇక ఇదే సమయంలో కుల సమీకరణాలపైనా ఇండియా కూటమి ఫోకస్ చేస్తోంది. మరోవైపు ఎన్డీఏ కూటమి అభివృద్ధి, సుస్థిరత అనే అంశాలను నినాదంగా మార్చుకుంది. రాష్ట్ర వికాసం కోసం మళ్లీ తమ కూటమినే గెలిపించాలని బీజేపీ, జేడీయూ, ఎల్జేపీ నేతలు ఓటర్లను కోరుతున్నారు. ఎలాంటి తీర్పు ఇస్తారు? అనేది తెలియాలంటే ఇంకొన్ని వారాలు వేచి చూడాల్సిందే

## మోదీ దాచిపెడితే- ట్రంప్ బయటపెడతారు

ప్రధాని ఫోన్కాల్పై కాంగ్రెస్ ఫైర్



న్యూఢిల్లీ : రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గిస్తామని భారత్ చెప్పినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. భారత్– రష్యా చమురు వాణిజ్యం విషయంపై ప్రధాని మోదీ దాచిపెడితే, ట్రంప్ బయటపెడుతున్నారని మోదీ సర్కార్పై విరుచుకుపడింది. దీపావళి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి ట్రంప్ ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ ఎక్స్ వేదికగా ట్రంప్నకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు దేశాధినేతల మధ్య వాణిజ్యంపై కూడా చర్చ జరిగినట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరి మధ్య రష్యా చమురు దిగుమతిపై చర్చ జరిగినట్లు ట్రంప్ చెప్పారు. అయితే ట్రంప్నకు శుభాకాంక్షలు చెబుతూ చేసిన ట్వీట్లో రష్యా ఆయిల్ దిగుమతుల ప్రస్తావన లేకపోవడంపై కాంగ్రెస్ విమర్శనాస్త్రాలు సంధించింది. ఇదివరకు కూడా భారత్–రష్యా చమురు వాణిజ్యంపై ట్రంప్ మాట్లాడారు. అయితే గతంలో ట్రంప్ తాను చేసిన కామెంట్స్కు భిన్నంగా ఇప్పుడు మాట్లాడటం గమనార్హం. రష్యా నుంచి మొత్తం చమురు దిగుమతులను ఆపేస్తున్నట్లు ట్రంప్ గతంలో చెప్పారు. ఇప్పుడు అందుకు భిన్నంగా దిగుమతులను తగ్గిస్తుందని వ్యాఖ్యానించారు.

ఆరు రోజుల్లో ఇది నాలుగోసా : రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేయదని వాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరావృతం చేశారని కాంగ్రెస్ పేర్కొంది. భారత ప్రభుత్వ విధానాలను ట్రంప్ బహిర్గతం ఆరు రోజుల్లో ఇది నాలుగోసారి అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్లో పోస్ట్ చేశారు.'ప్రధాని మోదీ చివరికి అధ్యక్షుడు ట్రంప్ తనకు ఫోన్ చేశారని, ఇద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకున్నారని అంగీకరించారు. కానీ మోదీ చెప్పింది కేవలం ట్రంప్ దీపావళి శుభాకాంక్షలు మాత్రమే ఇచ్చారన్న విషయం. కానీ మోదీ దాచిపెడితే, ట్రంప్ బయటపెడతారు. అమెరికా అధ్యక్షుడు చెప్పిన ప్రకారం, దీపావళి శుభాకాంక్షలతో పాటు రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు ఆపుతుందనే హామీ కూడా ప్రధాన మంత్రి ఇచ్చారని తెలిపారు. ఇది ఆరు రోజుల్లో నాలుగోసారి ట్రంప్ భారత ప్రభుత్వ విధానం గురించి చెప్పడం. అంతకుముందు కూడా మే 10న ఆపరేషన్ సిందూర్ నిలిపివేస్తున్నట్లు మోదీ కంటే ట్రంప్ ముందుగానే వెల్లడించారు' అని రమేశ్ వ్యాఖ్యానించారు.ఇక అమెరికా స్థానిక కాలమానప్రకారం, మంగళవారం వైట్హౌస్లో జరిగిన దీపావళి వేడుకల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్నారు. ఆ సందర్భంగా భారత ప్రజలకు, భారతీయ–అమెరికన్లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు దీపావళి ప్రారంభోపన్యాసంలో భారత ప్రధాని నరేంద్ర మోదీని ప్రశంసించారు. ఆయనను గొప్ప వ్యక్తిగా వర్ణించారు. తనకు మంచి స్నేహితుడని చెప్పారు. అదే సమయంలో వాణిజ్యం సంబంధాలు, ప్రాంతీయ శాంతిలో అమెరికా– భారత్ మధ్య సహకారం పెరుగుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య కొన్ని ముఖ్యమైన ఒప్పందాల కోసం పనిచేస్తున్నామని డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనబోదని పేర్కొన్నారు. అయితే, ఇప్పటి వరకు రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను నిలిపివేసిందంటూ ట్రంపే స్వయంగా ప్రకటించేశారు. అయితే, ట్రంప్ ప్రకటనలను భారత విదేశాంగశాఖ ఖండించింది. ట్రంప్, మోదీల మధ్య అలాంటి సంభాషణ జరగలేదని స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే ట్రంప్ మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలే చేయడం గమనార్హం.

# మహా గఠ్బంధన్లో వివాదాలు లేవు

● 24 గంటల్లో సర్దుకుంటాయ్ ● ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్

పట్న : మహా గఠ్బంధన్లో విభేదాలున్నాయని వచ్చిన ఊహాగానాలను ఆర్జేడీ నాయకుడు, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ తోసిపుచ్చారు. కూటమిలో ఎటువంటి వివాదాలు లేవని తెలిపారు. 24 గంటల్లో అన్ని సర్దుకుంటాయని చెప్పారు. అలాగే రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. వారికి శాశ్వత ప్రభుత్వ సిబ్బంది హోదా ఇస్తామని ప్రకటించారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో తేజస్వీ వ్యాఖ్యానించారు."విపక్ష కూటమి మహాఘట్ బంధన్లో ఎటువంటి వివాదాలు లేవు, రేపటికి అన్నింటికి సమాధానాలు లభిస్తాయి. కాంట్రాక్టు ఉద్యోగులు అన్ని ప్రభుత్వ సేవలను అందిస్తున్నా దోపిడీకి గురవుతున్నారు. వారికి కారణం తెలియజేయకుండానే ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేస్తాం. వారికి శాశ్వత ప్రభుత్వ సిబ్బంది హోదా ఇవ్వడానికి మేము కృషి చేస్తాం" అని బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ తెలిపారు.

**'బిహార్ ఆర్థిక న్యాయం అవసరం' :** బిహార్కు ఆర్థిక న్యాయం అవసరమని ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే నామినేషన్ దాఖలు ప్రక్రియ పూర్తయిందని, అక్టోబర్ 24 నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. "నామినేషన్ దాఖలు ప్రక్రియ ముగిసింది. ఇప్పుడు ప్రచారం కోసం సమయం ఆసన్నమైంది. ఈసారి, బిహార్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో బిహార్ ప్రజలు విసుగు చెందారు. ఈ డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో అవినీతి, నేరాలు పెరిగాయి. నిరుద్యోగం, వలసలతో బిహారీలు విసుగు చెందారు. ప్రస్తుత ప్రభుత్వం మేం గతంలో ఇచ్చిన హామీలను కాపీ చేస్తోంది" అని తేజస్వీ విరుచుకుపడ్డారు.

**'అది వారికి ఇచ్చిన లంచం' :** ఎన్నికల దగ్గర పడుతున్న సమయంలో ఎన్డీఏ ప్రభుత్వం 'మై బహిన్ మాన్ యోజన' కింద రాష్ట్రంలోని మహిళలకు రూ. 10,000 పంపిణీ చేయడాన్ని తేజస్వీ తప్పుపట్టారు. ఈ నగదును లంచంగా అభివర్ణించారు. "బిహార్లో మహాగఠ్ బంధన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమ్యూనిటీ సమీకరణకర్తలుగా పనిచేసే జీవికా దీదీలకు ప్రభుత్వ ఉద్యోగుల హోదా ఇస్తాం. వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తాం. జీవికా దీదీల జీతాన్ని నెలకు రూ. 30,000కు పెంచుతాం. జీవికా దీదీలకు రూ.2వేలు అదనపు అలవెన్స్ను అందిస్తాం. రూ.5లక్షలకు జీవిత బీమా కల్పిస్తాం. ఎన్డీఏ ప్రభుత్వం జీవికా దీదీలకు అన్యాయం చేసింది. జీవికా దీదీలు తీసుకున్న రుణాలపై త్వరలో అధికారంలోకి రాబోయే మహాగఠ్ బంధన్ ప్రభుత్వం వడ్డీని మాఫీ చేస్తుంది. రాబోయే రెండేళ్లు వడ్డీ లేని రుణాలను వారికి ఇస్తాం. జీవికా దీదీలు లేకుండా గ్రామాలు లేదా నగరాల్లో ఏ పని కూడా సాధ్యం కాదు. అయితే, వారి కోసం ఎన్డీఏ సర్కార్ ఏమీ చేయలేదు. అందుకే వారికి మహాఘట్ బంధన్ సర్కార్ సాయం చేస్తుంది. ప్రజల బాధలు అవినీతి అధికారులను, ప్రభుత్వాన్ని ప్రభావితం చేయవు" అని తేజస్వీ యాదవ్ వ్యాఖ్యానించారు.

**'ఎన్డీఏ పాలనతో బిహారీ ప్రజలు విసిగిపోతున్నారు' :** బిహార్ ప్రజలు అవినీతి, వలసలు, నిరుద్యోగం, పెరుగుతున్న నేరాలు వంటి సమస్యలపై నీతీశ్ కుమార్ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్పై విసిగిపోయారని తేజస్వీ యాదవ్ ఆరోపించారు. అందుకే బిహారీలు తమ మనసులో మార్పును కోరుకుంటున్నారన్నారు. బిహార్ లో మహాగఠ్ బంధన్ ప్రభుత్వం ఏర్పడితే రాష్ట్రంలోని మహిళల కోసం భేటీ , మా పథకాలను ప్రవేశపెడతామని



ప్రకటించారు. " ఫర్ బెనిఫిట్, ఫర్ ఎడ్యుకేషన్, ఫర్ ట్రైనింగ్, ఫర్ ఇన్కమ్. దీని అర్థం బిహార్ కుమార్తెలు పుట్టిన క్షణం నుంచి వారు ఆదాయం పొందే వరకు వారి కోసం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. మా () యోజనను కూడా అమలు చేస్తాం. ఫర్ మకాన్, ఫర్ ఆన్ (ఆహారం), ఫర్ ఆమ్దానీ (ఆదాయం). బిహార్కు ఇప్పుడు కావాల్సింది ఆర్థిక న్యాయం" అని తేజస్వీ పేర్కొన్నారు.

రెండు దఫాల్లో ఎన్నికల పోలింగ్ : కాగా, బిహార్లో రెండు దఫాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. నవంబరు 6న మొదటి దశ, నవంబరు 11న రెండో దశ పోలింగ్ జరగనుంది. అదే నెల 14న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఇప్పటికే ఎన్డీఏ, మహాగఠ్ బంధన్ కు చెందిన అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. పలువురు అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తున్నారు. మరోవైపు, మిత్రపక్షాల మధ్య సీట్ల పంపకాల సమస్యలను పరిష్కరించడానికి తేజస్వీ యాదవ్ బుధవారం పట్నాలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అశోక్ గహ్లోత్ తో భేటీ కానున్నారు.

## మహిళల కోసం 'జీహాదీ కోర్స్'

● బరితెగించిన జైషే-మొహమ్మద్ ఉగ్రసంస్థ
● మహిళలను ఉగ్రవాదులుగా మార్చేందుకు ఆన్లైన్ కోర్సు
● ఫీజు 500 పాకిస్థానీ రూపాయలుగా నిర్ణయం



కరాచీ : పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రసంస్థ జైషే–మొహమ్మద్ బరితెగించింది. మహిళను ఉగ్రవాదులుగా మార్చేందుకు కొత్తగా ఆన్లైన్ కోర్సును ప్రారంభించింది. దీనికి "తుఫత్–అల్–ముమినాత్" (జీహాదీ కోర్సు) అని పేరుపెట్టింది. అంతేకాదు దీని ఫీజును 500 పాకిస్థానీ రూపాయలుగా నిర్ణయించింది.గత నెలలో బహవల్పూర్లోని మర్కజ్ ఉస్మాన్ ఓ అలీలో జరిగిన బహిరంగ సమావేశంలో కనిపించిన మసూద్ అజార్ ఇప్పుడు తన ఉగ్రవాద కార్యకలాపాల కోసం విరాళాలు సేకరించే పనిని ముమ్మరం చేశాడని సమాచారం. అందులో భాగంగానే మహిళల కోసం ఒక ఆన్లైన్ కోర్సు పెట్టి ఒక్కొక్కరి నుంచి 500 పాకిస్థానీ రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.పాకిస్థాన్ పెంచిపోషిస్తున్న 'జైషే–మొహమ్మద్' గ్రూప్ను ఐక్యరాజ్యసమితి ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. అయితే ఈ ఉగ్రవాద సంస్థ ఇప్పుడు "జమాత్ – ఉల్–ముమినాత్" అనే మహిళా విభాగాన్ని సృష్టించింది. అంతేకాదు తమ టెర్రర్ గ్రూప్నకు అవసరమైన నిధులు సేకరించేందుకు, నియామకాలు చేపట్టేందుకు, ముఖ్యంగా మహిళలను తమలో చేర్చుకుని ఉగ్ర శిక్షణ ఇచ్చేందుకు "తుఫత్–అల్–ముమినాత్" అనే ఆన్లైన్ శిక్షణా కోర్సును ప్రారంభించింది.

**కరుడుగట్టిన ఉగ్రవాదులే టీచర్స్!**

ఈ కోర్సులో చేరిన వారికి జైషే–మొహమ్మద్ గ్రూప్నకు చెందిన కరుడుగట్టిన ఉగ్రవాదాలు శిక్షణ ఇస్తారు. అందులో ప్రధానమైనవాళ్లు జైషే–మొహమ్మద్ వ్యవస్థాపకుడైన మసూద్ అజార్కు చెందిన బంధువులు, కమాండర్లు. వీరు మహిళలకు జీహాద్ గురించి, ఇస్లాం గురించి బోధిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న తరువాత ఆన్లైన్లో నియామకాలు చేపడతారు. ఈ నవంబర్ 8 నుంచే ఈ కోర్సు ప్రారంభం కానుంది అని సమాచారం.

**కోర్సు ఎలా ఉంటుందంటే?**

ప్రతిరోజూ 40 నిమిషాల పాటు ఉగ్ర పాఠాలు బోధిస్తారు. వీటిని అజార్ సిస్టర్స్ అయిన సదియా అజార్, సమైరా అజార్ బోధిస్తారు. వారు మహిళలు కచ్చితంగా 'జమాత్–ఉల్–ముమినాత్'లో చేరాలని ప్రోత్సహిస్తారని తెలుస్తోంది. మసూద్ అజార్ చెల్లెలు సదియా అజార్కు ఈ విషయంలో పూర్తి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం

**ఇండియా అటాక్ తర్వాత :** పాక్కు చెందిన ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్లోని పహల్గాంలోకి చొరబడి హిందూ పర్యాటకులే లక్ష్యంగా మారణహోమం సృష్టించిన విషయం తెలిసిందే. దీనితో భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్, పీవోకేల్లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాయి. ముఖ్యంగా పాకిస్థాన్ బహవల్పూర్లోని జైషే–మొహమ్మద్ ప్రధాన కార్యాలయాన్ని వైమానిక దళం సర్వనాశనం చేసింది. ఈ దాడిలో మసూద్ అజార్ కుటుంబ సభ్యులు చాలా మంది మరణించారు. అందులో సాదియా భర్త యూసుఫ్ అజార్ కూడా ఉన్నాడు. పహల్గాం దాడిలో పాల్గొన్న ఉమర్ ఫరూఖ్ భార్య అఫ్రీర్ ఫరూఖ్ కూడా ఇప్పుడు ఉగ్రకార్యకలాపాల్లో చురుకుగా ఉంటోంది.

**బయటపడుతున్న పాక్ కపటబుద్ధి!**

పాకిస్థాన్లో మహిళలు ఒంటరిగా వెళ్లడం మంచిది కాదని భావిస్తుంటారు. అలాంటిది ఓ ఉగ్రసంస్థ నేరుగా మహిళల కోసం ఆన్లైన్ జిహాదీ కోర్సు పెడితే, ఏమీ తెలియనట్లు కళ్లు మూసుకుని ఉంది. ఇది పాక్ వక్రబుద్ధిని బయటపెడుతోంది.మసూద్ అజార్ అక్టోబర్ 8న జమాత్ అనే మహిళా విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు .

## 50 ఏళ్ల తర్వాత స్వగ్రామానికి నాగా ఉద్యమ నేత

మయివాకు ఘన స్వాగతం పలికిన ప్రజలు



ఉఖ్రుల్ : నాగా ఉద్యమ నేత, నేషనలిస్ట్ సోషలిస్టు కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ (ఐఎం) అధినేత థయింగ్లాంగ్ ముయివా దాదాపు 50 ఏళ్ల తర్వాత స్వగ్రామానికి వచ్చారు. బుధవారం మణిపూర్లోని ఉఖ్రుల్ జిల్లాలోని స్వగ్రామమైన సోమ్దాల్కు చేరుకున్నారు. 91 ఏళ్ల ముయివాకు అక్కడి ప్రజలు ఘన స్వాగతం పలికారు. వేలాది మంది నాగా మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో రాగా, ఈటెలతో పాటు తలపాగాలు ధరించిన పురుషులు ముయివాను స్వాగతించారు. అనేక మంది పార్టీ కార్యకర్తలు సైతం హాజరయ్యారు. ఇది నాగాలందరికీ ఒక భావోద్వేగ క్షణమని, తామంతా ఆయన కథ వింటూనే పెరిగామని వారు తెలిపారు.

**వారం రోజుల పాటు స్వగ్రామంలోనే ముయివా :** ఆయన పర్యటన నేపథ్యంలో జిల్లాలో అనేక హోర్డింగ్లు, వాల్ పెయింటింగ్లు ఏర్పాటు చేశారు. జిల్లా ప్రధాన కార్యాలయంతో పాటు వివిధ ప్రాంతాల్లో రాత్రి శుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా కేంద్రం నుంచి 25 కి.మీ దూరంలో ఉన్న తన స్వస్థలమైన సోమ్దాల్ గ్రామానికి ముయివా వెళ్తారని మరొక అధికారి వెల్లడించారు. ఆయన రాక కోసం సోమ్దాల్ వద్ద హెలిప్యాడ్ నిర్మించినట్లు ఆయన వివరించారు. తన స్వగ్రామంలో ఒక వారం బస చేసిన తర్వాత అక్టోబర్ 29న మణిపూర్లోని సేనాపతి జిల్లా మీదుగా దిమాపూర్కు వెళతారని పేర్కొన్నారు.

**నేషనలిస్ట్ సోషలిస్టు కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ ఆరంభం :** 1960లో జరిగిన నాగా ఉద్యమంలో థయింగ్లాంగ్ ముయివా కీలక పాత్ర పోషించారు. కాగా, 1975 నవంబరులో నాగా నేషనల్ కౌన్సిల్ ఎన్ఎన్సీలోని ఒక వర్గంతో ప్రభుత్వం షిల్లాంగ్ శాంతి ఒప్పందం కుదుర్చుకుంది. దీనికింద నాగా నేషనల్ కౌన్సిల్ (ఎన్ఎన్సీ), నాగా ఫెడరల్ గవర్నమెంట్ (ఎన్ఎఫ్జీ) సంబంధిత వర్గం వారు ఆయుధాలు విడిచిపెట్టేందుకు అంగీకరించారు. కానీ, థయింగ్లాంగ్ ముయివా నేతృత్వంలోని 140 మంది సభ్యులు మాత్రం ఈ ఒప్పందాన్ని తిరస్కరించారు. అనంతరం వారితో విభేధించి 1980లో వీరంతా కలిసి నేషనలిస్ట్ సోషలిస్టు కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ .



## అఫ్గాన్ ద్వారా మాపై భారత్ పరోక్ష యుద్ధం'

● పాక్ అర్థం లేని ఆరోపణలు ● ఘాటుగా కౌంటర్ ఇచ్చిన తాలిబన్లు
● అఫ్గానిస్థాన్ రక్షణమంత్రి మహ్మద్ యాకూబ్ విమర్శలు

అఫ్గన్ : అఫ్గానిస్థాన్ ద్వారా భారత్ తమపై పరోక్ష యుద్ధం చేస్తోందని పాకిస్థాన్ చేసిన ఆరోపణలపై తాలిబన్లు ఘాటుగా స్పందించారు. పాక్ ఆరోపణలు నిరాధారమైనవని, వాటిలో లాజిక్ లేదని అఫ్గానిస్థాన్ రక్షణమంత్రి మహ్మద్ యాకూబ్ అన్నారు. ఈ తరహా ఆరోపణలు ఆమోదయోగ్యం కానే కావని ఆయన తేల్చి చెప్పారు.దేశ ప్రయోజనాల కోణంలో మాత్రమే భారత్తో సంబంధాలను బలోపేతం చేసుకుంటున్నామని మహ్మద్ యాకూబ్ స్పష్టం చేశారు. ఇటీవలే పాకిస్థాన్, అఫ్గనిస్థాన్ మధ్య జరిగిన సైనిక ఘర్షణల్లో భారత్ పాత్ర లేనే లేదన్నారు. తాజాగా ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈవివరాలను ఆయన వెల్లడించారు. తాలిబన్ సంస్థ వ్యవస్థాపకుడు దివంగత ముల్లా ఉమర్ కుమారుడే ఈ మహ్మద్ యాకూబ్.

**భారత్తో బంధాన్ని బలోపేతం చేసుకుంటాం :** "మా దేశ భూభాగాన్ని ఏ దేశానికీ వ్యతిరేకంగా ఎన్నడూ వినియోగించనివ్వం. ఇదే మా విధానం. మాదొక స్వతంత్ర దేశం. అందుకే పొరుగుదేశమైన భారత్తో సత్సంబంధాలను నెరుపుతున్నాం. మా దేశ ప్రయోజనాల కోసం భారత్తో బంధాన్ని బలోపేతం చేసుకుంటాం. ఇక ఇదే సమయంలో పాక్తోనూ మా సంబంధాలను కాపాడుకుంటాం. మంచి ఇరుగుపొరుగు దేశాలుగా ఉండేందుకు ప్రయత్నిస్తాం. ప్రపంచ దేశాలతో బంధాలను పెంచుకోవడమే మా లక్ష్యం. ఉద్రిక్తతలను పెంచాలని మేం కోరుకోవడం లేదు. మాపై పాక్ చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలే" అని అఫ్గానిస్థాన్ రక్షణమంత్రి మహ్మద్ యాకూబ్ పేర్కొన్నారు.

**ఖతర్, తుర్కియే చొరవ చూపాలి!**

"పాకిస్థాన్తో గతంలో మా దేశానికి శాంతి ఒప్పందం కుదిరింది. దాన్ని అమలు చేయించే, పర్యవేక్షించే దిశగా ఖతర్, తుర్కియే దేశాలు చొరవ చూపాలి. ఈవిషయంలో మాకు చేదోడును అందించాలి. ఏ దేశమూ మరో దేశపు భూభాగంలోకి చొరబడకుండా ఉంటేనే శాంతి ఒప్పందం అమలు సాధ్యమవుతుంది. భౌగోళిక సరిహద్దుల అంశంలో ఇరుదేశాలు పరస్పర గౌరవాన్ని ప్రదర్శించాలి. నిబద్ధతతో ముందుకు సాగాలి" అని అఫ్గానిస్థాన్ రక్షణమంత్రి మహ్మద్ యాకూబ్ తెలిపారు. ఒకప్పుడు పాకిస్థాన్కు అత్యంత సన్నిహితుడు అనే ముద్ర మహ్మద్ యాకూబ్పై ఉండేది. కానీ ఇప్పుడు ఆయన వైఖరి అందుకు పూర్తి భిన్నంగా ఉండటం గమనార్హం.

**పాక్ ఆరోపణలు– భారత్ కౌంటర్ :** అఫ్గానిస్థాన్తో తమ సంబంధాలు దెబ్బతినడానికి భారతే కారణమని ఇటీవలే పాకిస్థాన్ రక్షణమంత్రి ఖాజా ఆసిఫ్ ఆరోపించారు. తాలిబన్ ప్రభుత్వం భారతదేశపు ఒడిలో కూర్చొని పాక్పై పరోక్ష యుద్ధం చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కామెంట్స్కు వెంటనే భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కౌంటర్ ఇచ్చారు. అంతర్గత భద్రతా వైఫల్యాలనూ పొరుగుదేశాలపైకి నెట్టే సంప్రదాయాన్ని పాక్ ఇంకా కంటిన్యూ చేస్తోందని ఆయన విమర్శించారు. ఉగ్రవాదులకు స్పాన్సర్ చేసేది, ఆశ్రయం ఇచ్చేది పాకేనని ఆరోపించారు. అఫ్గనిస్థాన్ సార్వభౌమత్వాన్ని సవాల్ చేసేందుకు పాక్ యత్నిస్తోందని రణధీర్ జైస్వాల్ మండిపడ్డారు. అఫ్గనిస్థాన్ సార్వభౌమత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని, సమగ్రతను భారత్ గౌరవిస్తుందన్నారు. కాగా, ఇప్పటివరకు అఫ్గనిస్థాన్లోని తాలిబన్ ప్రభుత్వాన్ని భారత్ అధికారికంగా గుర్తించలేదు. అయితే ఇరుదేశాల సంబంధాల బలోపేతం దిశగా మాత్రం చర్యలు చేపట్టింది.

**పాక్లో టీటీపీ దడ :** తెహ్రీక్ ఏ తాలిబాన్ (టీటీపీ ) ఉగ్రవాద సంస్థ పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో పెద్దఎత్తున ఉగ్రదాడులకు పాల్పడుతోంది. ఈ నేపథ్యంలో టీటీపీ ఉగ్రవాద స్థావరాలన్నీ అఫ్గనిస్థాన్లోనే ఉన్నాయని పాక్ ఆరోపించింది. ఇటీవలే కాబూల్ నగరంపై పాక్ సైన్యం వైమానిక దాడులు చేసింది. ఈ ఘటన తర్వాత అక్టోబరు 11న పాక్, అఫ్గన్ బార్డర్లో సైనిక ఘర్షణ పెరిగింది. తాలిబన్ల దాడుల్లో పెద్దసంఖ్యలో పాక్ సైనికులు చనిపోయారు. సరిగ్గా ఇదే సమయంలో అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తఖీ భారత్లో పర్యటించడం గమనార్హం.



"ప్రపంచంలో మీరు చూడాలనుకునే మార్పుగా ఉండండి."
- మహాత్మా గాంధీ



"ప్రతి కష్టం మధ్యలో అవకాశం ఉంటుంది."
- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్



"విజయం అంతిమం కాదు, వైఫల్యం ప్రాణాంతకం కాదు: కొనసాగించాలనే ధైర్యమే ముఖ్యం."
- విన్స్టన్ చర్చిల్



# 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా తెలంగాణ

● లైఫ్ సైన్సెస్ రంగంలో మరో ముందడుగు ● నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చే వ్యూహాత్మక భాగస్వామ్యం
● ఆస్ట్రేలియా యూనివర్సిటీ 'ఆర్ఎంఐటీ'తో రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌వోఐ ● ఇన్నోవేషన్, ఆర్అండ్ డీ, నైపుణ్యాభివృద్ధిలో ద్వైపాక్షిక సహకారం ● రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్' గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లోని ప్రముఖ యూనివర్సిటీ 'ఆర్ఎంఐటీ'తో రాష్ట్ర ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ వోఐ)ను కుదుర్చుకుందని చెప్పారు. లైఫ్ సైన్సెస్ రంగంలో ఇన్నోవేషన్, పరిశోధన, అభివృద్ధి, ఉన్నత విద్య, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రెడీ టూ వర్క్ ఫోర్స్ తయారీ తదితర అంశాల్లో ద్వైపాక్షిక సహకారానికి ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. రేపటి జీనోమ్ వ్యాలీకి ఇది ఒక బ్లూ ప్రింట్ గా మార్గ నిర్దేశం చేస్తుందన్నారు. ఆసియాలోనే అగ్రగామిగా ఎదిగిన తెలంగాణ "లైఫ్ సైన్సెస్" ఆర్థిక వ్యవస్థను 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 80 బిలియన్ డాలర్ల విలువ చేసే 2వేలకు పైగా జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ ఫార్మా, బయోటెక్ కంపెనీలు ఇక్కడ ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే ఔషధాల్లో మన వాటా 40 శాతంగా ఉందన్నారు. ప్రపంచానికి అవసరమైన వ్యాక్సిన్లలో మూడింట ఒక వంతును మనమే అందిస్తున్నామన్నారు. 'ఎలీ లిల్లీ' లాంటి దిగ్గజ ఫార్మా సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా తెలంగాణ యువతను లైఫ్ సైన్సెస్ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులుగా తీర్చే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు. త్వరలోనే ప్రత్యేకంగా తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తాజా ఒప్పందంలో భాగంగా ఉమ్మడి పీహెచ్‌డీ, స్టూడెంట్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం అందుబాటులోకి వస్తుందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేలా ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులను చేపడతామన్నారు. పరిశోధక విద్యార్థులు బిట్స్ హైదరాబాద్, ఆర్ఎంఐటీ యూనివర్సిటీలలో నిపుణుల మార్గ నిర్దేశంలో రీసెర్చ్ చేసే అవకాశం లభిస్తుందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉమ్మడి అకడమిక్ కరిక్యులంను రూపొందించి విద్యార్థులను రేపటి అవసరాలకు అనుగుణంగా స్కిల్డ్ వర్క్ ఫోర్స్ గా తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈఓ శక్తి నాగప్పన్, ఆర్ఎంఐటీ యూనివర్సిటీ డిప్యూటీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కేథరీన్ ఇట్సియోపౌలోస్ లెటర్ ఆఫ్ ఇంటెంట్ పై సంతకాలు చేశారు. తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పనిచేసే అవకాశం దక్కడం సంతోషంగా ఉందని ప్రొఫెసర్ కేథరీన్ ఇట్సియోపౌలోస్ అన్నారు. ఈ ఒప్పంద ద్వారా లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ గా మారుతుందన్నారు.

# కుమ్రం భీం జీవితం స్ఫూర్తిదాయకం

**పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఆదివాసుల అస్తిత్వాన్ని, అటవీ సంపదను, నమ్ముకున్న భూమిని, నీటిని తమదే అని జల్ జంగల్ జమీన్ నినాదంతో అడవిబిడ్డల హక్కుల కోసం పోరాడి అమరుడైన కుమ్రం భీం జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమైనదని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పోరాట యోధుని జయంతి సందర్భంగా మంత్రి నివాళులు అర్పించారు. ఆదివాసీలపై అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడి, అడవి బిడ్డల ఆత్మస్థైర్యాన్ని కుమ్రం భీం శిఖర స్థాయికి చేర్చారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కుమ్రం భీం జీవితమంతా పోరాటాలతోనే గడిచిందని చెప్పారు. తన ప్రజల కోసం, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం, బానిసత్వపు సంకెళ్లు తెంచడానికి జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని, పోరాటయోధుడని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన చేసిన పోరాట స్ఫూర్తితోనే గిరిజనులకు ప్రత్యేక హక్కులు, చట్టాలు వచ్చాయన్నారు. కుమ్రం భీం ఆశయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తున్నదని తెలిపారు.

# ఆర్ఎస్ఎస్‌ను అడ్డుకోవడం ఎవరి తరం కాదు

● హేళన చేసిన వాళ్లే భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుటున్నారు
● లక్షలాది మంది అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది ● ప్రపంచానికి భాగ్యలక్ష్మీ అమ్మవారి శక్తి చాటిచెప్పే అవకాశం రావడం నా అదృష్టం ● బీజేపీ అధికారంలోకి రాగానే గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం : బండి సంజయ్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : పాతబస్తీలో భాగ్యలక్ష్మీ ఆలయం ఎక్కడుంది? అంటూ హేళన చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఈరోజు కళ్లు తెరిచి అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. భాగ్యలక్ష్మీ అమ్మవారి శక్తిని ప్రపంచానికి చాటిచెప్పే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అమ్మవారిని దర్శించుకున్నాకే ప్రజాసంగ్రామ యాత్ర విజయవంతమైందని, జీహెచ్ఎంసీ, హుజూరాబాద్, దుబ్బాక ఎన్నికల్లో బీజేపీ గెలిచిందన్నారు. పార్లమెంట్ లో 8 స్థానాలు గెలుచుకోవడమే కాకుండా విజయ పరంపరను కొనసాగిస్తున్నామని చెప్పారు. లక్షలాది మంది అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని స్వర్ణ దేవాలయంగా మారుస్తామని పునరుద్ఘాటించారు. కర్నాటకలో ఆరెస్సెస్ పథ సంచలన్ లో పాల్గొన్నందుకు ఓ ప్రభుత్వ అధికారిని సస్పెండ్ చేయడంపై తీవ్రంగా స్పందించారు. కర్నాటకలో బీజేపీ అధికారంలోకి రాగానే సదరు అధికారికి రెండున్నరేళ్ల కాలానికి జీతభత్యాలు ఇవ్వడంతోపాటు ప్రమోషన్ ఇస్తామని స్పష్టం చేశారు. దీపావళి పర్వదినం ఈరోజు సాయంత్రం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రకాశ్ రెడ్డి, జె.సంగప్ప, ఉమా మహేందర్ తదితరులతో కలిసి పాతబస్తీ భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు సంజయ్ కు ఘన స్వాగతం పలికి ప్రత్యేక ఆశీర్వచనం అందించారు.

అనంతరం ఆయా నేతలతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ. 'దీపావళి పర్వదినం సందర్భంగా పాతబస్తీ భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది. హిందూ బంధువులందరికీ దీపావళి శుభాకాంక్షలు. అమ్మవారి శక్తి అందరికీ తెలుసు. అమ్మవారి కరుణాకటాక్షం కోసమే అందరం ఇక్కడికి వస్తున్నం. అమ్మవారివల్లే తెలంగాణలో అందరం సుభిక్షంగా ఉన్నాం. నాకైతే కరీంనగర్ లో మహాశక్తి అమ్మవారు, భాగ్యనగర్ భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆశీర్వాదం, కరుణాకటాక్షంతోనే ధర్మం కోసం, దేశం కోసం పనిచేస్తున్నా. భాగ్యలక్ష్మీ అమ్మవారిని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పే అవకాశం, అదృష్టం నాకు దక్కడం చాలా ఆనందంగా ఉంది. నేను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భాగ్యలక్ష్మీ అమ్మవారి పాదాల సాక్షిగా ప్రజా సంగ్రామ యాత్రను ప్రారంభించినం. ఎండకు, వానకు, చలిని తట్టుకుని ఎన్ని ఆటంకాలు, అడ్డంకులు వచ్చినా పాదయాత్రను విజయవంతం చేసినం. 1600 కి.మీలు పాదయాత్ర చేసిన. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అమ్మవారిని దర్శించుకుని ఎన్నికల్లో పోటీ చేసి హిందూ సంఘటిత శక్తిని చాటినం. అమ్మవారి దయవల్లే 4 నుండి 48 స్థానాలు గెలిచినం. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లోనే అమ్మవారి దర్శనం తరువాతే గెలిచినం. మునుగోడు ఎన్నికల్లో నాటి ప్రభుత్వం అనేక అరాచకాలు గెలిచినా పోరాడి గెలుపు అంచులదాకా వచ్చినం. అమ్మవారి దయతోనే బీజేపీ 8 ఎంపీ స్థానాల్లో గెలిచినం. విజయపరంపరను కొనసాగిస్తున్నాం.

గతంలో భాగ్యలక్ష్మీ అమ్మవారు లేనే లేదు. బండి సంజయ్ కొత్త కొట్లాట పెడుతున్నారని కాంగ్రెస్, బీఆర్ఎసోళ్లు హేళన చేశారు. ఆనాడు హేళన చేసిన వాళ్లే ఇయాళ అమ్మవారి శక్తి తెలుసుకుని దర్శించుకుంటున్నారు. ఆలస్యంగానైనా అమ్మవారి శక్తిని తెలుసుకున్నందుకు అభినందనలు. అమ్మవారి శక్తి తెలుసుకాబట్టే



కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా ఎంతో మంది ప్రముఖులు దర్శనం చేసుకున్నారు. అందుకే బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్ గా మారుస్తాం. రాబోయే రోజుల్లో రాబోయేది మోదీ రాజ్యమే.

కర్నాటకలో ఆర్ఎస్ఎస్ పథ సంచలన్ లో పాల్గొన్న పాపానికి ఒక ప్రభుత్వ అధికారిని సస్పెండ్ చేయడం దుర్మార్గం. తీవ్రంగా ఖండిస్తున్నా. ఆర్ఎస్ఎస్ రాజకీయ పార్టీ కాదు. సాంస్కృతిక, జాతీయవాద సంస్థ. ఆర్ఎస్ఎస్ లాంటి క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన గొప్ప సంస్థ అని నాటి ప్రధాని ఇందిరాగాంధీ చెప్పారు. అంతెందుకు కర్నాటక డిప్యూటీ సీఎంగా పనిచేస్తున్న శివకుమార్ సైతం అసెంబ్లీ సాక్షిగా ఆర్ఎస్ఎస్ గీతం పాడి గొప్పతనాన్ని తెలియజేశారు. కాంగ్రెస్ ఉండేది ఇంకా రెండేళ్లే. రెండేళ్ల దాకా సస్పెండైన అధికారి ఆర్ఎస్ఎస్ ద్వారా దేశ సేవ చేయాలని కోరుతున్నా. రెండేళ్ల తరువాత కర్నాటకలో మళ్లీ వచ్చేది బీజేపీ ప్రభుత్వమే. అధికారంలోకి రాగానే సస్పెండైన అధికారికి రెండున్నరేళ్ల జీతభత్యాలన్నీ ఇవ్వడం తోపాటు ప్రమోషన్ కూడా ఇస్తాం. ఒక్కటి మాత్రం చెబుతున్నా. అరచేతిని అడ్డం పెట్టి సూర్యుడిని ఆపలేమన్నది ఎంత సత్యమో, నిషేధం పేరుతో ఆర్ఎస్ఎస్ ను అడ్డుకోలేరనేది కూడా అంతే సత్యం.' అని వ్యాఖ్యానించారు.

# పార్టీ పరంగా వద్దే వద్దు
# చట్టపరంగా ఇవ్వాలి

● క్యాబినెట్‌లో స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల పై నిర్ణయం తీసుకోవాలి
● ముఖ్యమంత్రికి బీసీ నేత, ఎంపీ ఆర్ కృష్ణయ్య లేఖ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : నేటి క్యాబినెట్ లో స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు పార్టీ పరంగా చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ పరంగా వద్దే వద్దు. చట్టబద్దంగా ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభసభ్యులు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. "మాకు భిక్షం వద్దు. చట్టబద్ధంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కేసు బలంగా ఉంది. కేసు కోర్టులో ఉండగా తొందర దీనికి రెండు నెలలో తీర్పు రానుంది. రెండు నెలలు ఆగలేరన్నారు. మొన్నటి బంద్ చారిత్రాత్మకం. అన్ని పార్టీలు అన్ని వర్గాల మొత్తం మద్దతు ఇచ్చారు. గతంలో ఎప్పుడూ ఇంత చారిత్రాత్మకంగా బంద్ జరగలేదు. బంద్ తీవ్రతను చూసి ప్రభుత్వం కళ్ళు తెరవాలని కృష్ణయ్య కోరారు. ముఖ్యమంత్రికి లేఖ ద్వారా కోరారు. ఇప్పుడు స్థానిక సంస్థలలో బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధ, చట్టబద్ధత, న్యాయబద్ధత ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి -6 ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. అలాగే అసెంబ్లీలో బీసీ బిల్లు చట్టం చేశారు. జనాభా లెక్కలు తీసి న్యాయ బద్ధం చేశారు. గతంలో సుప్రీంకోర్టు అనేకసార్లు తీర్పులలో జనాభా లెక్కలు ఉంటే దాని ప్రకారం రిజర్వేషన్లు పెంచవచ్చని తీర్పు చెప్పారు. అన్ని కోణాలలో పెంపుదలకు మద్దతు ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి 6 ప్రకారం స్థానిక సంస్థలోని బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ అధికారం ఇచ్చింది కావున అసెంబ్లీ చట్టం చేశారు జీవో తీసి వెంటనే ఎన్నికలు జరపవచ్చు ఏమైనా న్యాయపరమైన సమస్యలు వస్తే సుప్రీంకోర్టుకు ఏ కోర్టుకు ఎవరైనా వెళ్లిన బీసీల, కేసులు గెలిచే అవకాశం ఉంది ఎందుకంటే జనాభా లెక్కలు ఉన్నవి అసెంబ్లీ చట్టం చేశారు అలాగే సుప్రీంకోర్టు అగ్ర కులకు 10శాస్త్రం రిజర్వేషన్లు పెట్టినప్పుడు కేసులో 50% సీలింగ్ ఎత్తివేసింది. పైగా ఇందిరా సహానీ కేసులో ఎంపరికల్ డాటా ఉంటే 50% సిలింగ్ ను అధిగమించవచ్చునని సుప్రీం కోర్టు అభిప్రాయం కూడా ఉన్నది. ఇప్పుడు అన్ని కోణాల్లో చూస్తే కేసు గెలిచే అవకాశం ఉంది. చట్ట ప్రకారము, న్యాయప్రకారము రాజ్యాంగపరమైన అవరోధాలు లేవు కావున సుప్రీంకోర్టులో కేసు గెలుస్తుంది. ఎందుకంటి రిజర్వేషన్లు పెంచడానికి న్యాయపరమైన చట్టపరమైన రాజ్యాంగపరమైన అవరోధాలు ఏమీ లేవు కేసు బలంగాయుంది. రిజర్వేషన్లు పెంచడానికి కులాల వారీగా లెక్కలు తీశారు. అసెంబ్లీలో చట్టం చేశాడు.

# పండుగల వేళ స్పెషల్ ట్రైన్స్



● హర్షం వ్యక్తంచేస్తున్న ప్రయాణికులు ● 973 స్పెషల్ ట్రైన్స్ నడుపుతున్న దక్షిణ మధ్య రైల్వే

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : దసరా, దీపావళి, ఛట్ పూజ వంటి పండుగలను తమ కుటుంబ సభ్యులతో జరుపుకునేందుకు అందరూ ఆసక్తి చూపిస్తారు. దీంతో పండగల సందర్భంగా రైల్వేల్లో రద్దీ సహజంగానే పెరుగుతోంది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని రైలు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా 12,011 ప్రత్యేక రైళ్లను నడిపిస్తోంది. ఈ ప్రత్యేక రైళ్లన్నీ 21 సెప్టెంబర్, 2025 నుంచి 30 నవంబర్, 2025 వరకూ నడుస్తాయి. ఇందులో దక్షిణ మధ్య రైల్వే 973 ప్రత్యేక రైళ్లను నడిపిస్తోంది.

21 సెప్టెంబర్, 2025 నుంచి 30 నవంబర్, 2025 మధ్యన వివిధ జోన్లకు సంబంధించిన స్పెషల్ ట్రైన్స్ తో కలిపి.. మొత్తం 2,285 రైళ్లు దక్షిణ మధ్య రైల్వే మీదుగా ప్రయాణిస్తున్నాయి. ఇలా గతేడాది.. ప్రయాణించిన 1,924 రైళ్లతో పోలిస్తే ఈ సంవత్సరం 19% ఎక్కువగా ప్రత్యేక రైళ్లు దక్షిణ మధ్య రైల్వే మీదుగా ప్రయాణం సాగిస్తున్నాయి. ఈ రైళ్లన్నీ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాల మీదుగా ప్రయాణం సాగిస్తున్నాయి. 21 సెప్టెంబర్, 2025 - 20 అక్టోబర్, 2025 మధ్య నెల రోజుల సమయంలో దక్షిణ మధ్య రైల్వే పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని నడిపిన అదనపు రైళ్లతో కలిపి మొత్తం 1,010 ప్రత్యేక రైళ్లను నడిపింది. ఇందులో 399 రైళ్లను జోన్ పరిధిలో నడపగా, 611 రైళ్లను ఇతర జోన్లకు నడిపింది. ఇవి గతేడాది ఇదే సమయంలో నడిపిన 684 ప్రత్యేక రైళ్లతో పోలిస్తే 47% ఎక్కువ. ఈ సమయంలో ప్రయాణం సాగించిన రోజువారీ రైళ్లతోపాటుగా ఈ స్పెషల్ ట్రైన్స్ సేవలను దాదాపు 5 కోట్ల మంది సద్వినియోగం చేసుకున్నారు. గతేడాది ఈ పండుగల సమయంలో 1 అక్టోబర్, 2024 నుంచి 31 అక్టోబర్, 2024 వరకు దాదాపు 4.5 కోట్ల మంది దక్షిణమధ్య రైల్వే స్పెషల్ ట్రైన్స్, రెగ్యులర్ ట్రైన్స్ సేవలను పొందారు. ప్రత్యేక రైళ్ళకు అదనంగా రోజువారీ నడుస్తున్న రైళ్లలో ఉన్న వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల సౌకర్యార్థం 237 అదనపు కోచ్ లను ఆయా రైళ్లకు అనుసంధానించారు. అంతేకాకుండా హైదరాబాద్ నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో రద్దీని నివారించడానికి లింగంపల్లి, హైటెక్ సిటీ, చర్లపల్లి, మల్కాజ్ గిరి వంటి రైల్వేస్టేషన్లలో అదనపు స్టాఫ్ లను ఏర్పాటు చేశారు. రైల్వేశాఖ అందిస్తున్న సేవల పట్ల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రైల్వే స్టేషన్లను, రైళ్లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ పండుగ వేళ భారతీయ రైల్వే ప్రయాణికులకు అందిస్తున్న సేవల పట్ల వారి అభిప్రాయాలను నేరుగా అడిగి తెలుసుకుంటూ, తదనుగుణంగా అవసరమైన అదనపు సేవలను అందించేందుకు కృషి చేస్తున్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కూడా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

# ఈవీ పిసీఎస్ ఏర్పాటుకు ప్రత్యేక డ్రైవ్

**టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండి ముషారఫ్ ఫరూఖీ**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : "ప్రధాన్ మంత్రి ఎలక్ట్రిక్ డ్రైవ్ రివల్యూషన్ ఇన్ ఇన్నోవేటివ్ వెహికల్ ఎన్హాన్స్‌మెంట్ " పథకం కింద, విద్యుత్ వాహన పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటును ప్రోత్సహించేందుకు గాను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక డ్రైవ్ ను మొదలు పెట్టింది. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం, సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ముషారఫ్ ఫరూఖీ, ఐఏఎస్ రాష్ట్ర సచివాలయ పార్కింగ్ ప్రదేశాలను పర్యటించి, అక్కడ విద్యుత్ వాహన పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు కు గల అవకాశాలను పరిశీలించారు. రాష్ట్రంలోని ముఖ్య పట్టణాలు మరియు పారిశ్రామిక ప్రాంతాల్లో విద్యుత్ వాహన పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే వారికి కేటగిరీ ని బట్టి 100 శాతం నుండి 70 వరకు సబ్సిడీ ని అందిస్తున్నది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందుకు గాను సంస్థ సీఎండీ మరియు రెడ్ కో వీసీ ఎండీ లు గతవారం ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లతో సమావేశమయ్యారు. నమోదు ప్రక్రియను సులభతరం చేస్తూ సంస్థ యాప్ సాసా లో ప్రత్యేక ప్రోగ్రాంను ను రూపొందించామని, ఔత్సహికులు స్థానిక అసిస్టెంట్ ఇంజినీరుకు తెలియజేస్తే, ఆ ప్రదేశాన్ని పర్యటించి వివరాలు నమోదు చేసుకుంటారని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, ఐఏఎస్ తెలిపారు.

కాగా సీఎండీ పర్యటనలో సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ డా. నరసింహులు, మెట్రో జోన్ చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన హరీష్ రావు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : సిద్దిపేట మార్కెట్ యార్డ్ లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు బుధవారం నాడు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంలో ఆలస్యం చేయడం జరిగింది. ఇప్పటికే సిద్దిపేట మార్కెట్ యార్డ్ లో 14 వేల క్వింటాళ్ల మక్కలు దళారుల పాలయింది.

కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడం వల్ల మక్కల రైతులు మద్దతు ధర కంటే తక్కువకు 1600 రూపాయలకు దళారులకు అమ్ముకోవడం జరిగింది. ప్రతి ఎకరాకు కేవలం 18 క్వింటాళ్ళు మాత్రమే కొంటామని ప్రభుత్వం కొత్త నిబంధన పెట్టడం దుర్మార్గం. రైతు 25 నుంచి 30 క్వింటాళ్ల మక్కలు పండిస్తే 18 క్వింటాలు మాత్రమే ప్రభుత్వం కొంటా అంటే మిగతాది దళారుల పాలవుతుంది. పండిన పంట అంతా కొంటాం. కొని బోనస్ ఇస్తామన్న రేవంత్ రెడ్డి ఎందుకు కోతలు పెడుతున్నారు. ప్రతి గింజకు మద్దతు ధర ఇచ్చుకుంటా అని, ప్రతి పంటకు బోనసిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం జాడ లేదు. కొనుగోలు కేంద్రాలను కూడా అడగంగా అడగంగా అరిగోసపెట్టి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వం. మక్కలు కొనుగోలు మీద పెట్టిన నియంత్రణను ఎత్తివేయాలని, పండించిన మక్క పంటను పూర్తిగా కొనాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. రుణమాఫీ చేస్తానని సగం చేసి సగం ఎగ్గొట్టిండ్రు. రైతుబంధు ఇస్తా అని రెండు పంటలకు ఇచ్చి రెండు పంటలకు కోత పెట్టిండ్రు. బోనస్ కూడా ఒక పంటకు ఇచ్చి ఒక పంటకు ఎగ్గొట్టింది కాంగ్రెస్ పార్టీ. రేవంత్ రెడ్డి పాలన అంతా సగం సగం అంతా ఆగం ఆగం. మిగిలిన రుణమాఫీని ప్రభుత్వం తక్షణమే పూర్తి చేయాలి. అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలి.



పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాను. అని హరీష్ రావు అన్నారు.

**పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ మేడ్చల్‌లో**

# "సైబర్ మేధా ఏఐ " విజయవంతం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ మేడ్చల్ లో అక్టోబర్ 22, 2025న "సైబర్ మేధా " పేరుతో ప్రత్యేక సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. సైబర్ నేరాల పెరుగుదల నేపథ్యంలో సురక్షిత డిజిటల్ వాతావరణ నిర్మాణంలో కృత్రిమ మేధస్సు పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ లక్ష్యం. సుమారు 200 మంది సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు పాల్గొన్న ఈ సమావేశంలో బాధ్యతాయుతమైన ఆన్‌లైన్ ప్రవర్తన, సైబర్ ముప్పుల నివారణ, మరియు ప్రజల్లో అవగాహన వ్యాప్తిపై దృష్టి సారించారు. నిపుణులు సైబర్ నేరాల ధోరణులు, రక్షణ చర్యలు, మరియు నైతిక డిజిటల్ వినియోగంపై ప్రాధాన్యం వివరించారు. అదే రోజున, పోలీస్ స్మారక వారోత్సవం (అక్టోబర్ 21-30)లో భాగంగా గురు నానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మరియు సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కాలేజ్ విద్యార్థులతో ఓపెన్ హౌస్ సెషన్ నిర్వహించారు. విద్యార్థులకు ప్రాథమిక పోలీసింగ్, సైబర్ నేరాల నివారణా పద్ధతులు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీ పి. మధుకర్ స్వామి మాట్లాడుతూ, ఈ రెండు కార్యక్రమాలు యువతలో డిజిటల్ లిటరసీ పెంపు మరియు పోలీసుప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నాయని తెలిపారు. సైబర్ భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధస్సు నిపుణురాలు శ్రీమతి ప్రమీలారుణ్, డి.ఎస్.పీ వైస్ ప్రిన్సిపాల్ శ్రీ కె.వి. విజయ్ కుమార్, అలాగే ఇన్స్‌పెక్టర్లు శ్రీమతి మంజుల, వై.వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, కె.కిరణ్, ఎ .నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు సమాజంలో సైబర్ సురక్షత, మత్తు రహిత జీవన విధానం కోసం అవగాహన పెంపు దిశగా ముందడుగుగా నిలిచాయి.

# విద్యలో పెట్టుబడి... భవిష్యత్తుకు బలమైన పునాది

● గౌలిదొడ్డి-క్రమశిక్షణకు మారుపేరు, విద్యా విలువలకు నిలయం ● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : "విద్యలో పెట్టుబడి పెట్టడం అంటే భవిష్యత్తును నిర్మించడం" అనే సీఎం రేవంత్ రెడ్డి గారు చెప్పిన మాటలను సాకారం చేస్తున్నారని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం ఎస్.ఆర్. శంకరన్ జయంతి సందర్భంగా గౌలిదొడ్డి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలలో విద్యార్థులతో మమేకమై, విద్యా ప్రాముఖ్యతపై స్ఫూర్తిదాయక సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెనపూడి గాంధీ , ప్రిన్సిపాల్ అంజన్న , కల్పన గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ సామాజిక న్యాయానికి ప్రతీక – ఎస్.ఆర్. శంకరన్ ఎస్.ఆర్. శంకరన్ గ దేశంలోని అత్యున్నత సేవా తపన కలిగిన సీనియర్ ఐఏఎస్ అధికారి. పేదలు, దళితులు, గిరిజనులు, బడుగు వర్గాల జీవితాలలో వెలుగు నింపేందుకు అహర్నిశలు శ్రమించారు. దళితుల సంక్షేమం కోసం ప్రత్యేక హాస్టల్ వ్యవస్థను ప్రారంభించారు. గురుకుల విద్యకు పునాది వేశారు. సమాజంలో సమానత్వం, సేవా విలువలను ప్రోత్సహించారు. "అధికారంలో ఉన్నవాడు దయ చూపడం కాదు, న్యాయం చేయాలి" అనే సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టారు. "శంకరన్ గారు చూపిన మార్గం ఈ రోజు రాష్ట్ర సంక్షేమ విధానాలకు దిశా నిర్దేశం చేస్తున్నది. ఆయన కలల తెలంగాణను సీఎం రేవంత్ రెడ్డి గారు సాకారం చేస్తున్నారు" అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం విద్యా రంగంలో పలు విప్లవాత్మక చర్యలు చేపట్టింది. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్



ఏర్పాటు. అన్ని సంక్షేమ హాస్టళ్లకు మౌలిక సదుపాయాల అభివృద్ధి, భద్రత, స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి. గ్రీన్ చానెల్ వ్యవస్థ ద్వారా పెండింగ్ బిల్లుల తక్షణ క్లియరెన్స్. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని యోగ, ధ్యానం, కౌన్సెలింగ్ ప్రోగ్రామ్స్ ప్రారంభించడం జరిగింది. "చదువు అన్నది గొప్ప ఆస్తి. ఎక్కడికి వెళ్లినా మీ చదువే మీ పరిచయం," అని మంత్రి విద్యార్థులకు సూచించారు. యోగా, ధ్యానం ద్వారా ఏకాగ్రతను పెంపొందించుకోవాలని, క్రమశిక్షణను జీవిత భాగంగా చేసుకోవాలని, గురువులు, తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతాభావం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. "మీ సమస్యల పరిష్కారం కోసం నేను కట్టుబడి ఉన్నాను," అని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అరికెనపూడి గాంధీ మాట్లాడుతూ "గౌలీదొడ్డి అభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి అడ్లూరి కృషితో వేగంగా కొనసాగుతోంది," అని అన్నారు. స్థానిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపిన స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు. "గౌలీదొడ్డి డ్రైనేజ్ సమస్య పరిష్కారానికి రూ. 1.5 కోట్లు కేటాయించి పనులు పూర్తి చేశాం. విద్యార్థుల కోసం మౌలిక వసతులు మరింతగా బలోపేతం చేస్తాం," అని ఎమ్మెల్యే అన్నారు. "ఇక్కడి విద్యార్థులు భవిష్యత్తులో రాష్ట్రం, దేశం గర్వించేటట్లు ఎదగాలని నా ఆకాంక్ష" అని గాంధీ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ అభినందనలు ప్రిన్సిపాల్ అంజయ్య, కల్పన మాట్లాడుతూ ... "గౌలీదొడ్డి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అభివృద్ధి దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం. మంత్రిగారి, ఎమ్మెల్యే సహకారంతో మా విద్యార్థుల భవిష్యత్తు మరింత మెరుగుపడుతుంది," అని వారు అన్నారు.

# తెలంగాణ సామాజిక చైతన్య కార్యక్రమం

● సమాజ రుగ్మతలకు విరుగుడుగా సాహిత్య కళారూపాల రచనలకు ఆహ్వానం ● నవంబర్ 10 లోపు తమ రచనలను పంపాలి ● భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు నర్సింహారెడ్డి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : సమాజంలోని వివిధ రుగ్మతలను రూపుమాపి, ప్రజలలో పరివర్తన తీసుకవచ్చే దిశగా ప్రభుత్వం 'ప్రభాతభేరి' అనే నూతన సామాజిక చ్చైతన్య కార్యక్రమాన్ని లాంఛనంగా ఈ నెల 19న ప్రారంభించింది. ఈ కార్యక్రమాలతో ప్రజలలో మార్పు తీసుకువచ్చే దిశగా సృజనకారుల నుండి సృజనాత్మకమైన రచనలను, కళారూపాలను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది.

పాటగానో, స్కిట్ గానో, ఏకపాత్రగానో, వీధి నాటికగానో, చిందు యక్షగానంగానో, షార్ట్ ఫిలిం గానో, బుర్రకథ గానో, హరికథ గానో, గేయ రూపకంగానో, బ్రీత్ లెస్ సాంగ్ గానో, ఫ్లాష్ మాబ్ గానో లేదా ఇంకా పేరు పెట్టని ఇంకో కళారూపం ఏదైనా గాని, అత్యంత సృజనాత్మకమైన వివిధ కళారూపాల ద్వారా సమాజంలో మార్పును తీసుకువచ్చే దిశగా ప్రణాళికలు రూపొందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాకారులు, కవులు, సాహితీవేత్తలు తమ రచనలను నవంబర్ 10, 2025 లోపు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రాంగణంలోని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో అందజేయవల్సినదిగా సృజనకారులందరికీ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. నవంబర్ 10లోపు అందిన రచనలను పరిశీలించి వాటిలో ఉత్తమమైన వాటికి బహుమతులు ఇవ్వబడతాయని, ఎంపికైన వాటిని ప్రభుత్వం తరఫున నిర్వహించే కార్యక్రమాలలో వినియోగించుకుంటామని వివరించారు.

సూర్య
features@suryaa.com
# కలర్స్
LIFE IS A RAINBOW
సూర్య
హైదరాబాద్
గురువారం
22 అక్టోబర్ 2025





## అమెరికా అంతటా

# 'నో కింగ్స్' నిరసనలు!

### ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ రోడ్డెక్కిన ప్రజానీకం

### దూషణ భూషణలతో అట్టుడుగుతున్న అగ్రరాజ్యం

**రాజులు పోయారు. రాజ్యాలు పోయాయి. దేశం రాజు సొత్తు కాదు. ఓ కుటుంబం ఆస్తి కాదు. నియంతలా వ్యవహరిస్తామంటే కుదరదు. కఠినంగా వ్యవహరిస్తామంటే ఎవరూ ఒప్పుకోరు. 'నీ బాంచెన్ కాల్మొక్తా' అనే రోజులు పోయాయి. ప్రజలకు ఓపిక నశిస్తే పిడికిలి బిగిస్తారు. సహనం నశిస్తే తిరుగుబాటు చేస్తారు. చివరకు ప్రభుత్వాలను కూల్చేస్తారు. పాలకులను తరిమికొడతారు. ఇదే కదా ఆధునిక చరిత్ర. గతంలో చాలా దేశాల్లో తిరుగుబాట్లు జరిగాయి. నియంతలు మట్టి కరిచారు. ఇప్పుడూ చాలాచోట్ల ధిక్కార స్వరాలు వినిపిస్తున్నాయి. పాలకులు పారిపోతున్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన, స్వేచ్ఛా సమాజానికి ఉదాహరణగా చెప్పుకునే అమెరికాలో ప్రజలు డొనాల్డ్ ట్రంప్ మీద తిరగబడుతున్నారు. ధిక్కార స్వరం బలంగా వినిపిస్తున్నారు. కఠిన విధానాలు, అడ్డగోలు నిర్ణయాలు ఇకపై చెల్లవని నినదిస్తున్నారు. ట్రంప్ పాలన ఎలా ఉందో చూస్తున్నాం కదా. రోజుకో పిచ్చి నిర్ణయం తీసుకుంటూ అమెరికా ప్రజలనే కాదు ప్రపంచ దేశాలను ఇబ్బంది పెడుతున్నాడు. ఎవరితో ఎప్పుడు స్నేహంగా ఉంటాడో, ఎవరితో ఎప్పుడు విభేదిస్తాడో తెలియకుండా ఉంది. ఆయన విధానాలకు విసిగిపోయిన ప్రజలు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున జనం రోడ్లపైకి వచ్చి నినాదాలు చేశారు. 'నో కింగ్స్' పేరుతో ) నిరసన ప్రదర్శనలు చేశారు. దేశాన్ని సర్వనాశనం చేయొద్దని డిమాండ్ చేశారు. నియంతృత్వ పరిపాలనను ప్రతిఘటించడం, నిరసన తెలపడమే, అసలైన దేశభక్తి అని ప్రజలు తేల్చిచెప్పారు. న్యూయార్క్, తో పాటు అట్లాంటా, సికాగో తదితర నగరాల్లో నిరసనకారులు లక్షలాదిమంది ప్రజలు పాల్గొన్నారు మరిన్ని వివరాలలోకి వెళితే...**

రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తూ, సంస్కరణల పేరుతో వందలాది ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లను జారీ చేయడంపై అమెరికన్లలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ట్రంప్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, అమెరికన్లు అక్టోబర్ 18న దేశవ్యాప్తంగా 'నో కింగ్స్' పేరుతో మరోసారి భారీ ఆందోళనలకు పిలుపునిచ్చారు. దేశంలోని యాభై రాష్ట్రాల్లో సుమారు 2,500లకు పైగా ప్రదేశాల్లో ఈ నిరసనలు జరిగాయి. పలు ఐరోపా దేశాల్లోనూ ఈ ఆందోళనలకు మద్దతుగా కార్యక్రమాలు జరిగాయి. పాలనా సంస్కరణల నెపంతో ఎలాన్ మస్క్ నేతృత్వంలో 'డోజ్'ను ఏర్పాటుచేసి వేలాది మంది ఉద్యోగులను తొలగించడం, జన్మతః పౌరసత్వం, ట్రాన్స్జెండర్ల రక్షణ, అక్రమ వలసలు వంటి అంశాల్లో ట్రంప్ తీసుకున్న కీలక మార్పులు ఈ నిరసనల కు ప్రధాన కారణమయ్యాయి. వలస దారు లను అధికారుల టార్గెట్ చేయడం వివాదాస్పదంగా మారగా, నిరసనకారులను అడ్డుకునేందుకు ట్రంప్ యంత్రాంగం అనేక రాష్ట్రాల్లో జాతీయ బలగాలను మోహరించడం ఆందోళనలకు మరింత ఆజ్యం పోసింది. 'అమెరికాలో రాజులు లేరు' అని నినదిస్తూ.. అవినీతి, క్రూరత్వానికి వ్యతిరేక పోరాటంలో వెనక్కి తగ్గేది లేదని నిరసనకారులు తమ ప్రత్యేక వెబ్సైట్లో పేర్కొన్నారు.

### ఇవి 'హేట్ అమెరికా' నిరసనలు

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ట్రంప్ వలసల నియంత్రణ చర్యలు, విశ్వవిద్యాలయాలకు నిధులు తగ్గించడం, అనేక రాష్ట్రాల్లో నేషనల్ గార్డ్ దళాలు మోహరించడం వంటి అనేక నిర్ణయాలు తీసుకున్నాడు. ఈ చర్యలకు వ్యతిరేకంగా తాజా నిరసనలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. దేశవ్యాప్తంగా 2,500 కంటే ఎక్కువ ప్రదర్శనలకు ప్రణాళిక చేసినట్లు వెల్లడించారు. బారుగుల్లో శాంతియుతంగా నిరసనలు తెలిఎందుకు లక్ష మందికి పైగా ప్రజలు గుమిగూడారని న్యూయార్క్ పోలీస్ డిపార్ట్మెంట్ తెలిపింది. నిరసనలను రిపబ్లికన్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఇవి 'హేట్ అమెరికా' నిరసనలుగా అభివర్ణించింది. అమెరికాలో ఈ ఏడాది ఏప్రిల్లో కూడా భారీగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. ట్రంప్ తీరును మెజారిటీ జనం తప్పుపడుతున్నారు. అమెరికాను నాశనం చేయొద్దని కోరుతున్నారు. అమెరికాలో రాచరికం లేదు, ట్రంప్ రాజు కాదు అంటూ జనం గొం తెత్తి అప్పుడు కూడా నినదించారు. జనం వీధుల్లోకి వచ్చి అధ్యక్షుడికి వ్యతిరేకగా గొంతు విప్పారు.




## మూడో అతి పెద్ద ర్యాలీ

ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత ఇది మూడో అతి పెద్ద నిరసన ర్యాలీగా విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాక్ యుద్ధంలో పాల్గొన్న నౌకాదళానికి చెందిన షాన్ హెూవార్డ్ మాట్లాడుతూ.. తాను ఇంతకు ముందు ఎప్పుడూ నిరసనలో పాల్గొనలేదని, కానీ ట్రంప్ నిరంకుశ పాలన చూసి ఈ నిరసనలో పాల్గొన్నానని చెప్పారు. సరైన విధానం లేకుండా వలస నిర్బంధాలు, యూఎస్ నగరాల్లో దళాలను మోహరించడం, అమెరికన్ వ్యతిరేకత, ప్రజాస్వామ్యం క్షీణిస్తోందన్న సంకేతాలు ఆందోళనకరంగా ఉన్నాయని ఆయన అన్నారు. తాను విదేశాలలో తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడానని హెూవార్డ్ అన్నారు. తాను CIA లో 20 సంవత్సరాలు తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాలపై పనిచేశానని చెప్పారు. కానీ ఇప్పుడు అమెరికాలో ప్రతిచోటా తీవ్రవాదులు ఉన్నారని, వీళ్లు ఏదో ఒక రకమైన సంఘర్షణకు ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు.




### 2500 ప్రదేశాల్లో నిరసనలు

"నిరసన వ్యక్తం చేయడం కంటే దేశభక్తి లేదు", "ఫాసిజాన్ని ప్రతిఘటించండి" వంటి ప్లకార్డులతో న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ వద్ద భారీగా నిరసనకారులు ర్యాలీ చేశారు. బోస్టన్, అట్లాంటా, చికాగోలోని పార్కుల లో వేలాది మంది నో కింగ్స్ ర్యాలీలో పాల్గొన్నారు. వాషింగ్టన్ డీసీ, డౌన్టౌన్ లాస్ ఏంజిల్స్ లలో నిరసన ర్యాలీలు జరిగాయి. అమెరికా వ్యాప్తంగా 2,500 కంటే ఎక్కువ ప్రదర్శనలకు నిరసనకారులు ప్రణాళిక చేసినట్లు పోలీసులు తెలిపారు. ట్రంప్ రిపబ్లికన్ పార్టీ ఈ నిరసన ర్యాలీలను "హేట్ అమెరికా" ర్యాలీలుగా పేర్కొంది. కానీ చాలా చోట్ల ఈ నిరసనలు వీధి పార్టీల్లా ఉన్నాయని ఎద్దేవా చేసింది. దేశ వ్యాప్తంగా నిరసనలు . స్టాట్యూ ఆఫ్ లిబర్టీ వేషధారణలో ఉన్న మహిళ ట్రంప్ నియంతగా వ్యవహరిస్తున్నారని ఆరోపించింది. లాస్ ఏంజిల్స్, చికాకూ, పోర్ట్ ల్యాండ్ లలో సైనికులను మోహరించే వరకు నేను ట్రంప్ నకు మద్దతుగా ఉన్నానన్నారు. కానీ పోర్ట్ ల్యాండ్ లో సైనికుల మోహరింపు తనను ఎక్కువగా బాధపెట్టిందన్నారు. ఈ ఏడాది జూన్ చేపట్టిన "నో కింగ్స్" ర్యాలీలో ఒక ఆందోళనకారుడిని పోలీసులు కాల్చి చంపారు. శనివారం జరిగిన నిరసన ప్రదర్శనలలో ఎలాంటి అరెస్టులు జరగలేదని పోలీసులు తెలిపారు.

### నేను రాజు కాదు

నో కింగ్స్ నిరసనలపై అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందించారు. నిరసనకారులు తనను రాజుగా ప్రస్తావిస్తున్నారని, తాను రాజును కాదని ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో ట్రంప్ అన్నారు.

### రాజకీయ ప్రతిస్పందనలు

అమెరికా సెనెట్ నేత చక్ షుమెర్, సీనియర్ నేత బెర్నీ సాండెర్స్ సహా పలువురు ప్రజా ప్రతినిధులు కూడా ఈ నిరసనల్లో పాల్గొన్నారు. మరోవైపు, వైట్హౌస్ మాత్రం ఈ ఆందోళనలను "హేట్ అమెరికా క్యాంపెయిన్"గా ఖండించింది. ట్రంప్ స్వయంగా స్పందిస్తూ, "నేను రాజును కాదు, ప్రజాస్వామ్యానికి సేవకుడిని" అని వ్యాఖ్యానించారు.

### భద్రతా ఏర్పాట్లు

నిరసనల తీవ్రత దృష్ట్యా పలు రాష్ట్రాల్లో గవర్నర్లు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యగా జాతీయ బలగాలను మోహరించారు. ఇటీవల అమెరికా ప్రభుత్వం షట్డౌన్లోకి వెళ్లిపోవడం, లక్షలాది ఉద్యోగులు ప్రభావితమవడం కూడా ప్రజా ఆగ్రహాన్ని మరింత పెంచిన అంశమైంది.

### నిరసనల ఉద్దేశం

"అమెరికాలో రాజులు లేరు" అనే నినాదంతో ఈ ఉద్యమం సాగుతోంది. ట్రంప్ పాలన తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న పౌరులు, ఆయనను "అధికార దుర్వినియోగం చేస్తున్న నేత"గా అభివర్ణిస్తున్నారు. వలసదారుల హక్కుల పరిరక్షణ, ట్రాన్స్జెండర్ హక్కులు, పౌరసత్వ విధానాలు వంటి అంశాల్లో ఆయన తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు ప్రజల్లో అసహనానికి దారితీశాయి.

**బి.వి.రమణ**
**94407 40015**




## ట్రంప్ పై మరోసారి హత్యాయత్నం కుట్ర

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్పై మరోసారి హత్యాయత్నం కుట్ర జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటన ఫ్లోరిడాలోని పామ్ బీచ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. అధ్యక్షుడి భద్రతకు అత్యంత కీలకమైన సీక్రెట్ సర్వీస్ అధికారులు, ట్రంప్ ప్రయాణించే 'ఎయిర్ఫోర్స్ వన్' విమానం ఆగే ప్రదేశానికి అతి సమీపంలో అనుమానాస్పదంగా ఏర్పాటు చేసిన ఓ స్నైపర్ గూడును గుర్తించడంతో ఈ కుట్ర వెలుగులోకి వచ్చింది. భద్రతా సిబ్బంది అత్యంత అప్రమత్తతతో స్పందించి, అధ్యక్షుడిని సాధారణంగా వాడే పెద్ద మెట్లకు బదులు, వెనుక వైపు ఉన్న చిన్న మెట్ల ద్వారా హుటాహుటిన విమానం లోపలికి తరలించారు. ఈ అనూహ్య పరిణామం అమెరికా అధ్యక్షుడి భద్రతపై మరోసారి తీవ్ర ఆందోళనలను పెంచింది.

ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఎఫ్బీఐ (ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) డైరెక్టర్ కాష్ పటేల్ వెల్లడించారు. అధ్యక్షుడి విమానం ల్యాండింగ్ అయ్యే మరియు ఎక్కే జోన్కు కేవలం 200 గజాల (సుమారు 600 అడుగులు) దూరంలో ఉన్న ఒక చెట్టుపై ఈ అనుమానాస్పద నిర్మాణం ఉన్నట్లు పటేల్ తెలిపారు. "భద్రతా తనిఖీల్లో భాగంగా, మా సీక్రెట్ సర్వీస్ అధికారులు అత్యంత ఎత్తైన గూడును గుర్తించారు. నిచ్చెన సాయంతో నిర్మించిన ఈ నిర్మాణం, ట్రంప్పై నిఘా పెట్టేందుకు వీలుగా రూపొందించబడింది. అధ్యక్షుడి విమానం ఎక్కే ప్రాంతాన్ని స్పష్టంగా టార్గెట్ చేసుకోవడానికి ఈ ప్రదేశం నుండి పూర్తి అవకాశం ఉంది" అని ఎఫ్బీఐ డైరెక్టర్ పటేల్ వెల్లడించారు. ఈ గూడు స్నైపర్ లేదా దూర ప్రాంతాల నుండి లక్ష్యాన్ని ఛేదించే వ్యక్తికి అనువైన విధంగా ఎత్తైన వేదికగా ఉందని అధికారులు అనుమానిస్తున్నారు. అనుమానాస్పద గూడు ఉన్న ప్రదేశంలో ఎలాంటి పేలుడు పదార్థాలు లేదా ఆయుధాలు, అనుమానిత వ్యక్తులు




కనిపించనప్పటికీ, భద్రతా బలగాలు ఈ ఘటనను చాలా తీవ్రంగా పరిగణించాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్పై గతంలో జరిగిన రెండు వేర్వేరు హత్యాయత్నాలను దృష్టిలో ఉంచుకుని, భద్రతా విభాగాలు వెంటనే అప్రమత్తమై చర్యలు చేపట్టాయి.

ద్రతా ఏర్పాట్లలో భాగంగా, అధికారులు రెండు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కుట్ర కోణం ఉండవచ్చునని భావించి, 'ఎయిర్ఫోర్స్ వన్' విమానాన్ని సాధారణంగా నిలిపే స్థలం నుండి వేరే సురక్షిత ప్రాంతానికి మార్చారు. అధ్యక్షుడిని ఎక్కువ సేపు బహిరంగ ప్రదేశంలో ఉంచకుండా ఉండేందుకు, సాధారణంగా వీవీఐపీలు ఉపయోగించే పెద్ద ముందు మెట్లకు బదులు, విమానం వెనుక భాగంలో ఉన్న చిన్న, అసాధారణ మెట్ల ద్వారా లోపలికి పంపించారు. ఈ చర్య సమయాన్ని ఆదా చేయడంతో పాటు, లక్ష్యానికి గురయ్యే అవకాశాన్ని తగ్గించింది. అధ్యక్షుడు ట్రంప్ సురక్షితంగా విమానం లోపలికి చేరుకున్న తర్వాతే భద్రతా సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఈ అనూహ్యమైన మార్పుకు కారణం ఏమిటనే విషయంపై మీడియాకు లేదా ప్రజలకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదు.

### కుట్ర వెనుక ఎవరి హస్తం..?

ఈ అనుమానాస్పద నిర్మాణాన్ని ఎవరు ఏర్పాటు చేశారు, దీని వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటనే దానిపై ఎఫ్బీఐ పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టింది. ఈ కుట్ర వెనుక ఏవైనా సంస్థాగత ఉద్దేశాలు ఉన్నాయా లేదా ఇది ఉన్మాది చర్య మాత్రమేనా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది. "మా ఫోరెన్సిక్ బృందాలు గూడు ఉన్న ప్రాంతం నుండి అన్ని ఆధారాలను సేకరిస్తున్నాయి. వేలిముద్రలు, డీఎన్ఏ శాంపిల్స్, ఆ ప్రాంతంలో వదిలి వెళ్లిన ఇతర వస్తువులను పరిశీలిస్తున్నాం. ఈ నిర్మాణాన్ని ఏర్పాటు చేసిన వారిని త్వరలోనే గుర్తించగలుగుతామని ఆశిస్తున్నాం" అని డైరెక్టర్ పటేల్ తెలిపారు. అమెరికా అధ్యక్షుడి భద్రతకు సంబంధించి ఈ తాజా పరిణామం మరోసారి దేశంలో హై-ప్రొఫైల్ నేతల భద్రతా వ్యవస్థలపై చర్చను లేవనెత్తింది. దేశాధ్యక్షుడి ప్రయాణాలు, బహిరంగ ప్రదేశాల్లో ఆయన పర్యటనల భద్రతా ప్రణాళికలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరాన్ని ఈ ఘటన నొక్కి చెప్పింది. ఎఫ్బీఐ దర్యాప్తు ఫలితాలు మరిన్ని వివరాలను వెల్లడించే అవకాశం ఉంది. వైట్ హౌస్ ఎదుట, టెస్లా కార్యాలయాల వద్ద, నగరాల్లోని ప్రధాన సెంటర్లలో జనం పెద్ద ఎత్తున గుమికూడారు. ట్రంప్ వ్యవహార శైలిపై ఆగ్రహం వెళ్లగక్కారు. చాలాచోట్ల ర్యాలీలు జరిగాయి. ఈ నిరసన ఉద్యమం 50501గా పేరు పొందింది. 50 నిరసనలు, 50 రాష్ట్రాలు, ఒక ఉద్యమం అనేదే దీని అర్థం. మరి ట్రంప్ మారుతాడా? కళ్లు తెరుస్తాడా?

# సర్ఫ్‌రాజ్ ఖాన్ దూరం ఎంపికపై వివాదం




సౌతాఫ్రికా- 'ఎ' జట్టుతో అనధికారిక టెస్టు సిరీస్కు ఎంపిక చేసిన భారత్- 'ఎ' జట్టులో సర్ఫ్‌రాజ్ ఖాన్‌కు చోటు దక్కలేదు. రిషభ్ పంత్ కెప్టెన్గా వ్యవహరిస్తున్న ఈ జట్టుకు వైస్ కెప్టెన్గా సాయి సుదర్శన్ ను ఎంపిక చేశారు సెలక్టర్లు.కావాల్సినంత ప్రాక్టీస్ అదే విధంగా రెండో అనధికారిక టెస్టులో కేఎల్ రాహుల్, మొహమ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణ వంటి టీమిండియా స్టార్లకు కూడా చోటిచ్చారు. సౌతాఫ్రికాతో స్వదేశంలో టెస్టు సిరీస్కు సన్నాహకంగా ఉండే ఈ రెడ్బాల్ సిరీస్తో ఆటగాళ్లకు కావాల్సినంత ప్రాక్టీస్ దొరకనుంది.పక్కనపెట్టడంపై విమర్శలు ఇక 'ఎ' జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన సర్ఫరాజ్ ఖాన్కు ప్రధాన జట్టులో స్థానం దక్కదనే స్పష్టంగానే తెలుస్తోంది. ఇటీవలే పదిహేడు కిలోల బరువు తగ్గడంతో పాటు రెడ్ బాల్ టోర్నీల్లో సెంచరీ చేసినా సెలక్టర్లు అతడిని ఇలా పక్కనపెట్టడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేత షామా మొహమ్మద్ సంచలన ట్వీట్ చేశారు.

ఇంటిపేరు వల్లే అతడిని ఎంపిక చేయలేదా?

"ఇంటిపేరు కారణంగానే సర్ఫరాజ్ ఖాన్ జట్టుకు ఎంపిక కాలేదా?.. ఊరికే అడుగుతున్నా అంతే!.. ఈ విషయంలో గౌతం గంభీర్ విధానాలు ఎలా ఉంటాయో మనకు తెలిసిందే కదా!" అంటూ హెడ్కోచ్, బీజేపీ మాజీ ఎంపీ గౌతం గంభీర్ను షామా మొహమ్మద్ టార్గెట్ చేశారు.

కరెక్ట్ కాదు మేడమ్..

ఈ నేపథ్యంలో షామా ట్వీట్పై నెటిజన్లు మిశ్రమంగా స్పందిస్తున్నారు. అయితే, మెజారిటీ మంది ఆమె ఆలోచనా విధానాన్ని తప్పుబడుతున్నారు. మొహమ్మద్ సిరాజ్ జట్టులోని ప్రధాన బౌలర్లలో ఒకడన్న విషయాన్ని మర్చిపోవద్దని హితవు పలుకుతున్నారు. ఆటలో ఇలాంటి రాజకీయాలకు తావు లేదని.. ఇలాంటి మాటలతో చిచ్చు పెట్టాలని చూడటం సరికాదని పేర్కొంటున్నారు.

భారత క్రికెట్లో ఎప్పుడూ ఇలా జరుగలేదు

ఈ క్రమంలో టీమిండియా మాజీ పేసర్ అతుల్ వాసన్.. షామా మొహమ్మద్ వ్యాఖ్యలపై ఘాటుగానే స్పందించారు. ఎన్డీటీవీతో మాట్లాడుతూ.. "ఇది చాలా విషాదకరం. ఇలాంటి మాటలు వద్దు. సర్ఫరాజ్ ఖాన్ జట్టులో ఉండేందుకు అర్హుడు.అయితే, అతడికి రావాల్సినన్ని అవకాశాలు రావడం లేదన్న మాట వాస్తవమే. కానీ ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలు అర్థంలేనివి. భారత క్రికెట్లో ఎప్పుడూ ఇలా జరుగలేదు. అజర్ హయాంలోనూ కొందరు ఇలాంటి మాటలే మాట్లాడారు.కానీ ఇందులో మతపరమైన కోణం ఉంటుందని నేను అస్సలు అనుకోను. సర్ఫరాజ్ ప్రస్తుత ప్రదర్శనల ఆధారంగానే జట్టులోకి ఎంపిక కాలేదు. చాన్నాళ్లుగా మూడు ఫార్మాట్లలోనూ రాణిస్తున్న ఆటగాళ్లు ఉన్నారు. వాళ్లకు కూడా అవకాశాలు ఇవ్వాల్సి ఉంటుంది.సర్ఫరాజ్కు తగినన్ని ఛాన్సులు రాలేదు.. కానీఅయితే, ఓ ప్లేయర్ ఒక్క మ్యాచ్లో విఫలమైనంత మాత్రాన పక్కన పెట్టడం సరికాదు. సర్ఫరాజ్ ఖాన్కు తగినన్ని ఛాన్సులు రాలేదు. ఒకవేళ గాయం నుంచి కోలుకుని తిరిగి వచ్చిన రిషభ్ పంత్.. తర్వాత విఫలమైనా అతడిని పక్కనపెట్టడం జరగదు.జట్టు ప్రయోజనాల కోసం కొన్నిసార్లు ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటారు. వీటిని ఎవరూ మార్చలేరు" అని అతుల్ వాసన్ చెప్పుకొచ్చాడు. కాగా ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ గతేడాది టీమిండియా తరఫున అరంగేట్రం చేశాడు. ఇప్పటి వరకు ఆరు టెస్టులు ఆడి ఓ సెంచరీ, మూడు అర్థ శతకాల సాయంతో 371 పరుగులు చేశాడు.

రోహిత్ లావుగా ఉన్నాడని..కాగా షామా మొహమ్మద్ గతంలోనూ రోహిత్ శర్మను ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రోహిత్ లావుగా ఉన్నాడని.. అదృష్టం కొద్దీ కెప్టెన్ అయ్యాడే తప్ప అతడికి అంత సీన్ లేదని వ్యాఖ్యానించారు. కాగా భారత్కు టీ20 ప్రపంచకప్-2024, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025 రూపంలో అందించిన ఘనత రోహిత్ శర్మది.

# నీరజ్ చోప్రాకు ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ హోదా

## ప్రదానం చేసిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

భారత స్టార్ అథ్లెట్, ఒలింపిక్ బంగారు పతక విజేత నీరజ్ చోప్రాను భారత టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా నియమించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం నీరజ్కు లెఫ్టినెంట్ కర్నల్ హోదాను ప్రదానం చేశారు. రాజ్‌నాథ్ సింగ్ సిఓఏఎస్ జనరల్ ఉపేంద్ర ద్వివేది సమక్షంలో నీరజ్ ఈ గౌరవ హోదా అందుకున్నాడు. ఈ సమయంలో అతడి కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు. కాగా, రక్షణ మంత్రిత్వ శాఖ నీరజ్కు ఈ ఏడాది మే లో ఈ హోదాను ప్రకటించింది.2016 నుంచి నీరజ్ చోప్రా భారత సైన్యంలో సుబేదార్‌గా వ్యవహరించాడు. అనంతరం నీరజ్ చోప్రాను కేంద్ర ప్రభుత్వం 'పరమ విశిష్ట సేవా పతకం'తో సత్కరించింది. ఇప్పుడు లెఫ్టినెంట్ కర్నల్‌గా హోదా అందుకున్నాడు. ఇక అతడి స్పోర్ట్స్ ఎండార్స్మెంట్ కాకుండా ఆర్మీ కర్నల్‌గా హోదాలో అన్ని అలవెన్సులు కలిపి నీరజ్ నెలకు రూ. 2.12 లక్షల వరకూ శాలరీ అందుకుంటాడు! ఇక 2021లో నీరజ్ భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన 'మేజర్ ధ్యాన్చంద్ ఖేల్రత్న', 2022లో 'పద్మశ్రీ అవార్డు'ను అందుకున్నాడు.కాగా, 2021 టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ స్వర్ణ పతకం సాధించి రికార్డ్ సృష్టించాడు. ఆ తర్వాత 2024 పారిస్ ఒలింపిక్స్లో భారీ అంచనాలతో నీరజ్ బరిలోకి దిగాడు. అంచనాలు నిలబెట్టుకొని ఫైనల్కు దూసుకెళ్లాడు. రెండోసారి కూడా గోల్డ్ మెడల్ ఖాయమని అంతా అనుకున్నారు. కానీ, ఫైనల్లో పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ నుంచి గట్టి పోటీ ఎదురైంది. 92.97 మీటర్ల త్రోలో అర్షద్ గోల్డ్ నెగ్గగా, 89.45 మీటర్లతో నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు.దేశానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా భారత సైన్యం ప్రత్యేక హోదాతో సత్కరిస్తుంది. నీరజ్ చోప్రా కంటే ముందు స్టార్ నటుడు మోహన్ లాల్, భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ, సచిన్ పైలట్, కపిల్ దేవ్, అనురాగ్ ఠాకూర్, అభినవ్ బింద్రా ఈ గౌరవ హోదాను పొందారు.

నీరజ్ చోప్రా : టోక్యో ఒలింపిక్స్‌లో 87.58 మీటర్ల జావెలిన్ త్రోతో బంగారు పతకం
ఆసియా క్రీడలు 2018 (జకార్తా): బంగారు పతకం (88.06 మీటర్ల దూరం)
కాన్ఫెడరేషన్ గేమ్స్ 2018: బంగారు పతకం
ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లు 2022: రజత పతకం



ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లు 2023 (బుడాపెస్ట్): బంగారు పతకం
డైమండ్ లీగ్ 2022 : ఫైనల్ గెలిచిన మొదటి భారతీయుడు
చీవవతీఝయి జప్త్రశీజూతీఝ ఝతీవవతీ : కాగా, 1997 డిసెంబర్ 24న హరియాణా పానిపట్ జిల్లాలోని ఖంద్రా గ్రామంలో నీరజ్ జన్మించాడు. నీరజ్ తండ్రి సతీష్ కుమార్ ఒక రైతు, అతని తల్లి సరోజ్ దేవి గృహిణి. నీరజ్ 11 సంవత్సరాల వయస్సులోనే జావెలిన్ త్రోయింగ్ ప్రారంభించాడు. అతను పానిపట్ స్టేడియంలో కోచ్ జయవీర్ చౌదరి పర్యవేక్షణలో శిక్షణ పొందాడు. 2016లో పోలాండ్‌లో జరిగిన ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలుచుకోవడం ద్వారా ప్రపంచానికి పరిచయం అయ్యాడు.

# రోహిత్ శర్మ భవితవ్యంపై అనుమానాలు



ఆస్ట్రేలియాతో రెండో వన్డేకు టీమిండియా స్టార్ రోహిత్ శర్మ సన్నద్ధమయ్యాడు. ఆప్షనల్ సెషన్లో భాగంగా నెట్స్లో తీవ్రంగా చెమటోడ్చిన హిట్మ్యాన్.. బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. త్రోడౌన్స్ ఎదుర్కొంటూ బిజీబిజీగా గడిపాడు. అయితే, ప్రాక్టీస్ సెషన్ ముగించుకున్న తర్వాత రోహిత్ శర్మ మైదానాన్ని వీడే క్రమంలో ముభావంగా కనిపించడం చర్చకు దారితీసింది. ఇందుకు ప్రధాన కారణం.. హెడ్కోచ్ గౌతం గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ చర్యలే అని తెలుస్తోంది.

అందుకే రోహిత్పై వేటు : కెప్టెన్ హోదాలో భారత్కు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025 అందించిన 38 ఏళ్ల రోహిత్ శర్మపై యాజమాన్యం ఊహించని రీతిలో వేటు వేసిన విషయం తెలిసిందే. వన్డే ప్రపంచకప్-2027 టోర్నీని దృష్టిలో పెట్టుకుని రోహిత్ను తప్పించి.. అతడి స్థానంలో శుబ్మన్ గిల్కు పగ్గాలు అప్పగించినట్లు అగార్కర్ ఆసీస్ పర్యటన జట్టు ప్రకటన సందర్భంగా తెలిపాడు.

రోహిత్కు ఇష్టం లేకపోయినా..అయితే, ఇప్పటికే అంతర్జాతీయ టీ20 ఫార్మాట్కు, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ.. వన్డే కెప్టెన్గా కొనసాగాలని గట్టిగా నిర్ణయించుకున్నట్లు సమాచారం. అయితే, కోచ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అగార్కర్ బలవంతంగానే రోహిత్ను తప్పించడంలో కీలక పాత్ర పోషించినట్లు వార్తలు వచ్చాయి.

**ఓపెనర్గానూ చోటివ్వరా?**

ఇక ఈ పరిణామాల నేపథ్యంలో.. భారత్కు రెండు ఐసీసీ టైటిళ్లు అందించిన దిగ్గజ కెప్టెన్ రోహిత్ శర్మ ప్రస్తుతం వన్డే జట్టులో ఓపెనర్గా మాత్రమే కొనసాగుతున్నాడు. అయితే, ఆ స్థానానికీ గంభీర్- అగార్కర్ ఎసరు పెట్టినట్లు తాజా ఊహాగానాల ద్వారా తెలుస్తోంది.ఆసీస్తో రెండో వన్డేకు ముందు అడిలైడ్ ఓవల్ మైదానంలో రోహిత్ శర్మ ప్రాక్టీస్ చేస్తున్న వేళ.. గంభీర్, అగార్కర్.. యువ ఆటగాడు యశస్వి జైస్వాల్తో సుదీర్ఘ చర్చలు జరిపినట్లు సమాచారం. ఇదే రోహిత్ మూడ్ ఆఫ్ అవడానికి కారణమని రెవ్స్పోర్ట్స్ కథనం ద్వారా అర్థమవుతోంది.

**జైసూతో చర్చలకు అర్థం ఏమిటి?**

కాగా ఇప్పటికే టెస్టుల్లో ఓపెనర్గా పాతుకుపోయిన యశస్వి జైస్వాల్.. వన్డేల్లో మాత్రం అవకాశాలు దక్కించుకోలేకపోతున్నాడు. రోహిత్- గిల్ వన్డే ఫార్మాట్లో ఓపెనింగ్ జోడీగా కొనసాగుతున్న నేపథ్యంలో జైసూకు ఇంత వరకు ఒకే ఒక్క వన్డే ఆడే అవకాశం వచ్చింది.

అయితే, తాజాగా ఆసీస్తో వన్డే సిరీస్ నేపథ్యంలో జైస్వాల్ను బ్యాకప్ ఓపెనర్గా ఎంపిక చేశారు సెలక్టర్లు. కెప్టెన్గా తుదిజట్టులో గిల్ స్థానానికి వచ్చిన ఢోకా లేదు. మరోవైపు.. రోహిత్ కూడా పది కిలోల బరువు తగ్గి పూర్తి ఫిట్గా ఉన్నాడు. ఇలాంటి తరుణంలో గంభీర్, అగార్కర్ జైసూకు ప్రాధాన్యం ఇస్తూ చర్చలు జరపడం.. రోహిత్ అభిమానులను ఆందోళనలోకి నెట్టేసింది.

భవిష్యత్తు ప్రణాళికలు అంటూ.. రోహిత్ను జట్టు నుంచే తప్పించి జైస్వాల్ ఆడిస్తారా ఏమిటి? అనే సందేహాలు ఫ్యాన్స్ను వెంటాడుతున్నాయి. ఇదిలా ఉంటే.. ప్యూర్ బ్యాటర్ అయిన జైస్వాల్.. నెట్స్లో లెగ్ స్పిన్ బౌలింగ్ ప్రాక్టీస్ చేయడం గమనార్హం. గంభీర్ ఆల్రౌండర్లకే పెద్దపీట వేస్తాడన్న పేరుంది. కాబట్టి తనలోని ఆల్రౌండ్ నైపుణ్యాలతో గంభీర్ను ఆకట్టుకుని తుదిజట్టులో చోటు సంపాదించాలని జైసూ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. ఈ ఆప్షనల్ సెషన్కు విరాట్ కోహ్లితో పాటు గిల్ కూడా డుమ్మాకొట్టినట్లు సమాచారం.

విఫలమైన రో- కో కాగా ఆసీస్తో మూడు వన్డేల సిరీస్లో భాగంగా పెర్త్లో జరిగిన తొలి మ్యాచ్లో టీమిండియా ఏడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఇరుజట్ల మధ్య గురువారం జరిగే రెండో వన్డేకు అడిలైడ్ ఓవల్ వేదిక. ఇక ఏడు నెలల తర్వాత టీమిండియా తరఫున తొలి వన్డేతో రీఎంట్రీ ఇచ్చిన రో- కో నిరాశపరిచారు. రోహిత్ 8 పరుగులే చేసి అవుట్ కాగా.. కోహ్లి డకౌట్గా వెనుదిరిగాడు.

# యుఎస్ జీపీలో వెర్స్టాపెన్ విజయం

ఆస్టిన్ (అమెరికా): ఫార్ములావన్ (ఎఫ్1) 2025 సీజన్లో రెడ్బుల్ జట్టు డ్రైవర్ మ్యాక్స్ వెర్స్టాపెన్ మరోసారి సత్తా చాటాడు. ఈ ఏడాది ఆరంభంలో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన ఈ నెదర్లాండ్స్ డ్రైవర్... ద్వితీయార్థంలో అదరగొడుతున్నాడు. తాజాగా యునైటెడ్ స్టేట్స్ గ్రాండ్ప్రిలో వెర్స్టాపెన్ విజేతగా నిలిచాడు. గత నాలుగు రేసుల్లో అతడికిది మూడో విజయం కావడం విశేషం. ఓవరాల్గా ఈ ఏడాది అతనికిది ఐదో టైటిల్. తుది రేసును 'పోల్ పొజిషన్' నుంచి ప్రారంభించిన వెర్స్టాపెన్ వాయు వేగంతో దూసుకెళ్లాడు. 56 ల్యాప్ల రేసును అందరికంటే ముందుగా, అందరికంటే వేగంగా 1 గంట 34 నిమిషాల 0.161 సెకన్లలో ముగించి అగ్రస్థానంలో నిలిచాడు. తద్వారా నాలుగుసార్లు వరల్డ్ చాంపియన్ వెర్స్టాపెన్ డ్రైవర్స్ చాంపియన్షిప్ పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో ఉన్న మెక్లారెన్ డ్రైవర్లకు మరింత చేరువయ్యాడు. రేసు ఆరంభం నుంచే ప్రత్యర్థులకు అందకుండా దూసుకెళ్లిన డిఫెండింగ్ చాంపియన్ వెర్స్టాపెన్ సగం రేసు అయ్యేసారికి రెండో స్థానంలో ఉన్న డ్రైవర్ కంటే 10 సెకన్ల ఆధిక్యంలో నిలిచాడు.ఓవరాల్గా వెర్స్టాపెన్ కెరీర్లో ఇది 68వ టైటిల్. 24 రేసుల సీజన్లో 19 రేసులు ముగిసేసరికి ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్షిప్లో ఆస్కార్ పియాస్ట్రి 346 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... లాండో నోరిస్ 332 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. వెర్స్టాపెన్ 306 పాయింట్లతో మూడో స్థానాన్ని మరింత



మెరుగు పర్చుకున్నాడు. ఈ సీజన్లో మరో ఐదు రేసులు మిగిలుండగా... డ్రైవర్స్ చాంపియన్షిప్ అగ్రస్థానంలో ఉన్న పియాస్ట్రి కంటే వెర్స్టాపెన్ 40 పాయింట్లు వెనుకబడి ఉన్నాడు. రెండో స్థానంలో ఉన్న నోరిస్కు, వెర్స్టాపెన్కు మధ్య 26 పాయింట్ల అంతరం ఉంది. పియాస్ట్రి, నోరిస్ కెరీర్లో తొలి డ్రైవర్స్ చాంపియన్షిప్ టైటిల్ కోసం తహతహలాడుతుంటే... ఇప్పటికే వరుసగా నాలుగుసార్లు ప్రపంచ చాంపియన్గా నిలిచిన వెర్స్టాపెన్ ఐదోది ఖాతాలో వేసుకోవాలని భావిస్తున్నాడు. 'ఇప్పుడే చెప్పలేం కానీ అవకాశం మాత్రం ఉంది.

# జింబాబ్వే ఇన్నింగ్స్ విజయం

## ఆఫ్ఘనిస్తాన్ చిత్తు



స్వదేశంలో ఆఫ్ఘనిస్తాన్తో జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్లో జింబాబ్వే ఘన విజయం సాధించింది. ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో పర్యాటక జట్టును చిత్తుగా ఓడించింది. మూడు రోజుల్లో ముగిసిన ఈ మ్యాచ్లో జింబాబ్వే అన్ని విభాగాల్లో సత్తా చాటింది. బౌలర్లు రెండో ఇన్నింగ్స్లో ఆఫ్ఘనిస్తాన్ కనీసం 200 స్కోర్ కూడా చేయనివ్వలేదు. బ్యాటర్లు ఒకే ఇన్నింగ్స్లో బ్యాటింగ్ చేసి సత్తా చాటారు. ఓపెనర్ బెన్ కర్రన్ (%దీవఆ జబతీత్ఝుఆ%) కెరీర్లో తొలి సెంచరీతో కదంతొక్కాడు. సికందర్ రజా అర్ధ సెంచరీతో రాణించాడు. నిక్ వెల్చ్ 49 పరుగులు చేసి పర్వాలేదనిపించాడు.పేసర్ బ్రాడ్ ఈవాన్స్ (%దీత్ఝుఎ జుఝుఆం%) తొలి ఇన్నింగ్స్లో 5 వికెట్లు తీసి ఆఫ్ఘనిస్తాన్ పతనాన్ని శాశించాడు. ముజరబానీ 3 వికెట్లతో రాణించాడు. రెండో ఇన్నింగ్స్లో రిచర్డ్ నగరవ 5 వికెట్లతో చెలరేగాడు. ముజరబానీ ఈ ఇన్నింగ్స్లోనూ రాణించి 3 వికెట్లు తీశాడు.ఈ మ్యాచ్లో ఆఫ్ఘనిస్తాన్కు (%ూటస్త్రప్ఘుఆఅర్ఝుఆ%) ఒకే ఒక సానుకూల అంశం ఉంది. పేసర్ జియా ఉర్ రెహ్మాన్ 7 వికెట్లతో చెలరేగాడు. ఆఫ్ఘన్ స్టార్ బ్యాటర్లు రహ్మానుల్లా గుర్బాజ్ (37, 9) ఇబ్రహీం జద్రాన్ (19, 42) పెద్దగా రాణించలేకపోయారు. అయినా తొలి ఇన్నింగ్స్లో గుర్బాజ్, రెండో ఇన్నింగ్స్లో జద్రానే టాప్ స్కోరర్లు కావడం విశేషం. కెప్టెన్ హష్మతుల్లా షాహీది (7, 7) రెండు ఇన్నింగ్స్లో నిరాశపరిచాడు. రెండో ఇన్నింగ్స్లో బషీర్ షా (32) ఓ మోస్తరు స్కోర్ చేశాడు.మొత్తంగా ఆఫ్ఘనిస్తాన్ అన్ని విభాగాల్లో దారుణంగా విఫలమై, ఇన్నింగ్స్ పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్లో సెంచరీ చేసిన జింబాబ్వే ఆటగాడు బెన్ కర్రన్కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.కాగా, ఏకైక టెస్ట్ మ్యాచ్, డు మ్యాచ్ల టీ20 సిరీస్ కోసం ఆఫ్ఘనిస్తాన్ జట్టు జింబాబ్వేలో పర్యటిస్తుంది. టెస్ట్ మ్యాచ్ అనంతరం హరారే వేదికగా మూడు టీ20లు (అక్టోబర్ 29, 21, నవంబర్ 2) జరుగనున్నాయి.

# డబ్ల్యూపిఎల్ పార్ట్నర్ రైట్స్ టెండర్లకు ఆహ్వానం



మహిళల ప్రీమియర్ లీగ్ కొత్త సీజన్ 'అధికారిక భాగస్వామి హక్కుల' కోసం భారత క్రికెట్ బోర్డు టెండర్ ప్రక్రియ ప్రారంభించింది. ఆసక్తిగల కంపెనీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తాజాగా ఓ ప్రకటనలో పేర్కొంది. కొత్త పార్ట్నర్ను టెండర్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేయనున్నట్లు బీసీసీఐ తెలిపింది.ఈ నేపథ్యంలో టెండర్లో పాల్గొనాలనుకునే కంపెనీలు రిక్వెస్ట్ ఫర్ కొటేషన్స్ ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కంపెనీలు తాము అనుకునే బడ్జెట్ను అందులో కోట్ చేయాల్సి ఉంటుంది. ఈ రిక్వెస్ట్ ఫర్ కొటేషన్స్ ఫామ్ను రూ.1,00,000 చెల్లించి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అలాగే టెండర్ ప్రక్రియలో బీసీసీఐ పలు నిబంధనలు విధించింది.టెండర్ ప్రక్రియలో పాల్గొనాలనుకునే కంపెనీలు ముందుగా లక్ష రూపాయలు (టాక్స్ అదనం) చెల్లించి రిక్వెస్ట్ ఫర్ కొటేషన్స్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది ఈ లక్ష రూపాయల డిపాడిట్ నాన్ రిఫండెబుల్. టెండర్ రాకపోతే ఈ డబ్బు తిరిగి చెల్లించడం ఉండదు భారతీయ కంపెనీలతోపాటు ఇంటర్నేషనల్ లెవెల్ కంపెనీలు కూడా టెండర్లో పాల్గొనేందుకు అవకాశం ఉందిఆర్ ఎఫ్ క్యూ కొనుగోలు చేసేందుకు నవంబర్ 12 ఆఖరి తేదీ. తమ ఫైనల్ బడ్జెట్ కోట్ చేసి ఫైనల్ డాక్యుమెంట్స్ సమర్పించేందుకు నవంబర్ 21 చివరి తారీఖుపేమెంట్ చెల్లించిన రశీదును మెయిల్ చేయాల్సి ఉంటుందిఫైనాన్షియల్ సర్వీసెస్, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్, అల్కహాల్, టొబాకో, రియల్ మనీ గేమింగ్స్ లాంటి సంస్థలు, కంపెనీలు టెండర్లో పాల్గొనడానికి లేదు. ఆయా కంపెనీలపై బీసీసీఐ నిషేదం విధించిందిటెండర్లో పాల్గొనాలంటే పైన పేర్కొన్న నిబంధనలు, షరతులకు ఆయా కంపెనీలు కచ్చితంగా లోబడి ఉండాల్సిందే. అలాగే కంపెనీలు తమ దరఖాస్తులను సమర్పించడానికి నవంబర్ 12 దాకా ఉంది

డబ్ల్యూనిఎల్ 2026 వేలం : వచ్చే సీజన్కు ప్లేయర్ల మెగా వేలం నవంబర్ 26 నుంచి 29 మధ్యలో జరగనుంది. ప్రతీ ఫ్రాంచైజీకి రూ.15 కోట్ల పర్స్ వ్యాల్యూ ఉంటుంది. ఒక్కో జట్టు గరిష్ఠంగా ఐదుగురు ప్లేయర్లను రిటైన్ చేసుకోవచ్చు. రిటెన్షన్లో తొలి ప్లేయర్కు గరిష్ఠంగా రూ.3.5 చెల్లించాల్సి ఉంటుంది. ఒక రైట్ టు మ్యాచ్ కార్డ్ కూడా అందుబాటులో ఉంటుంది. అయితే నవంబర్ 05 వరకు అన్ని జట్లు తాము రిటైన్ చేసుకున్న ప్లేయర్ల లిస్టు సమర్పించాల్సి ఉంది. ఈ వేలం దిల్లీలో జరగనున్నట్లు తెలుస్తోంది. మొత్తం 90 ప్లేయర్లు వేలంలో తమ పేరు నమోదు చేసుకున్నారు.

రిటెన్షన్ 1: రూ. 3.5 కోట్లు ,రిటెన్షన్ 2: రూ. 2.5 కోట్లు,రిటెన్షన్ 3: రూ. 1.75 కోట్లు,రిటెన్షన్ 4: రూ. కోటి రిటెన్షన్ 5: రూ. 50 లక్షలు.కాగా, మహిళల క్రికెట్కు డొమెస్టిక్ లెవెల్లో క్రేజ్ తీసుకొచ్చేందుకు బీసీసీఐ డబ్ల్యూపీఎల్ ప్రవేశపెట్టింది. 2023లో తొలిసారి ఈ టోర్నీ జరిగింది. అప్పుడు ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీ విజేతగా నిలిచింది. ఆ తర్వాత 2024 ఎడిషన్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్ నెగ్గా, ఈ ఏడాది మార్చిలో జరిగిన మూడో సీజన్లో మళ్లీ ముంబయి ఛాంపియన్ అయ్యింది.

# పీవీఎల్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్‌అవుట్



ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్ను హైదరాబాద్ బ్లాక్హాక్స్ జట్టు పరాజయంతో ముగించింది. గచ్చి'బౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్లో హైదరాబాద్ బ్లాక్హాక్స్ 9-15, 13-15, 15-9, 13-15తో కోల్కతా థండర్బోల్ట్స్ జట్టు చేతిలో ఓడిపోయింది. బ్లాక్హాక్స్ తరఫున ప్రీత్ కరణ్, సాహిల్ కుమార్, యుదీ యామమోటో రాణించారు. నిర్ణీత ఏడు మ్యాచ్లు పూర్తి చేసుకున్న హైదరాబాద్ బ్లాక్హాక్స్ మూడింటిలో గెలిచి, నాలుగింటిలో ఓడి తొమ్మిది పాయింట్లతో ఎనిమిదో స్థానంలో నిలిచి సెమీఫైనల్కు దూరమైంది.

మరో మ్యాచ్లో కొచ్చి బ్లూ స్పైకర్స్ 15%-13, 14-16, 17-15, 15-%9తో అహ్మదాబాద్ డిఫెండర్స్ జట్టును ఓడించింది. ఈ లీగ్లో పోటీపడుతున్న మొత్తం పది జట్లను రెండు గ్రూప్లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో గోవా గార్డియన్స్, చెన్నై బ్లిట్జ్, కొచ్చి బ్లూ స్పైకర్స్, బెంగళూరు టోర్పెడస్, కోల్కతా థండర్బోల్ట్స్... గ్రూప్ 'బి'లో హైదరాబాద్ బ్లాక్హాక్స్, ఢిల్లీ తూఫాన్స్, అహ్మదాబాద్ డిఫెండర్స్, ముంబై మెటియోర్స్, కాలికట్ హీరోస్ జట్లున్నాయి. ఒక్కో జట్టు ఏడు మ్యాచ్లు ఆడుతుంది. ఆయా జట్లు తమ గ్రూప్లోని నాలుగు జట్లతో, మరో గ్రూప్లోని మూడు జట్లతో మ్యాచ్లు ఆడతాయి. లీగ్ దశ ముగిశాక టాప్%-%4లో నిలిచిన జట్లు సెమీఫైనల్కు అర్హత సాధిస్తాయి.

# ఎవర్ గ్రీన్ స్టార్...రెబల్ స్టార్ ప్రభాస్

రెబల్ ఫ్యాన్స్ కు దీపావళితో పాటు వచ్చే పండుగ రెబల్ స్టార్ ప్రభాస్ బర్త్ డే. ఈ నెల 23న ఆయన పుట్టినరోజును ఘనంగా సెలబ్రేట్ చేస్తుంటారు ఫ్యాన్స్, మూవీ లవర్స్. ప్రభాస్ బర్త్ డే ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో నోటెడ్ అకేషన్ గా మారింది. దేశం నలుమూలలా ప్రభాస్ కు అభిమానులు ఉన్నారు, ఆయన సినిమాలను ఇష్టంగా చూసేవాళ్లున్నారు. ఓవర్సీస్‌లో యూఎస్, యూకే, జపాన్.. ఇలా ప్రతి దేశంలోనూ ప్రభాస్ సినిమాల కోసం ఎదురు చూస్తుంటారు. తన సినిమాలకు ఆయా దేశాల్లో వచ్చే బాక్సా ఫీస్ కలెక్షన్స్ ప్రభాస్ యూనివర్సల్ క్రేజ్ కు నిదర్శనంగా నిలుస్తుంటాయి. అందుకే ప్రభాస్ చేసే ప్రతి సినిమా ట్రూ పాన్ వరల్డ్ మూవీ అవుతోంది తన స్టార్ డమ్, ఛరిష్మా, పర్ ఫార్మెన్స్, స్క్రీన్ ప్రెజెన్స్, రికార్డ్ స్థాయి బాక్సాఫీస్ వసూళ్లతో ప్రభాస్ తెలుగు సినిమా ఖ్యాతిని ఖండాంతరాలకు చేర్చారు. ఇండస్ట్రీలో పేరు తెచ్చుకునే హీరోలను చూస్తుంటాం... టాలీవుడ్ కే పేరు తెస్తున్న అరుదైన స్టార్ రెబల్ స్టార్ ప్రభాస్. ఆయన బర్త్ డేకు తన బ్లాక్ బస్టర్ మూవీస్ రీ రిలీజ్ తో పాటు కొత్త సినిమాల అప్డేట్స్ సందడి చేస్తుంటాయి. ఈ నెల 31న ప్రభాస్ కెరీర్‌లో మైల్ స్టోన్ గా నిలిచే మూవీ బాహు బలి ది ఎపిక్ రీ రిలీజ్ అవుతోంది. బాహుబలి రెండు చిత్రా లు కలిసి ఒకే పార్ట్ గా విడుదలకు వస్తుండటం మూవీ లవర్స్, ఫ్యాన్స్ లో ఆసక్తి కలిగిస్తోంది.తెలుగువారు గర్వపడేలా ప్రభాస్ భారీ పాన్ వరల్డ్ మూవీ లైనప్ కంటిన్యూ చేస్తున్నారు. డైరెక్టర్ మారుతితో ప్రభాస్ చేస్తున్న ది రాజా సాబ్ సినిమా వచ్చే సంక్రాంతికి జనవరి 9న గ్రాండ్ రిలీజ్ కు రెడీ అవుతోంది. రాజా సాబ్ మూవీలో ప్రభాస్ ను మనం ఇంతకాలం మిస్ అయిన వింటేజ్ లుక్ లో రొమాంటిక్ హారర్ కామెడీలో చూడబోతున్నాం. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కు వస్తున్న హ్యూజ్ రెస్పాన్స్ చూస్తుంటే బాక్సాఫీస్ వద్ద క్రియేట్ చేయబోయో రికార్డులు కళ్లముందు కదలాడుతున్నాయి. డైరెక్టర్ హను రాఘవపూడి, మైత్రీ మూవీ మేకర్స్ కాంబినేషన్ లో ప్రభాస్ నటిస్తున్న సినిమాపై భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి. సందీప్ వంగా డైరెక్షన్ లో ప్రభాస్ నటించనున్న స్పిరిట్ సినిమాపై ఇప్పటికే స్కై రేంజ్ ఎక్స్ పెక్టేషన్స్ ఉన్నాయి. ప్రభాస్ క్రేజీ లైనప్ లో రానున్న సలార్ 2, కల్కి 2 ఎగ్జైట్ చేస్తున్నాయి. ఈ ఏడాది మంచు విష్ణు కన్నప్ప సినిమాలో ప్రభాస్ చేసిన రుద్ర క్యారెక్టర్ ఆ చిత్రానికే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. రుద్ర పాత్రలో ప్రభాస్ చేసిన డివైన్ పర్ ఫార్మెన్స్ అందరినీ ఆకట్టుకుంది.మచ్చలేని జీవితం, శత్రువు ఎరుగని వ్యక్తిత్వం, చేతికి ఎముకలేని దాతృత్వం, మర్చిపోలేని ఆతిథ్యం...ఇవన్నీ ప్రభాస్ ను అందరూ ఇష్టపడే డార్లింగ్ లా మార్చేశాయి. స్టార్ గా ప్రభాస్ స్టామినా బాక్సాఫీస్ రికార్డులు చెబితే, అందరూ ప్రేమగా పిలిచే డార్లింగ్ అనే మాట వ్యక్తిగా ఆయన గొప్పదనం చూపిస్తుంది. తెలుగు తెరపై వరుస విజయాలతో ప్రభాస్ మరెన్నో ఇలాంటి పుట్టినరోజులు జరుపుకోవాలని కోరుకుందాం.



# 'సూపర్ డూపర్' మాస్ విందు



మాస్ జాతర' చిత్రం నుండి ఇప్పటికే విడుదలైన 'తు మేరా లవర్', 'ఓలే ఓలే', 'హుడియో హుడియో' గీతాలు శ్రోతలను విశేషంగా ఆకట్టుకొని, సామాజిక మాధ్యమాల్లో ఉర్రూతలూగించాయి. తాజాగా చిత్ర బృందం, నాలుగో గీతంగా ఉత్సాహభరితమైన మాస్ పాట 'సూపర్ దూపర్'ను విడుదల చేసింది. రవితేజ మాస్ కి, శ్రీలీల ఎనర్జీకి తగ్గట్టుగా స్వరపరిచిన ఈ బ్లాక్ బస్టర్ ట్యూన్ అందరినీ కట్టిపడేస్తోంది. 'మాస్ జాతర' చిత్రాన్ని, ఆల్బమ్ ని మరింతగా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లేలా ఈ 'సూపర్ దూపర్' గీతముంది. రెండు ఉత్సాహభరితమైన పాటలు, ఓ మంచి మెలోడీతో ఇప్పటికే 'మాస్ జాతర' ఆల్బమ్ ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. తాజాగా విడుదలైన మాస్ ని ఉర్రూతలూగించే ఈ 'సూపర్ దూపర్' గీతం, ఆ స్థానాన్ని మరింత పదిలం చేసింది. మునుపటి మాస్ మహారాజా రవితేజను గుర్తుచేసేలా, ఆయనకు మాత్రమే సాధ్యమయ్యే స్వాగ్ ఇందులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీలీల తన అద్భుతమైన నృత్య ప్రదర్శనతో మరోసారి తెరపై వెలుగులు వెదజల్లారు. రవితేజ-శ్రీలీల ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ, ఈ మాస్ గీతాన్ని ప్రేక్షకులు మెచ్చే నిజమైన వేడుకలా మలిచాయి. 'సూపర్ దూపర్' గీతాన్ని సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో తనదైన శైలిలో అద్భుతంగా స్వరపరిచారు. మాస్ ని మెప్పించడంతో పాటు, అందరినీ కాలు కదిపేలా చేసేలా ఎంతో హుషారుగా ఈ గీతముంది. భీమ్స్ సిసిరోలియోతో కలిసి రోహిణి సోరట్ ఆలపించడం ఈ పాటకు మరింత హుషారుని తీసుకొని వచ్చింది. గీత రచయిత సురేష్ గంగుల అందరూ పాడుకునేలా ఉల్లాసభరితమైన సాహిత్యాన్ని అందించి ఆకట్టుకున్నారు. సంగీతం, గానం, సాహిత్యం అన్నీ చక్కగా కుదిరి.. 'సూపర్ దూపర్'ను ఓ గొప్ప మాస్ గీతంగా తీర్చిదిద్దాయి.

# నిర్మాత నుంచి దర్శకుడిగా మారుతున్నా- సతీష్

సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్పై బట్టలరామస్వామి బయోపిక్, కాఫీ విత్ ఏ కిల్లర్, సోలోబాయ్ సినిమాలను నిర్మించిన ప్యాషనేట్ ప్రొడ్యూసర్ సెవెన్ హిల్స్ సతీష్ తన పుట్టినరోజు(అక్టోబర్ 23) సందర్భంగా నూతన ప్రయాణం మొదలుపెట్టినట్లు ప్రెస్ మీట్ పెట్టి ప్రకటించారు. 3 విజయవంతమైన సినిమాలను నిర్మించి సతీష్.. త్వరలో దర్శకుడిగా మారబోతున్నట్లు తెలిపారు.

డైరెక్టర్ కావాలనే లక్ష్యంతో ఇండస్ట్రీకి వచ్చిన తను నిర్మాతగా ప్రారంభమై సినిమా నిర్మాణానికి అన్నీ నేర్చుకుని పూర్తిగా సన్నద్ధం అయిన తర్వాత తన లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అలాగే తన బ్యానర్లో ఇంకో రెండు సినిమాలు తీస్తున్నట్లు చెప్పారు. ఎడిటర్ ప్రవీణ్ పూడి దర్శకత్వంలో ఒక సినిమా తీస్తున్నామని, రాజశేఖర్ గడ్డం దర్శకత్వంలో మరో సినిమా స్క్రిప్ట్ దశలో ఉందని చెప్పారు. నార్నె నితిన్ హీరోగా ఉగాది రోజున ప్రారంభమైన సినిమా అనుకోకుండా పట్టాలెక్కకపోవడంతో ఆ కథను సరికొత్తగా మార్చి త్వరలో సినిమా చేస్తున్నామని చెప్పారు. ఈ రెండు సినిమాల అప్డేట్స్ వచ్చే ఏడాదిలో ఇస్తామన్నారు.సోలోబాయ్ ఈవెంట్లో తన గురువు వీవీ వినాయక్ చెప్పిన విధంగా తాను డైరెక్టర్ అవ్వాలనే ప్రయత్నాన్ని ఈ పుట్టినరోజు సందర్భంగా మొదలు పెట్టినట్లు సెవెన్ హిల్స్ సతీష్ తెలిపారు. మూడు సినిమాల అనుభవంతో వచ్చే ఏడాది దర్శకుడిగా మారబోతున్నట్లు చెప్పారు.



తన స్నేహితుల సహాయంతో వాళ్ల నిర్మాణంలో తన మొదటి సినిమా డైరెక్షన్ చేయబోతున్నట్లు చెప్పారు. తొలిసారి మీడియా సమక్షంలో కేక్ కట్ చేసి గ్రాండ్గా బర్త్ డే జరుపుకోవడం కొత్తగా ఉందన్నారు. ప్రభాస్ పుట్టినరోజే తన బర్త్ డే కావడం హ్యాపీగా ఉందన్నారు. మూడు సినిమాల నిర్మాణంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నా. అన్ని క్రాఫ్టకు సంబంధించి విషయాలు నేర్చుకున్నాను. వయసులో ఉన్నప్పుడే డైరెక్షన్ చేయాలని వీవీ వినాయక్ గారు చెప్పడంతో డైరెక్టర్గా మారుతున్నా. నార్నె నితిన్ డేట్స్ అలాగే ఉన్నాయి. కథ ఓకే అయితే ఆయనతో సినిమా చేస్తాను. కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా చేయాలని ప్రయత్నిస్తున్నా. డైరెక్టర్గా డెబ్యూ మూవీ అనేది చాలా ముఖ్యం. మంచి సినిమా చేస్తేనే మన ట్యాలెంట్ ఏంటనేది బయటపడుతుంది. ఆ ప్రయత్నంలోనే ఉన్నాను.

# అమ్మడివే అంటున్న 'కాంత'



వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ బైలింగ్వల్ పీరియాడికల్ డ్రామా 'కాంత' నవంబర్ 14న రిలీజ్ కానుంది. 1950మద్రాస్, సినిమా గోల్డెన్ ఏజ్ బ్యాక్ డ్రాప్ రూపొందుతున్న ఈ చిత్రానికి సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. కాంత అద్భుతమైన ప్రేమకథతో పాటు మూవీ వరల్డ్ కి ట్రిబ్యూట్. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా.. సముద్రఖని కీలక పాత్రలో నటిస్తున్నారు. చిత్రాన్ని దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ తో కలిసి సంయుక్తగా నిర్మిస్తున్నారు. టీజర్, ఫస్ట్ సింగిల్తో ఇంపాక్ట్ క్రియేట్ చేసిన తర్వాత, మేకర్స్ ఇప్పుడు అమ్మడివే సాంగ్ ని విడుదల చేశారు. ఝాను చంథర్ కంపోజ్ చేసిన ట్రాక్ వింటేజ్ ఆర్కెస్ట్రేషన్ తో ఆకట్టుకుంది. కృష్ణకాంత్ సాహిత్యం, ప్రదీప్ కుమార్ వోకల్స్ ఎమోషనల్ గా హత్తుకున్నాయి. అమ్మడివే క్లాసిక్ రొమాన్స్ లవర్స్ కి ఇన్స్టంట్ గా కనెక్ట్ అవుతుంది.

# హాలీవుడ్‌లో హీరో రాజ్ దాసిరెడ్డి




మన తెలుగు చిత్రసీమను టాలీవుడ్ అంటున్నామన్నా... హిందీ ఇండస్ట్రీని "బాలీవుడ్", కన్నడ పరిశ్రమను "శాండల్ వుడ్", మలయాళంను "మల్లువుడ్", తమిళ ఫిల్మ్ ఇండస్ట్రీని "కోలీవుడ్"గా పిలుచుకుంటున్నామంటే... దానికి ప్రేరణ "హాలీవుడ్" అన్న విషయం అందరికీ తెలిసిందే. తెలుగు సినిమా పతాక గత కొన్ని సంవత్సరాలుగా అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడుతున్నా.... మన దేశంలో రూపొందిన ఏదైనా సినిమా అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కితే... దానిని "హాలీవుడ్ స్థాయిలో రూపొందిన చిత్రంగా అభివర్ణించడం ఇప్పటికీ సర్వసాధారణం. అంతేకాదు... సినిమాలకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా అత్యున్నత పురస్కారం "ఆస్కార్"ను అందించేది కూడా హాలివుడ్డే. అందుకే "ట్రిపులార్" చిత్రం ఆస్కార్ అందుకోవడాన్ని మన దేశం మొత్తం గర్వాతిశయంతో సెలబ్రేట్ చేసుకుంది. ఈ ఉపోద్ఘాతం అంతా ఎందుకంటే... ఇంతటి ప్రతిష్టాత్మక ఆస్కార్ సంబరాల్లో (97వ అకాడమీ అవార్డ్స్ లో) ఈ ఏడాది మన తెలుగు హీరో సందడి చేశాడు. చాలా అరుదుగా మాత్రమే ఆరుదెంచే ఈ అద్భుత అవకాశాన్ని అందుకున్న ఆ తెలుగు తేజం పేరు "రాజ్ దాసిరెడ్డి". "రాజాసాబ్"తో పాన్ ఇండియా దర్శకుల జాబితాలో చోటు దక్కించుకున్న మల్టీ టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో "భద్రం బి కేర్ ఫుల్ బ్రదరు" చిత్రంతో హీరోగా అరంగేట్రం చేసిన ఆరడుగుల అందగాడైన రాజ్ దాసిరెడ్డి... ఆస్కార్ - 2025 వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం అందుకొని, అక్కడకు వెళ్లడంతోపాటు, "హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్" "న్యూయార్క్ ఫ్యాషన్ వీక్ - 2025"లోనూ సందడి చేశాడు.

# అందరినీ ఆకట్టుకునే 'లవ్ ఓటీపీ'



శ్రీమతి. పుష్ప మణిరెడ్డి సమర్పణలో భావప్రీత ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అనీష్ హీరోగా స్వీయ దర్శకత్వంలో రానున్న 'లవ్ ఓటీపీ' చిత్రాన్ని విజయ్ ఎం రెడ్డి నిర్మించారు. ఈ చిత్రంలో రాజీవ్ కనకాల ప్రధాన పాత్రలో నటించారు. జాన్విక, నాట్య రంగ వంటి వారు కీలక పాత్రల్ని పోషించారు. ఈ సినిమాను నవంబర్ 14న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మేరకు బుధవారం నాడు 'లవ్ ఓటీపీ'కి సంబంధించిన ట్రైలర్ను రిలీజ్ చేశారు. ఈ క్రమంలో నిర్వహించిన ఈవెంట్లో.. హీరో, దర్శకుడు అనీష్ మాట్లాడుతూ .. 'హీరో అవ్వాలని చిన్నప్పటి నుంచీ కలలు కంటుండేవాడిని. అదే విషయాన్ని మా నాన్న గారికి చెప్పాను. ఆయన సాయంతో ఎన్నెన్నో ప్రయత్నాలు చేశాను. వైజాగ్ మూర్తి వద్ద యాక్టింగ్ నేర్చుకున్నాను. అల్లు అర్జున్తో కలిసి షెడ్డులో డ్యాన్స్ ప్రాక్టీస్ చేశాను. 'నెలవంక' మూవీ ఓపెనింగ్కు బన్నీ కూడా గెస్టుగా వచ్చారు. అయితే ప్రొడక్షన్లోకి వద్దు అని బన్నీ సలహా ఇచ్చినా నేను వినలేదు. ఆ మూవీ తరువాత నేను కన్నడకు వెళ్లిపోయాను. గౌతమ్ తిన్ననూరి కూడా మంచి స్నేహితుడు. 'మళ్లీ రావా' కూడా మిస్ అయింది. ఎప్పటి నుంచో మళ్లీ తెలుగులోకి రావాలని చాలా ప్రయత్నాలు చేసి విఫలం అయ్యాను. మళ్లీ ఇప్పుడు ఇలా ఇన్నేళ్లకు టెక్నీషియన్గా, దర్శకుడిగా, హీరోగా ఆడియెన్స్ ముందుకు వచ్చాను. ఇందులో మంచి కంటెంట్ ఉంటుంది. అదే మా ఈవెంట్కు గెస్ట్. మేం కంటెంట్ను నమ్మి ఈ మూవీని చేశాం. అందుకే పది రోజుల ముందే మీడియాకు ఈ మూవీని చూపించాలని అనుకున్నాం. విజయ్ సహకారాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను. రాజీవ్ కనకాల గారు ఈ మూవీని భుజానికెత్తుకుని ముందుకు తీసుకు వెళ్తున్నారు. నవంబర్ 14న ఈ చిత్రం రాబోతోంది. అందరినీ ఆకట్టుకునేలా ఈ చిత్రం ఉంటుంది. అందరూ చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు.

# 'గుమ్మడి నర్సయ్య' నుంచి మోషన్ పోస్టర్ విడుదల



ప్రఖ్యాత రాజకీయ నాయకుడు, ప్రజా మనిషి గుమ్మడి నర్సయ్య జీవిత చరిత్రను తెరపైకి తీసుకు వస్తున్నారు. పేద ప్రజల గురించి ఆలోచించే రాజకీయ నాయకుడిగా గుమ్మడి నర్సయ్యకు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మంచి పేరు అందరికీ తెలిసిందే. ఇక గుమ్మడి నర్సయ్య పాత్రలో కరుణాడ చక్రవర్తి శివ రాజ్ కుమార్ నటించబోతున్నారు. ప్రవల్లిక ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్ మీద ఎన్. సురేష్ రెడ్డి నిర్మాతగా పరమేశ్వర్ హివ్రాలే దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కబోతోంది. ఈ మేరకు చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను, మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇక ఈ పోస్టర్‌ను, మోషన్ పోస్టర్‌ను చూస్తుంటే గుమ్మడి నర్సయ్య పాత్రకు శివ రాజ్ కుమార్ ప్రాణం పోసినట్టుగా కనిపిస్తోంది. ఆ లుక్, వేషధారణ అన్నీ కూడా అద్భుతంగా ఉన్నాయి. సైకిల్, వెనకాల ఉన్న అసెంబ్లీ, ఎర్ర కండువా ఇలా అన్నీ కూడా ఎంతో అథెంటిక్‌గా ఉన్నాయి. ఇక ఈ పోస్టర్‌తో ఒక్కసారిగా అంచనాలు పెంచేసినట్టు అయింది. ఇక మోషన్ పోస్టర్‌లో ఎమ్మెల్యేలు అంతా కూడా కారులో వస్తుంటే.. గుమ్మడి నర్సయ్య మాత్రం సైకిల్‌లో రావడం.. ఆ మ్యూజిక్, ఆర్ఆర్.. విజువల్స్ అన్నీ కూడా అద్భుతంగా అనిపిస్తోంది.నిర్మాత ఎన్. సురేష్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ ఎత్తున నిర్మించబోతోన్నారు. ఈ చిత్రానికి కెమెరామెన్‌గా సతీష్ ముత్యాల, సంగీత దర్శకుడిగా సురేష్ బొబ్బిలి, ఎడిటర్‌గా సత్య గిడుటూరి పని చేస్తున్నారు. త్వరలోనే మూవీకి సంబంధించిన ఇతర విషయాల్ని ప్రకటించనున్నారు.

# శివాజీ, లయ 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'

శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ పై రెండవ ప్రాజెక్టుగా సుధీర్ శ్రీరామ్ రచన దర్శకత్వంలో వింటేజ్ బ్లాక్ బస్టర్ కపుల్ నటుడు శివాజీ, లయ జంటగా నటిస్తూ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మరోసారి ఈటీవీ విన్ తో కలిసి శివాజీ పనిచేస్తున్నారు. 90 s వెబ్ సిరీస్ లో శివాజీతో కలిసి నటించిన బాల నటుడు రోహన్, అలీ, ధనరాజ్, రఘుబాబు, 30 ఇయర్స్ పృథ్వీ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా టైటిల్ రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి సాంప్రదాయని సుప్పిని సుద్దపూసని అనే ఆసక్తికరమైన టైటిల్ పెట్టారు. 90 వెబ్ సిరీస్లో శివాజీ, రోహన్ మధ్య వచ్చే ఈ బీజీఎం వైరల్ అయ్యింది. ఈ టైటిల్ పెట్టడం మరింత ఆసక్తి పెంచింది. ఈ చిత్రంలో పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్ గా కనిపించనున్నారు. టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్ లో శివాజీ, లయ సీరియస్ గా నడుస్తూ ముందుకు వస్తుండగా రోహన్ సెల్ఫీ తీసుకుంటూ కనిపించడం క్యూరియాసిటీ పెంచింది. మేకర్స్ రిలీజ్ చేసిన మోషన్ పోస్టర్ చాలా క్రియేటివ్ గా వుంది. చిత్తూరు బ్యాక్ డ్రాప్ లో జరిగే కథలో ఒక క్రైమ్ ఎలిమెంట్ కూడా వున్నట్లు మోషన్ పోస్టర్ లో చాలా ఎక్సయిటింగ్ గా ప్రజెంట్ చేయడం సినిమాపై ఆసక్తిని పెంచింది.




PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044